PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 322 | విజయవాడ, గురువారం 27 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 27 June 2024 | Rs

అయ్యో.. కాంట్రాక్ట్ అధ్యాపకులు..!
- నేటికీ విడుదల కాని రెన్యువల్ ఉత్తర్వులు
- 2 నెలలుగా జీతాలు లేక అవస్థలు
- రాష్ట్ర వ్యాప్తంగా 4,369 అధ్యాపకుల పరిస్థితి అయోమయం
- గత ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిన రెగ్యులరైజేషన్ ప్రక్రియ

3

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా టీమిండియా

- నేడు సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో ఢీ
- పొంచివున్న వర్షం ముప్పు

8

స్పీకర్‌గా ఓం బిర్లా
లోక్‌సభ మూజువాణి ఓటుతో ఎన్నిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పద్దెనిమిదవ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నికయ్యారు. రెండో మోడీ ప్రభుత్వ హయాంలో కూడా ఓం బిర్లానే లోక్‌సభస్పీకర్‌గా ఉన్నారు. స్పీకర్ స్థానానికి బిర్లాకు పోటీగా ఇండియా బ్లాక్ తరుపున కాంగ్రెస్ సీనియర్ ఎంపీ కె సురేష్ నిలిచారు. బుధవారం మూజువాణి ఓటుతో ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రకటించడంతో ఆయనను ప్రధాని నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లారు. సభను ప్రారంభం కాగానే పశ్చిమ బెంగాల్‌కు చెందిన టిఎంసి ఎంపి అధికారి దీపక్ చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. అనంతరం స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఓం బిర్లా పేరును ప్రతిపాదిస్తూ 17 తీర్మానాలు రాగా, కె సురేష్ పేరును ప్రతిపాదిస్తూ మూడు తీర్మానాలు వచ్చాయి. ఓ బిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బలపరిచారు. ఆర్డర్ ప్రకారం ఈ తీర్మానం మొదట వచ్చినందున దీనిని ప్రొటెం స్పీకర్ ఓటింగ్‌కు పెట్టారు. ఈ తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందడంతో మిగతా తీర్మానాలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రతిపక్షాలు కూడా బ్యాలెట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్‌కు పట్టుబట్టకపోవడంతో స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు.. ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రకటించిన తరువాత కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (జెడియు) లేచి డివిజన్ (ఓటింగ్)కు డిమాండ్ చేశారు. ప్రొటెం స్పీకర్ మెహతాబ్ జోక్యం చేసుకొని, ఆ దశ దాటిపోయామని చెప్పారు. ఇండియా బ్లాక్ అభ్యర్థి సురేష్ తరపున సమర్పించిన మూడు తీర్మానాల్లో ఒకదానిని అరవింద్ గణపత్ సావంత్ (శివసేన-ఠాక్రే) ప్రతిపాదించగా, ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి) బలపరిచారు. రెండో తీర్మానాన్ని ఆనంద్ భదౌరియా (ఎస్‌పి), మూడో తీర్మానాన్ని సుప్రియా సులే (ఎన్‌సిపి-శరద్ పవర్) ప్రతిపాదించారు. సభా సంప్రదాయంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఓం బిర్లా వద్దకు వెళ్లి అభినందనలు తెలిపారు. ఆ తరువాత స్పీకర్ స్థానం వద్దకు ఆయనను వారు తోడ్కొని వెళ్లారు.. స్పీకర్ తన సీట్లో ఆశీనులైన తరువాత వివిధ పార్టీల సభ్యులు స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ముగియగానే ప్రధాని మోడీ మంత్రులను సభకు పరిచయం చేశారు.

18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు అభినందనలు తెలుపుతున్న ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్, పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

ఏ ముస్లిం ఎంపీని టెర్రరిస్టు అని పిలవొద్దు
- నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ మెహదీ



న్యూఢిల్లీ: ముస్లిం పార్లమెంటేరియన్‌ను టెర్రరిస్టుగా అభివర్ణించడం వంటి అవమానకర వ్యాఖ్యలు చేయకుండా సభ్యులను నిరోధించడం ద్వారా సభ పవిత్రతను కాపాడాలని శ్రీనగర్ నుంచి ఎన్నికైన ఎంపీ అగా సయ్యద్ రుహేల్లా మెహదీ బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు కు హడావిడిగా చట్టాలు చేయడం లాంటి వాటికి పద్దెనిమిదవ లోక్‌సభలో తావివ్వరాదని ఆయన కోరారు. బిర్లా స్పీకర్‌గా ఎన్నికైన తరువాత రెండు నిమిషాల ప్రారంభ ప్రసంగంలో ఈ నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ ఉద్వేగభరితమైన విజ్ఞప్తిని చేస్తూ, 'ఈ రోజు నుండి మీరు బిజెపి లేదా కాంగ్రెస్ లేదా సమాజ్‌వాదీ కాదు. మీకు ఒకే పార్టీ ఉంది. అదే రాజ్యాంగం. దానిని తు.చ తప్పక అనుసరించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తారని, ప్రజాతంత్రయుతంగా సభను నడిపిస్తారని ఆశిస్తున్నాను'. అని చెప్పారు. గత సెప్టెంబరులో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిఎస్‌పికి చెందిన ఎంపీ డానిష్ అలీని ముస్లిం ఉగ్రవాది అని బిజెపి ఎంపీ రమేష్ బిదూరి దూషించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దు బిల్లు హడావిడిగా ఆమోదించుకోకడాన్ని ప్రస్తావిస్తూ ఇటువంటి కీలకమైన బిల్లులపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముందన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు
- ఈసారి సిబిఐ వంతు
- మూడు రోజుల కస్టడీ

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై కక్ష కట్టిన కేంద్రం ఆయనను మరో కేసులో అరెస్టు చేసింది. ఇప్పటికే ఇడి కేసులో అరెస్టయిన ఆయనను బుధవారం సిబిఐ మరోసారి అరెస్టు చేసింది. ఆ వెంటనే మూడు రోజుల సిబిఐ కస్టడీ విధిస్తూ స్పెషల్ జడ్జి అమితాబ్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు. రోజుకు 30 నిమిషాల పాటు లాయర్‌ను కలుసుకోవడానికి కేజ్రీవాల్‌కు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం తీహర్ జైలుల్లో కేజ్రీవాల్ ఉన్నారు. కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చిన తర్వాత సిబిఐ తమ వాదనలు వినిపిస్తూ.. మద్యం దుకాణాలను ప్రైవేటీకరించాలని కేబినెట్ సహచరుడు (సిసోదియాను ఉద్దేశిస్తూ) సిఫార్సు చేశారని కేజ్రీవాల్ చెప్పినట్లు కోర్టుకు వెల్లడించింది. కేజ్రీవాల్ తన వాదనలను స్వయంగా వినిపించారు. ఈ కేసులో మనీష్ సిసోడియా దానిని ఖండించారు. ఈ కేసులో తనను సిబిఐ గతేడాది సాక్షిగా విచారించిన విషయాన్ని కేజ్రీవాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మద్యం విధానానికి సంబంధించి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అప్పుడే సిబిఐకి వెల్లడించినట్లు చెప్పారు.

సుప్రీంలో పిటిషన్ వెనక్కి

బుధవారం తనను సిబిఐ అరెస్టు చేయడంతో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌ను సవరించేందుకు వీలుగా కేజ్రీవాల్ వెనక్కి తీసుకున్నారు. ఈ నెల 21న తనకు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ విచారణ బుధవారం జరగాల్సి ఉంది. పిటిసన్ వెనక్కి తీసుకోవాలన్న కేజ్రీవాల్ అభ్యర్థనను సుప్రీంకోర్టు అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఆదేశాలు, సిబిఐ అరెస్టు వంటి కొత్త పరిణామాల నేపథ్యంలో సమగ్ర పటిషన్‌ను దాఖలు చేస్తామని ఆయన తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు.

సర్కార్ బడికి 10 లక్షల మంది దూరం
- మూడేళ్లల్లో భారీగా తగ్గిన విద్యార్థులు
- ఈ ఏడాది 3లక్షల మంది దూరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతుంది. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఫలితం ఇవ్వడం లేదు. బూట్లు, బట్టలు, బ్యాగులు, పుస్తకాలు ఇస్తున్నామని చెబుతున్నా ఏటికేడాది విద్యార్థులు మాత్రం తగ్గుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ కూడా సర్కారు బడికి శాపంగా మారింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కలిపారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతుల విద్యార్థులు 20 మంది లోపే ఉంటున్నారు. దీంతో ఒక్క ఉపాధ్యాయుడే ఈ పాఠశాలల్లో ఉంటున్నారు. ఫలితంగా పిల్లలను ప్రభుత్వ బడికి పంపడానికి తల్లితండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా మూడేళ్ల కాలంలో ప్రభుత్వ బడికి వెళ్లే విద్యార్థులు 10 లక్షల మంది తగ్గిపోయారు. 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 45,60,041 మంది చదివారు. ఈ సంఖ్య 2022-23 నాటికి 39,96,064కు పడిపోయింది. 2023-24 విద్యా సంవత్సరంలో మరింత తగ్గి 38లక్షలకు పడిపోయింది. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రభుత్వ బడుల్లో 35.20లక్షల మంది విద్యార్థులే ఉన్నారు. ప్రతి ఏటా సుమారు సుమారు 4లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి దూరమవుతున్నారు. కర్నూలు జిల్లాలో 55 పాఠశాలల్లో గతేడాది 11,324 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 9,743 మంది మాత్రమే ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 5 మండలాల పరిధిలో ఉన్న 36 పాఠశాలల్లో గతేడాది 1,236 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 918మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు 44,113 ఉన్నాయి. వీటిలో బుధవారం 29,52,271 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకున్నారు .విలీనం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. 2018-19 విద్యాసంవత్సరంలో 38.30లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారు. 2019-20 విద్యాసంవత్సరంలో 38.19లక్షల మంది విద్యార్థులు చేరారు. కరోనా వల్ల 2021-21లో 43,42,874 మంది, 2021-22లో 45, 60,041 మంది విద్యార్థులు చేరారు. ఆ రెండు సంవత్సరాలు మినహాయిస్తే ఆ తరువాత విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

వివరాలు రహస్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే లెక్కలను పాఠశాల విద్యాశాఖ అధికారికంగా చెప్పడం లేదు. ప్రతిసారీ ఒక్కో లెక్కను చెబుతోంది. గత విద్యాసంవత్సరం (2023-24) ప్రారంభంలో 38,25,000 మంది చేరారని అధికారులు సమాచార హక్కు చట్టం కింద అడిగితే సమాచారం అందించారు. మేలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలో 36.50లక్షల విద్యార్థులే చేరినట్లు వెల్లడించారు.

బిజెపికి మద్దతు విచారకరం
స్పీకర్ ఎన్నికలో వైసిపి తీరుపై సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోక్‌సభ స్పీకరు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని వైసిపి బలపర్చడం విచారకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి చర్య లౌకికతత్వాన్ని దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాల దేశ చరిత్రలో స్పీకరు అధికారపక్షం, డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్షం తీసుకుంటూ వస్తున్న సంప్రదాయాన్ని మోడీ ప్రభుత్వం తిరస్కరించడం వల్లే ప్రతిపక్షాలు (ఇండియా బ్లాక్ పార్టీలు) స్పీకర్ పదవికి పోటీపడ్డాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియను, పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడాలన్న లక్ష్యంతోనే ఆ పని చేసిందని తెలిపారు. ఇటువంటి సమయంలో ప్రతిపక్షానికి బలం చేకూర్చడం ద్వారానే నిరంకుశ పోకడలను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని, కానీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సభ్యులు అధికార పార్టీని బలపరచడం ద్వారా మోడీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు మద్దతు తెలపడం గర్హనీయమని పేర్కొన్నారు. శాసనసభలో 10 శాతం సభ్యులు లేకపోయినా ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతున్న వైసిపి కేంద్రంలో మాత్రం ప్రజాస్వామ్య వైఖరిని బలపరచకపోవడం ఆ పార్టీ ద్వంద్వ నీతిని వెల్లడిస్తోందని తెలిపారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడటం కోసం డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష పార్టీలకు ఇవ్వాలని కోరితే సమంజసంగా ఉండేదని అన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల వైఖరులను ప్రజలు నిరసించాలని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టేలా వారిపై ఒత్తిడి తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది.

కేంద్ర ప్రభుత్వం సహకరించేనా?
- నత్తనడకన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనులు
- రాష్ట్రంలోని నూతన సర్కారుపై కోనసీమ వాసుల ఆశలు

3

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరెస్టు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పల్నాడు జిల్లా నరసరావుపేటలో పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం ఆయనను కోర్టులో హాజరుపర్చనున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల సమయంలో జరిగిన నేరాలకు సంబంధించి గత నెలలో పిన్నెల్లిపై కేసులు నమోదు కాగా, ఆయన హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. తాజాగా పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసి పల్నాడు జిల్లా ఎస్‌పి కార్యాలయానికి తరలించారు. మే 13న మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు వద్దగల పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఇవిఎంలను ధ్వంసం చేసినట్లు, అడ్డుకోబోయిన టిడిపి ఏజెంట్‌పైనా, అదే రోజు రెంటచింతలలో మహిళపైనా, ఆ మరుసటి రోజు కారంపూడిలో సిఐపైనా హత్యాయత్నం చేసినట్లు పిన్నెల్లిపై గతంలో కేసులు నమోదయ్యాయి.

అతిసారకు చిన్నారి బలి
- అదుపులోకి రాని వ్యాధి
- పెరుగుతున్న కేసులు
- కొత్త ప్రాంతాలకు విస్తరణ
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

భయపడుతున్నట్లుగానే రాష్ట్రంలో అతిసార విజృంభణ కొనసాగుతోంది. కొత్త ప్రాంతాలకూ విస్తరిస్తోంది. విద్యార్థులు కూడా దీని బారిన పడ్డారు. బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతోంది. దీంతో, ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం కాట్రపల్లి దళితవాడకు చెందిన కామాక్షి, దస్వంత్‌ల కుమార్తె దర్శిని (2) అతిసారతో బుధవారం మృతి చెందింది. గంటలోనే వాంతులతోపాటు 15సార్లు విరేచనాలు కావడంతో ఆ చిన్నారిని తల్లిదండ్రులు శ్రీకాళహస్తిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అయినా, ఫలితం లేకపోయింది. దర్శిని తమ్ముడు హర్షిత్ (9 నెలల పసికందు)కు కూడా విరేచనాలు అవుతుండడంతో ఆస్పత్రిలో చేర్చారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన 32 మంది అతిసార బారిన పడి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలోనూ, మరో 17 మంది కెవిబిపురం పిహెచ్‌సిలోనూ, ప్రయివేట్ ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు. నాలుగు నెలలుగా తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేయలేదని, ఈ ట్యాంక్ నుంచి వచ్చిన పాచిపట్టిన నీటిని తాగడం వల్లనే అతిసార ప్రబలిందని స్థానికులు వాపోతున్నారు. దర్శిని మృతదేహాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డిఎం అండ్ హెచ్‌ఒ శ్రీహరి పరిశీలించారు. ఆ చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని, ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

దర్శిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డిఎంహెచ్‌ఒ శ్రీహరి

అనంతపురం జిల్లాలో బాలికల గురుకుల పాఠశాలలో 17 మందికి

అనంతపురం జిల్లా గుత్తి మండలం రజాపురం గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు 17 మంది అతిసార బారిన పడ్డారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి మిగతా 2లో

జగన్ ఫ్లోర్ లీడర్ మాత్రమే
- ప్రతిపక్ష హోదా సాధ్యం కాదు : మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదని, వైసిపి ఫ్లోర్ లీడర్ మాత్రమేనని శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ప్రతిపక్ష హోదా కల్పించాలని జగన్ రాసిన లేఖను చదువుతూ పలు అంశాలను మీడియాకు వెల్లడించారు. కనీసం పదిశాతం సీట్లు ఉంటే ప్రతిపక్ష హోదా వస్తుందని, అది సంప్రదాయంగా వస్తోందని తెలిపారు. అయితే వైసిపి నాయకులు రాసిన లేఖలో పేర్కొన్న పలు అంశాలు అసత్యాలని, అవగాహనా రాహిత్యంగా రాసినవని అన్నారు. జరగని అంశాలను జరిగినట్లు చూపించారని పేర్కొన్నారు. జగన్‌కు ఆప్తుడైన కెసిఆర్‌కు కూడా గతంలో కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. స్పీకర్‌కు లేఖ రాయడం అది కూడా బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదని అన్నారు. జగన్ మద్యం, ఇసుక ఖాతాల పుస్తకాలే కాకుండా శాసనసభా వ్యవహారాల మిగతా 2లో

సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్
- ఇదే మా ప్రభుత్వ విధానం
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు
- కుప్పం పర్యటనలో చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ తమ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కుప్పం నుంచే పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుడుతున్నామన్నారు. కుప్పం అభివృద్ధికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పేదరికంలేని గ్రామం, పేదరికంలేని మండలం, పేదరికం లేని నియోజకవర్గంగా ముందు కుప్పాన్ని తయారు చేస్తామన్నారు. గత పాలనకు, ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉంటుందని ఉద్ఘాటించారు. అధికారులు ఫిజికల్‌గానూ, వర్చువల్‌గానూ పనివిధానాలకు సిద్ధపడాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజు బుధవారం కూడా ప్రజలను నుంచి అర్జీలను చంద్రబాబు స్వీకరించారు. అనంతరం కుప్పం అతిథి గృహంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. బలవంతపు జనసమీకరణతో పెద్ద పెద్ద మీటింగ్‌లు, భారీ కాన్వాయ్‌లు, సైరన్ల మోతతో హంగామాలు తమ ప్రభుత్వంలో ఉండబోవన్నారు. సాయంత్రం ఆరు గంటల తరువాత సమావేశాలు వద్దని ఇప్పటికే మంత్రులకు చెప్పినట్లు తెలిపారు. అధికారులు ఫాస్ట్‌గా రియాక్ట్ అయ్యి, ఎఫెక్టివ్‌గా కార్యక్రమాలు చేయాలని సూచించారు. కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎటువంటి పరిస్థితుల్లోనూ కనిపించకూడదన్నారు. రౌడీయిజం మిగతా 2లో

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వచ్ఛాంధ్ర నిధులపై అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సిఎం పవన్

లెక్క తేల్చాల్సిందే!
- స్వచ్ఛాంధ్ర నిధుల మళ్లింపుపై అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు ఎటు మళ్లించారు? ఎవరి ఆదేశాలతో ఆ పని చేశారో నిగ్గు తేల్చాల్సిందేనని అధికారులకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. నిధుల మళ్లింపుపై మరింత లోతుగా సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు ఏం చేశారనే దానిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలు, కార్పొరేషన్‌కు ఉన్న నిధులు, రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణపై అధికారులతో పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్‌లో 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.2,092.65 కోట్లు నిధులుంటే, ప్రస్తుతం రూ.7 కోట్లు మాత్రమే ఉండటం పట్ల పవన్‌కల్యాణ్ విస్తుపోయారు. అంతకుముందు అధికారులు కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితిపై ఒక నివేదికను పవన్‌కల్యాణ్‌కు అంద చేశారు దీని ప్రకారం 2020-21లో కార్పొరేషన్ రూ.728.35 కోట్లు మాత్రమే వినియోగించింది. 2021-22లో రూ.508 కోట్లు ఖర్చు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.1,066.36 కోట్లు కార్పొరేషన్ ఖాతాలో ఉండగా, 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి కేవలం రూ.3 కోట్లు మాత్రమే ఉన్నట్లు చూపించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి మిగతా 2లో

ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- 43 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బుధవారం విడుదల చేశారు. మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగిన సప్లిమెంటరీ పరీక్షలకు 1,40,750 మంది హాజరయ్యారు. వీరిలో 63,548 మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ అభ్యర్థులు 1,33,591 మంది హాజరవ్వగా, 56,836 (43 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ 1,31,59 మంది హాజరవ్వగా, 6,712 (51 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు, మేలో జరిగిన సప్లిమెంటరీ పరీక్షలు కలుపుకుని మొత్తం 80 శాతం జనరల్ విభాగంలో, 78 శాతం ఒకేషనల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విద్యార్థులు ఇంప్రూవ్‌మెంటు పరీక్ష 2,068,29 మంది రాయగా, వీరిలో 1,63,101 (79 శాతం) మందికి మార్కులు పెరిగాయి. 3,991 మంది ఒకేషనల్ విద్యార్థులు రాయగా, వీరిలో 1,615 (40 శాతం) మందికి మార్కులు పెరిగాయి. రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 28 నుంచి జులై 4వ తేదీ వరకు విద్యార్థులు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఫలితాల కోసం తీవంబltsbie.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. మార్కుల మెమో జులై ఒకటి నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

టెన్త్ సప్లిమెంటరీలో 62.21 శాతం ఉత్తీర్ణత

- ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా విడుదల చేశారు. మే 24 నుంచి జూన్ 10వ తేదీ వరకు జరిగిన సప్లిమెంటరీ పరీక్షలకు 1,07,883 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 67,115 (62.21 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు ఒఒఒ.తీవంబశ్రీం.ఎంవ.ఖజా.స్త్రశీజ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 27 నుంచి జులై ఒకటో తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

యూనిఫామ్ విధానాన్ని రద్దు చేయండి

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు యూని ఫామ్ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రి డోలా బాలవీరాం జనేయస్వామిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెండున్నరేళ్ల క్రితం ఉద్యోగులకు యూనిఫామ్ ఇచ్చారని, అలవెన్స్‌లు ఇవ్వలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన యూనిఫామ్‌లు పాడైపోయాయని, యూనిఫాం ధరించలేదనే కారణంతో ఎంపిడిఒ, కమిషనర్లు అనేకచోట్ల సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తూ సస్పెండ్ చేస్తున్నారని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల నేతలు ఉన్నారు.

లెక్క తేల్చాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి వచ్చిన నిధులు, వాటిపై వచ్చిన వడ్డీతో కలిపి 239 కోట్ల రూపాయలు సమకూరాయని. అందులో 209 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే చేసిన ఖర్చు పోనూ 7.04 కోట్ల రూపాయలు మాత్రమే మిగిలిఉన్నాయని అధికారులు నివేదించారు. ఈ పరిస్థితి పట్ల విస్మయాన్ని వ్యక్తం చేసిన డిప్యూటీ సిఎం, నిధుల లెక్కలు తేల్చాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు సక్రమంగా వినియోగమైతేనే ఆ సంస్థకు నిర్దేశించిన లక్ష్యాలు అందుకోగలమన్నారు. కేంద్ర నిధులను నెలల తరబడి బ్యాంకు ఖాతాల్లో ఉంచడం, వాటి ద్వారా వడ్డీ లభిస్తున్నా.. వినియోగించకుండా ఆ పైన ఇతర అవసరాలకు మళ్లించడం గత ప్రభుత్వ పాలకులు చేసిన ఓ దురదృష్టకర ప్రక్రియ అని ఆయన అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషన్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలి

- పర్వ సత్యనారాయణ శతజయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్ (పశ్చిమగోదావరి జిల్లా)

కార్పొరేట్ శక్తులను, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలంటే మరింత చైతన్యవంతంగా ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని త్యాగరాజ భవనంలో పర్వ సత్యనారాయణ శతజయంతి సందర్భంగా సిఐటియు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన బుధవారం సదస్సులు నిర్వహించారు. తొలుత పర్వ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పర్వ సత్యనారాయణ చిన్నతనం నుంచి పీడిత ప్రజల పక్షాన నిలబడిన పోరాటయోధుడని, బొగ్గు గని కార్మికుడిగా, కార్మిక నాయకుడిగా, శాసనసభ సభ్యునిగా అనేక బాధ్యతలు నిర్వహించి కడవరకు పీడిత ప్రజల పక్షాన నిలబడిన యోధుడని వక్తలు కొనియాడారు. అనంతరం 'నేటి కార్మికవర్గం - ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ.. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై పోరాటాలు సాగించి కార్మికులు అనేక చట్టాలు, హక్కులు సాధించుకున్నారని అన్నారు. నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత కార్మికులకు కష్టాలు, ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను పూర్తిగా మార్చేసి కార్మికుల జీవనోపాధి దెబ్బతీసే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు.

'ప్రజా యోధుడు పర్వ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

వీటన్నింటికీ వ్యతిరేకంగా సిఐటియు కార్మికుల పక్షాన పోరాడుతోందని తెలిపారు. రానున్న కాలంలో మరింత విస్తృతంగా పోరాడాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

'అభివృద్ధి-సంక్షేమం' అనే అంశంపై ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం చాలా ముఖ్యమైనవని తెలిపారు. అభివృద్ధి అంటే ఉపాధి కల్పన, ప్రజల జీవన ప్రమాణాల్లో ఆహారం, తాగునీరు, విద్య, వైద్యం వంటి వాటి అభివృద్ధి ఎలా ఉందో ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని తెలిపారు. వీటితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పాలకులు అభివృద్ధి, సంక్షేమాన్ని ఓట్లతో కొలుస్తున్నారని, పథకాలన్నీ ఓట్ల పథకాలుగా మార్చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏ మేరకు అమలు చేశామనే దానిపై ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు ఆ విధంగా లేకపోవడం బాధాకరమన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రాము, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ నాయకులు మంతెన సీతారాం, పర్వ సత్యనారాయణ కుమార్తె లీల మాట్లాడుతూ పర్వ సత్యనారాయణ జీవిత విశేషాలు, ప్రజల కోసం ఆయన చేసిన ఉద్యమాలు వివరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, రైతుసంఘం నాయకులు బి.బలరాం, చింతకాయల బాబూరావు, సిఐటియు నేతలు బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి ప్రతాప్, శ్రామిక మహిళా నాయకురాలు కళ్యాణి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజా యోధుడు పర్వ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఆర్థికశాఖ శ్వేతపత్రం సిద్ధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో భాగంగా ఆర్థికశాఖకు సంబంధించిన శ్వేతపత్రం సిద్ధమైనట్లు తెలిసింది. పది సంవత్సరాల ఆర్థిక పరిస్థితిని ఈ శ్వేతపత్రంలో అధికారులు పొందుపరిచినట్లు సమాచారం. వివిధ రంగాలకు సంబంధించిన శ్వేతపత్రాలను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆర్థికశాఖ సిద్ధం చేసిన నివేదికలో 2014వ సంవత్సరం నుండి నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోని పరిస్థితులు, 2019 నుంచి 2024 వరకు వైసిపి హయాంలో పరిస్థితులను వివరించినట్లు తెలిసిందే., వైసిపి హయాంలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారినట్లు తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రంగా ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ శ్వేతపత్రానికి ప్రాధాన్యత నెలకొంది. గడిచిన ఐదేళ్ల కాలంలో వచ్చిన ఆదాయం, చేసిన అప్పుల వివరాలను, ఆఫ్ బడ్జెట్ రుణాలుగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా తీసుకున్న రుణాలు, వాటని ఖర్చు చేసిన తీరును కూడా కూడా బహిరంగ పరచాలని సిఎం కార్యాలయం నుండి ఆర్థికశాఖకు ఆదేశాలు అందాయి. దీంతో ఆ వివరాలను కూడా శ్వేతపత్రంలో పొందుపరచనున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన వివరాలను మూడు, నాలుగు నివేదికలుగా అధికారులు రూపొందించినట్లు తెలిసింది. వాటిలోని కీలక అంశాలతో శ్వేతపత్రాన్ని రూపొందించినట్లు సమాచారం.

విద్యార్థుల తగ్గుదలపై నివేదిక ఇవ్వండి

- ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయజోక్యం ఉండొద్దు
- యాప్‌ల భారాన్ని తగ్గించండి
- సమీక్షలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. పాఠశాలవిద్యలో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు పెద్దఎత్తున విద్యార్థులు బదిలీ కావడానికి గల కారణాలను అన్వేషించాలని సూచించారు. మూసివేసిన పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని, ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. గతంలో మాదిరి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా విధివిధానాలను రూపొందించాలన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, అవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించి, పూర్తిస్థాయి బోధనపైనే దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

చిల్డ్రన్ లెర్నింగ్ అవుట్‌కమ్స్, విద్యా ప్రమాణాల పెంపునకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. విద్యాప్రమాణాల పెంపునకు దేశంలో అత్యుత్తమ విధానాలు ఎక్కడ అమలవుతున్నాయో అధ్యయనం చేసిన నివేదిక అందించాలని కోరారు. రాయలసీమ ప్రాంతంలో పాఠశాలల కొరత ఎక్కడ ఉంది, కొత్త పాఠశాలలు ఎక్కడ ప్రారంభించాలనే అంశంపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, వయోజన విద్య డైరెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు మార్చాల్సిందే

- 'మరిన్ని జగ్గయ్యపేటలు'పై అధికారుల వివరణ
- విజయవాడలో 50 కి.మీ మేర దెబ్బతిన్నాయి
- గుంటూరులో 32 కి.మీ ఇదే దుస్థితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆసియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేయడంతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న పైపులైన్లను మార్చితేనే పట్టణ ప్రాంతాల్లో ప్రజానీకానికి రక్షిత మంచినీరు అందుతుందని, నీటి కాలుష్యం నుండి రక్షణ లభిస్తుందని అధికారులు తెలిపారు. 'మరిన్ని జగ్గయ్యపేటలు' శీర్షికతో బుధవారం ప్రజాశక్తి మొదటిపేజీలో ప్రచురితమైన కథనంపై పట్టణాభివృద్ధిశాఖకు చెందిన పలువురు అధికారులు స్పందించారు. పైపులైన్ల నాణ్యతకు సంబంధించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించడంతో పాటు, మార్చడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శికి ఏడునుండి ఎనిమిది లేఖలు అందచేసినట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. అయినా స్పందన కనిపించలేదని వివరించారు. ప్రస్తుతం 22 మున్సిపాలిటీల్లో పైపులైన్లు చాలా వరకూ దెబ్బతిన్నాట్లు మరో అధికారి చెప్పారు. గతంలో ఉన్న పైపులైన్లను సరిచేయకుండా, పగిలిన చోట్ల రిపేర్లు చేయకుండా అనేక ప్రాంతాల్లో అలాగే రోడ్లు వేసేశారని తెలిపారు. దీంతో భూమి లోపల గుంటలు ఏర్పడి మురుగు నీరు చేరి,

ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో డ్రెయినేజీలోనే ఉన్న మంచినీటి పైప్‌లైన్

పైపులైన్ల ద్వారా ఇళ్లకు సరఫరా అవుతోందని వివరించారు. విజయవాడ నగరంలో కనీసం 50 కిలీమీటర్ల కిలోమీటర్ల మేర పైపులైన్ మార్చాల్సి ఉంటుందని, గుంటూరులో 32 కి.మీలలో పైపు లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు. అన్ని పాత మున్సిపాల్టీల్లోనూ పైపు లైన్లు మార్చాల్సిఉంటుందని మరో అధికారి చెప్పారు.

కన్సల్టెన్సీలతో ఇబ్బందులు

ప్రస్తుతం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కన్సల్టెన్సీలు ఇచ్చిన రిపోర్టులు అధారంగా పనిచేసే ఇంజనీర్లు తప్ప పైపులైన్లపై అవగాహన ఉన్న సిబ్బంది దాదాపు తగ్గిపోయినట్లు చెబుతున్నారు. ఎక్కడైనా పైపులైను లీకేజీ అయితే అది ఏ ప్రాంతం నుండి వస్తుందనేది పాత సిబ్బంది చూసి చెప్పేవారు. ప్రస్తుతం ఇంజనీర్లకు దీనిపై అవగాహన లేదు. అత్యసవర సమయాల్లో రిటైరైన అధికారులను పిలిపించి ప్లాను వేయిస్తున్నారు. దీంతో ఎక్కడైనా పైపు రిపేరు వస్తే దాన్ని సరిచేయడానికి మూడు నుండి నాలుగు రోజులు పడుతున్నట్లు సమాచారం. మురుగునీటి పారుదల వ్యవస్థ కూడా సరిగా లేకపోవడంతో సిమెంటు రోడ్ల అడుగుభాగంలో మురుగునీరు ప్రవహిస్తోందని, ఇది పైపులైన్లను దెబ్బతీస్తోందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. సిమెంటు రోడ్లు ఒకదాని మీద ఒకటి వేసుకుంటూ పోతుండటంతో గతంలో వేసిన పైపులైన్లు అనేక చోట్ల చాలా లోతుకు వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. సమస్య పెరగడానికి ప్రధాన కారణమని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

పోలవరానికి విదేశీ నిపుణులు

- ఈ నెల 29 నుండి వారం రోజులు అధ్యయనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మళ్లీ పట్టాలెక్కించేందుకు అధ్యయనం కోసం విదేశీ నిపుణుల బృందాన్ని కేంద్రం పిలుపిస్తోంది. 2020లో గోదావరి నదికి వచ్చిన వరదలకు ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్‌లు, డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో ప్రాజెక్టు పనులు దాదాపుగా నిలిచిపోయాయి ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎంతో అనుభవం వున్న అమెరికా, కెనడాలకు చెందిన నలుగురు అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు వద్దకు పంపుతోంది. ఈ నెల 29 నుండి జూలై 5వ తేదీ దాకా వారం రోజుల పాటు ఈ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టు దెబ్బతిన్న ప్రాంతాల్లో అధ్యయనం చేయనుంది. మొదట ఢిల్లీకి చేరుకొని అక్కడే కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ, సిడబ్ల్యుసి, పోలవరం అథారిటి, పోలవరం ఇంజనీర్లతో సమావేశమవుతారు. అనంతరం అక్కడ నుండి పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు. సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, డ్యామ్ భద్రత, డ్యామ్ నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను మరమ్మతులు చేయాలా లేదా సమాంతరంగా కొత్తగా నిర్మించాలా అనే అంశాన్ని ఈ నిపుణుల కమిటి తేల్చనుంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల లీకేజీల అంశాన్ని కూడా పరిశీలిస్తారు. సిడబ్ల్యుసి రిపోర్ట్ ప్రకారం రాక్‌ఫిల్డ్ నిర్మాణాన్ని కూడా వీరు పర్యవేక్షించనున్నారు.

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

- ఎలక్షన్ కమిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందుకు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉదంతమే నిదర్శనమని పేర్కొంది. ఇవిఎంలను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసిన వెంటనే పిన్నెల్లి అరెస్టు నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు స్పందించింది. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విషయంలో భవిష్యత్తులో ఇంకెవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసం చేయరనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఇవిఎం డ్యామేజీకి కారణమైన మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయడంతో ఇసిఐ ఆదర్శప్రాయమైన చర్యకు తర్కింపు ముగింపు లభించిందని పేర్కొంది. ఇవిఎంలను డ్యామేజీ చేసిన వారిని అరెస్టు చేయడమనేది ఎన్నికల సమగ్రతను కాపాడుకోవడంలో ఇసిఐ అంకిత భావానికి ఒక నిర్దిష్ట ఉదాహరణగా అభివర్ణించింది.

జగన్ ఫ్లోర్ లీడర్ మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

పుస్తకాలు కూడా చూడాలని సూచించారు. అసెంబ్లీ రూల్ బుక్ చదవాలన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని రాసిన సలహాదారుల సూచనల మేరకు రాశారు తప్ప అందులో వాస్తవాలు లేవని, ఆయనకు నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్ష హోదా రాదని పేర్కొన్నారు. సంఖ్యతో సంబంధం లేదని చెబుతున్న జగన్.. గత అసెంబ్లీలో టిడిపి సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యేలను లాగేసుకుంటే ప్రతిపక్ష హోదా ఉండదని అనేకసార్లు చట్టసభల సాక్షిగా బెదిరించారని, అప్పుడు నిబంధనల ప్రకారమే ఆయన ఆ మాట అన్నారని, అదే నిబంధన ప్రకారం తాము ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

అతిసారకు చిన్నారి బలి

(మొదటిపేజీ తరువాయి)

గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను ఆర్‌టిఒ శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ బి.భారతి, ఎంపిడిఒ శ్రీనివాసులు, బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. అతిసారకు కారణాలపై ఆరా తీశారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌ను చాలా రోజుల నుంచి శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పాఠశాల వంట గదిని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ 560 మంది చదువుతున్నారు.

జగ్గయ్యపేటలో కొత్తగా 8 కేసులు

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో అతిసార కేసులు నమోదవుతూనే ఉన్నాయి. కొత్తగా ఎనిమిది మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. వారిలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు, జగ్గయ్యపేట మండలం షేర్ మమ్మద్‌పేట గ్రామ మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

ఈ నియోజకవర్గంలో అతిసార బాధితుల సంఖ్య 112కు చేరింది. వారిలో 88 మంది చికిత్స పొంది ఆస్పత్రుల నుండి డిశ్చార్జి అయ్యారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 18 మంది, జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు, షేర్ మహ్మద్‌పేటలోని ప్రత్యేక వైద్య శిబిరంలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్‌పేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సిపిఎం నేతలు పరిశీలించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై బూచవరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ అతిసారను యుద్ధపాతిపదికన అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అతిసార ప్రబలడానికి కారణాలను గుర్తించాలని, తాగునీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలని, పారిశుధ్యాన్ని, డ్రెయినేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

సమర్థవంతంగా 'సంక్షేమ' బాధ్యతలు

- బాధ్యతల స్వీకరణలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సాంఘిక సంక్షేమ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఇందులో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నడుస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో 24-25 విద్యా సంవత్సరానికి ఆర్ట్స్ గ్రూపు సిఇసిలో 80 సీట్లు, ఎంపిసిలో 40 సీట్లు, బైసిపిలో 40 సీట్లు అదనంగా మంజూరు చేస్తూ ఫైల్‌పై సంతకాలు చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా బాపట్ల జిల్లా నాగులపాలెం బాలికల గురుకుల విద్యాలయంలో పాఠశాలలకు సఫరా చేసే కూరగాయలు, పండ్లు, గుడ్లు సామగ్రిని తాజాగా విద్యార్థులకు అందించేందుకు అనువుగా కోల్డ్ స్టోరేజీ యూనిట్ మంజూరుతోపాటు విద్యార్థులకు వేడి నీటిని అందించేందుకు పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ సౌకర్యం కల్పిస్తూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాలశాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉదోగులు పాల్గోవాలి : మంత్రి

జులై ఒకటిన జరిగే సామాజిక పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులందరూ పాల్గొనాలని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. సచివాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు లక్షా తొమ్మిది వేల మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని, వారి నుంచి సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేయని వారి సంగతేంటని అధికారులను ప్రశ్నించారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ప్రత్యేక కార్యదర్శి మహ్మద్ దివాన్, డైరెక్టరు శివప్రసాద్ అడిషనల్ డైరెక్టరు అభిషేక్ గౌడ్ పాల్గొన్నారు.

తక్షణమే రోడ్ల మరమ్మతులు

- ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై పూర్తిగా దెబ్బతిన్న రోడ్లన్నిటికీ తక్షణం మరమ్మతు పనులు చేపట్టాలని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రిగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం రూ.2,261 కోట్ల బకాయిలు పెట్టిందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించనందునే పనులు చేసేందుకు టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ కార్యదర్శి యువరాజ్, ఆర్అండ్‌బి ఇఎన్‌సిలు కె నయీముల్లా, వేణుగోపాల్ రెడ్డి, సిఇలు శ్రీనివాసులు రెడ్డి, రామచంద్ర, వెంకటేశ్వరరావు, సుకన్య, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖ ద్వారా మెరుగైన సేవలు

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా ప్రజలకు మెరుగైన సేవలందించడంలో రెవెన్యూశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రెవెన్యూ రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సచివాలయంలో రెవెన్యూ, సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సుశాఖల ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎంతో ఓర్పు, నేర్పుతో ప్రజలకు సేవ చేయడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే విషయాన్ని రెవెన్యూ ఉద్యోగులంతా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎల్ఎ జి సాయిప్రసాద్, సర్వేశాఖ కమిషనరు సిద్ధార్థనాథ్ జైన్, రెవెన్యూశాఖ స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- రవాణాశాఖ మంత్రికి ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎమ్ రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తక్షణం ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరింది. ఈ మేరకు బుధవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రవాణాశాఖ మంత్రికి వినతిపత్రం అందజేసింది. ఆర్‌టిసిలో విలీనం తర్వాత ఉద్యోగుల సమస్యలు తగ్గకపోగా పెరిగిపోయాయని తెలిపారు. విలీన కష్టాల నుంచి ఉద్యోగులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా సిబ్బంది నియామకాలు చేపట్టడంతోపాటు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు.

24 శాతం హెచ్‌ఆర్‌ఎను, ఐదు రోజుల పనిదినాలను పొడిగించాలి

రాష్ట్ర కేంద్రంలో వారంలో ఐదురోజుల పనిదినాలు అనే విధానం గడువు ముగిసినందున మళ్లీ పొడిగించాలని ఆర్‌టిసి ఎమ్‌డికి ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతిపత్రం అందించింది. అలాగే ఆర్‌టిసి ఉద్యోగులకు విలీనానికి ముందు వున్న 24 హెచ్‌ఆర్ఎ పాలసీని కూడా పునరుద్ధరించాలని కోరింది.

సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్

(మొదటిపేజీ తరువాయి)

చేసేవారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గత ఐదేళ్లు అధికారులు మనసు చంపుకుని పనిచేశారని, వైసిపి నేతల పైశాచిక ఆనందానికి కొందరు అధికారులు సహకరించారని పేర్కొన్నారు. తన సొంత నియోజకవర్గానికి తాను రాలేని, మాట్లాడలేని పరిస్థితిని గత ఐదేళ్లలో కల్పించారని అన్నారు. తనపై హత్యాయత్నం కేసు పెట్టారని వివరించారు. గత ఐదేళ్లలో అనేక అక్రమ కేసులు పెట్టారన్నారు. కుప్పంలో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం తీసుకొస్తానన్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించి తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, హంద్రీనీవా కాలువ పనుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, వ్యవసాయంలో మెరుగైన విధానాలు తీసుకురావాలని, డెయిరీ, మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కుప్పానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామని, కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని తెలిపారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి డిపార్టుమెంట్ నుంచి పక్కా ప్రణాళికతో రావాలని, నెలల వ్యవధిలోనే కుప్పంలో మార్పు చూపించాలని ఆదేశించారు. రెండో రోజు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా చంద్రబాబుకు 846 అర్జీలు అందాయి. వాటిని పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆయన ఆదేశించారు.

బిఎస్ఎన్ఎల్ డేటా లీక్

న్యూఢిల్లీ : టెలికం సంస్థ బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమాచారం హ్యాకర్లు అమ్మకానికి పెట్టారని అథెంటియన్ టెక్నాలజీస్ తన నివేదికలో తెలిపింది. బిఎస్ఎన్ఎల్‌కు చెందిన 278 జిబి డేటా ఉందంటూ కిబర్ ఫాంటోమ్ అనే వ్యక్తి 5000 డాలర్లకు అమ్మకానికి పెట్టారని పేర్కొంది. గత ఆరు నెలల్లో బిఎస్ఎన్ఎల్ డేటా హ్యాక్ అవ్వడం ఇది రెండోసారి. ఈ డేటాలో సిమ్ కార్డ్ వివరాలు, అంతర్జాతీయ మొబైల్ చందాదారుల గుర్తింపు హోమ్ లొకేషన్ తదితర సమాచారం ఉందని అథెంటియన్ టెక్నాలజీస్ పేర్కొంది. ఈ డేటాతో మోసగాళ్లు సైబర్ దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

క్విక్ కామర్స్‌లోకి రిలయన్స్ రిటైల్

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ రిటైల్ గంటలో సరకులను డెలివరీ చేసే క్విక్ కామర్స్‌లోకి ప్రవేశించింది. ముంబయి, నవీ ముంబయిలోని కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రారంభించినట్లు పేర్కొంది. హైపర్ లోకల్ డెలివరీ పేరిట ఈ సేవలను జియోమార్ట్ మొబైల్ యాప్ అనుసంధానంతో అందుబాటులోకి తెస్తోంది. ప్రస్తుతం ఈ రంగంలోని బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో తదితర సంస్థలు 10 నిమిషాల్లోనే సరుకులు డెలివరీ చేస్తోన్నాయి. మరిన్ని స్టోర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత డెలివరీ సమయాన్ని 30-45 నిమిషాలకు కుదించే యోచనలో ఉన్నట్లు రిలయన్స్ రిటైల్ వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఇతర కీలక నగరాలకు ఈ సేవలను విస్తరించే పనిలో ఉందని సమాచారం.

కేంద్ర ప్రభుత్వం సహకరించేనా?

- నత్తనడకన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనులు
- అరకొర నిధులతోనే సరిపెడుతున్న వైనం
- రాష్ట్రంలోని నూతన సర్కారుపై కోనసీమ వాసుల ఆశలు

కోటిపల్లి వద్ద గౌతమీ నదిలో వేసిన పిల్లర్లు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనులు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 22 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. అరకొర నిధులు విడుదల చేస్తూ చేతులు దులిపేసుకుంటోంది. కొనసీమవాసుల చిరకాల వాంఛను నీరుగారిస్తోంది. ఇప్పటి వరకు 48 శాతం నిధులు మాత్రమే విడుదల చేయడంతో ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. 2001లో కోటిపల్లి-నర్సాపురం మధ్య 57.21 కిలోమీటర్ల మేర రైల్వే లైను మంజూరైంది. అప్పటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి మమతాబెనర్జీ 2002లో అమలాపురంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు చోట్ల వంతెనలు, తొమ్మిది చోట్ల రైల్వే స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మొదట్లో రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిర్మాణంలో తీవ్ర జాప్యం వల్ల అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. నాలుగేళ్ల క్రితం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,300 కోట్లకు పెంచారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడల్లా నిధులు కేటాయిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు సుమారు రూ.1,100 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.575 కోట్ల వరకూ కేటాయించాల్సి ఉంది. 2014లో టిడిపి ప్రభుత్వం రూ.3 కోట్లు, 2019లో వైసిపి ప్రభుత్వం సుమారు రూ.50 కోట్లు ఇచ్చింది.

భూ సేకరణలో తీవ్ర జాప్యం

ఈ ప్రాజెక్టులో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతులకు పరిహారం ఇవ్వడంలో అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గౌతమి నదిపై 3.50 కిలోమీటర్ల మేర వంతెన పనులకు 44 పిల్లర్ల నిర్మాణం మూడేళ్ల క్రితం పూర్తయింది. ఈ వంతెనపై గడ్డర్లు వేయడానికి అధికారులు టెండర్లు పిలిచారు. దిండి-చించినాడ మధ్య 1.2 కిలోమీటర్ల పొడవున 21 పిల్లర్ల నిర్మాణం జరగాల్సి ఉంది. సకాలంలో నిధులు విడుదల కానందున ఇప్పటివరకు 19 మాత్రమే పూర్తయ్యాయి. బోడసకుర్రు-పాశర్లపూడి బాడవ వరకు 1.50 కిలోమీటర్ల వంతెన నిర్మాణంలో భాగంగా 22 పిల్లర్లలో 19 పిల్లర్లు పూర్తయ్యాయి. వీటిపై గడ్డర్ల ఏర్పాటుకు టెండర్లు పిలవాల్సి ఉంది. కోటిపల్లి-భట్నవిల్లి మధ్య, నరసాపురం-చించినాడ మధ్య సుమారు 950 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. 250 ఎకరాలు భూ సేకరణ బాలయోగి స్పీకర్‌గా పనిచేసిన సమయంలోనే పూర్తయింది. ఇంకా 750 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తమ చిరకాల స్వప్నం పూర్తయ్యేలా త్వరితగతిన భూ సేకరణ పనులు చేపట్టి రైల్వే లైన్ పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోనసీమవాసులు కోరుతున్నారు.

ఇది పూర్తయితే...

ఈ లైన్ పూర్తయితే ప్రధాన లైనుపై ఒత్తిడి తగ్గుతుంది. విశాఖపట్నం, సామర్లకోట తర్వాత కాకినాడ నుంచి కోటిపల్లి, నర్సాపూర్ మీదుగా మచిలీపట్నం, రేపల్లె తర్వాత చెన్నై ప్రధాన లైన్‌లో ఇది కలుస్తుంది. తద్వారా చెన్నై వెళ్లే రైళ్ల రాజమహేంద్రవరం, విజయవాడ వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో పోర్టుల అనుసంధానంతోపాటు పారిశ్రామిక కారిడార్‌లో సరకు రవాణాకూ దోహదం చేయనుంది.


మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు.

టూరిజం హబ్‌గా కడియం

- హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు : మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి- కడియం

నర్సరీ రైతుల కోసం ప్రభుత్వం హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని కడియం ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటి సారిగా ఆయన కడియపులంకలో కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర, దేశం నుంచే కాక ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన నర్సరీల అందాలు కడియం ప్రాంతంలో మెండుగా ఉన్నాయన్నారు. వాటికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారపరంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నర్సరీల నుంచి దేశ విదేశాలకు కనువిందైన మొక్కలను ఎగుమతి చేస్తున్నారని వివరించారు. ఈ ప్రాంత రైతులు స్వదేశ విజ్ఞానాన్ని ఉపయోగించుకుని అనేక కొత్త రకాల వంగడాలను ఉత్పత్తి చేయడం చాలా ఆనందదాయకమని అభినందనీయమన్నారు. ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. గోదావరి అందాలు, రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. పిచ్చుక లంక ప్రాంతం అభివృద్ధికి ఓబరాయ్ సంస్థతో సంప్రదింపులు జరుపుతామన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, హెరిటేజ్ టూరిజం, రివర్ టూరిజం వంటి వాటిని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం వీటికి కేటాయించిన నిధులను పక్కదోవ పట్టించిందన్నారు.

వేతనాలు పెంచాలి

- మంత్రి శ్రీనివాస్‌కు అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను బుధవారం విజయనగరం కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. సమాజంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. 42 రోజుల సమ్మె ముగింపు సందర్భంగా మినిట్స్ కాపీలో పొందుపర్చిన అన్ని సమస్యలనూ పరిష్కరించాలని, పెండింగ్ జిఒలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమారి, ఎస్.అనసూయ, నాయకులు ఉన్నారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

- హాస్టల్ పరిశీలించిన ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒ


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ముద్దనూరు (వైఎస్ఆర్ జిల్లా)

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వైఎస్ఆర్ జిల్లా ముద్దనూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని హాస్టల్లో విద్యార్థులకు ఇడ్లీ, సాంబారు అల్పాహారంగా బుధవారం ఉదయం ఏర్పాటు చేశారు. 28 మంది విద్యార్థులు ఈ అల్పాహారం తిన్నారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులై అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు విద్యార్థులు యశ్వంత్, బన్నీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు బాధిత విద్యార్థులకు మందులు ఇచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు.

జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు హాస్టల్‌కు వచ్చి వంట గదిని, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ఘటనకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అల్పాహారం, నీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు హాస్టల్‌ని తనిఖీ చేయాలని విఆర్‌ఒకు సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఆర్‌ఒ వెంట సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, ఎంపిడిఒ చంద్ర మౌలీశ్వర్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, హాస్టల్ వార్డెన్, వంట మనిషిని సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులను పరామర్శించి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతికి వినతిపత్రం అందించారు. వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, నవీన్, గోపాల్, రాజమోహన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, మహేష్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి సిద్ధార్థ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1231వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్‌ఫర్నేస్ డిపార్టుమెంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ 1982 వరకూ సెయిల్‌లో భాగంగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను విడదీసి 1982 ఫిబ్రవరి 18న ఆర్ఐఎన్ఎల్‌లో కలిపారని తెలిపారు. ఆ సమయంలో ప్లాంట్‌కు అవసరమైన అన్ని వనరులూ సమకూరుస్తామని, బైలదిల్లాలోని ఉన్నటువంటి బ్లాక్ 4ను, ఇనుప గనులను కేటాయిస్తామని, సెయిల్‌లో అమలవుతున్న అన్ని సౌకర్యాలనూ వర్తింపజేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అవేవీ ఇప్పటి వరకూ అమలుకాలేదని తెలిపారు. నేడు ప్లాంట్‌కు ముడిసరుకు అందకే ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వచ్చిందన్నారు. దీంతో నష్టాలు పెరుగుతున్నాయని వివరించారు. ఈ క్రమంలో మళ్లీ ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నిర్వహించినట్లయితే ప్రతి సంవత్సరం ఐదు వేల కోట్ల రూపాయల లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, ఎన్ రామారావు, విల్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.

అయ్యో.. కాంట్రాక్ట్ అధ్యాపకులు..!

- నేటికీ విడుదల కాని రెన్యువల్ ఉత్తర్వులు
- 2 నెలలుగా జీతాలు లేక అవస్థలు
- రాష్ట్ర వ్యాప్తంగా 4,369 అధ్యాపకుల పరిస్థితి అయోమయం
- గత ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిన రెగ్యులరైజేషన్ ప్రక్రియ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో డిగ్రీ, ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల (లెక్చరర్స్)ను చూసి అయ్యో పాపం అనే పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా జీతాలు లేక, 2024-25 సంవత్సరానికి సంబంధించి పొడిగింపు (రెన్యువల్) ఉత్తర్వులు విడుదల కాక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులను కలిసినా పట్టించుకోకపోవడంతో విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో పిల్లల చదువులు, ఇల్లు ఎలా గడపాలో తెలియక ఆర్థికంగా నలిగిపోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 740 ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 3,629 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తుండగా రెగ్యులర్ అధ్యాపకులుగా కేవలం 1200 మంది మాత్రమే ఉన్నారు. అంటే 67 శాతం కాంట్రాక్ట్ అధ్యాపకులే విద్యాబోధన చేస్తున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలో 19 ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో 90 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా, 200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. రాష్ట్రంలోని 173 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 680 మంది కాంట్రాక్టర్ అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 16 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 62 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు లేనిదే కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి ఉంది. అయినప్పటికీ వారి పట్ల చిన్నచూపు చూస్తున్న పరిస్థితి ఉంది. 20 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నా ప్రతియేటా రెన్యువల్ ఉత్తర్వుల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఒక ఏడాది పది నెలలు, మరో ఏడాది 11 నెలలు మాత్రమే జీతాలు ఇస్తున్నారు. దీనిపై అనేక పోరాటాలు చేయగా 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం అధ్యాపకులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేస్తూ ప్రతియేటా పది రోజుల విరామంతో 12 నెలలు జీతాలు ఇచ్చేలా జిఒ ఇచ్చింది. ఆ వెంటనే ఎన్నికలు రావడంతో అమలు చేయకుండానే టిడిపి ప్రభుత్వం దిగిపోయింది. తరువాత గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం కొద్ది నెలల తర్వాత ఆ జిఒను అమలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చి ఒక్క ఏడాది మాత్రమే అమలు చేసింది. ఆ తర్వాత పది, 11 నెలలకు జీతాలు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వసాగింది. కాంట్రాక్ట్ అధ్యాపక యూనియన్ల పోరాటంతో పది రోజుల విరామంతో 12 నెలలు జీతం ఇచ్చేలా చేసుకున్నారు. ఇంటర్‌మీడియట్, డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకులకు 2023-24 విద్యా సంవత్సరంలో 11 నెలలకు రెన్యువల్ ఇచ్చి మే నెలలో 'నో వర్క్.. నో పే' అంటూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులు మే నెల జీతం నష్టపోయి ఇంటి దగ్గరే ఉండిపోయారు. ఇంటర్మీడియట్ అధ్యాపకులు మాత్రం మే నెలలోనూ పరీక్షలు తప్పిన విద్యార్థులకు పాఠాలు చెప్పారు. జూన్ ఒకటోతేదీన ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభం కావడంతో కాంట్రాక్ట్ అధ్యాపకులు కళాశాలలకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఆయా యూనివర్సిటీల పరిధిని బట్టి జూన్ ఆరో తేదీ నుంచి 12వ తేదీలోపు ప్రారంభం కావడంతో వారు పాఠాలు బోధిస్తున్నారు. కళాశాలకు వెళ్లి పనిచేస్తున్నా రెన్యువల్ ఉత్తర్వులు మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో జులై నెలలోనూ జీతం వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. రెన్యువల్ ఉత్తర్వులు ఇస్తే జులై మొదటి వారంలో అయినా జీతాలు అందుకోవచ్చని అంతా ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వం రెగ్యులరైజేషన్ అంటూ కాలయాపన

గత ప్రభుత్వం అక్టోబర్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌పై మొదట కేబినెట్లో ఆమోదం తెలిపి, ఆ తర్వాత అసెంబ్లీలో బిల్లు పెట్టి, గవర్నర్‌కి పంపి, గెజిట్ కూడా విడుదల చేసింది. ఆ తర్వాత జిఒ 114 విడుదల చేసింది. 20 ఏళ్లకు తమ కష్టాలు తీరుతున్నాయని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆశగా ఎదురు చూశారు. కానీ జిఒ ఇచ్చి, రెగ్యులర్ చేయకుండానే వైసిపి ప్రభుత్వం దిగిపోయింది. కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆశలు అడియాసలయ్యాయి. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ఈ సమస్యపై దష్టి పెట్టి కళాశాలల బోధనలో కీలక భూమిక పోషిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకుని, వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

కాంట్రాక్ట్ అధ్యాపకుల బాధలు పట్టించుకోండి

ఇప్పటి వరకూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదు. అడిగినా అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు. రెండు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలి. గత ప్రభుత్వం మధ్యలో నిలిపివేసిన రెగ్యులైజేషన్ ప్రక్రియ పూర్తిచేసి కాంట్రాక్ట్ అధ్యాపకులు న్యాయం చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- బి.జె.గాంధీ, గవర్నమెంట్ కాలేజ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోషియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ

యెస్ బ్యాంక్‌లో ఉద్యోగులపై వేటు..!

- 500 మందికి ఉద్వాసన

ముంబయి : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ భారీ పునర్వ్యవస్థీకరణలో తమ ఉద్యోగులపై వేటు వేసింది. దాదాపు 500 మందికి ఉద్వాసన పలికింది. తాజాగా ప్రకటించిన తొలగింపులతో పాటు రానున్న వారాల్లో మరిన్ని ఉద్యోగులకు కోత పెడుతుందని సమాచారం. వ్యయ నియంత్రణ, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణ కోసం యెస్ బ్యాంక్ చర్యలు చేపట్టిందని ఆంగ్ల మీడియాలో రిపోర్టులు వచ్చాయి. ఒక పక్క అనేక బ్యాంకులు కొత్త శాఖలను ఏర్పాటు చేస్తూ వేగంగా విస్తరిస్తుంటే యెస్ బ్యాంక్ మాత్రం ఉద్యోగుల తొలగింపులకు వెళ్లటంపై ఇటు కంపెనీ ఇన్వెస్టర్లు, వినియోగదారుల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది.

శాఖల బ్యాంకింగ్ విభాగంలోని అనేక విభాగాల్లో తొలగింపులు జరిగాయని తెలిసింది. కాగా.. ఒక మల్టీనేషనల్ కన్సల్టింగ్ సంస్థ సిఫార్సుల మేరకు ఈ తొలగింపులు చేపట్టింది. దీంతో హోల్‌సేల్, రిటైల్ బ్రాంచ్ బ్యాంకింగ్ సహా పలు విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడింది. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు, సిబ్బంది వినియోగాన్ని మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. తొలగింపునకు గురైన ఉద్యోగులకు మూడు నెలల జీతాన్ని బ్యాంక్ ఆఫర్ చేసిందని తెలుస్తోంది.

యెస్ బ్యాంక్ ఎక్కువగా డిజిటల్ బ్యాంకింగ్ వైపు మొగ్గుచూపుతూ.. భౌతిక జోక్యాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో బ్యాంక్ సిబ్బంది ఖర్చులు 12 శాతం పెరగటం కూడా తాజా చర్యలకు దారి తీసిందని తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో యెస్ బ్యాంక్ నికర లాభాలు ఏకంగా 74.66 శాతం పెరిగి రూ.1285.20 కోట్లకు చేరడం విశేషం. 2022-23లో రూ.735.82 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే గతేడాదియ భారీగా లాభాలు పెరిగినప్పటికీ ఉద్యోగులకు ఉద్వాసన పలకడం గమనార్హం. బుధవారం బిఎస్ఇలో యెస్ బ్యాంక్ షేర్ 0.87శాతం తగ్గి రూ.23.81 వద్ద ముగిసింది. మార్కెట్ కాపిటలైజేషన్ రూ.74.640 కోట్లుగా నమోదయ్యింది.

నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పచ్చర్ల గ్రామస్తులు

చిరుతను బంధించాలని రాస్తారోకో

ప్రజాశక్తి-మహానంది (నంద్యాల జిల్లా)



నంద్యాల జిల్లా మహానంది, సిరివెళ్ల మధ్య అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతను బంధించాలని కోరుతూ బుధవారం నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిపై స్థానికులు బైఠాయించి రాస్తారోకో చేశారు. మంగళవారం పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి మెహరున్నీసాని పులి చంపేసింది. అంతకు ముందు అక్కడక్కడ దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో మహానంది, సిరివెళ్ల మండలాల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చర్ల గ్రామస్తులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవిలోకి వెళ్లనిదే తమకు జీవనాధారం లేదని, మానవుల రక్తం మరిగిన చిరుతను వెంటనే బందించి తమ ప్రాణాలను కాపాడాలని కోరారు. ఇదిలా ఉండగా మహానంది దేవాలయ పరిసర ప్రాంతాలలో బుధవారం వేకువజామున రెండు గంటల సమయంలో దేవస్థానం వెనుక భాగంలో ఉన్న గోశాల, కామేశ్వరి సత్రం పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటాన్ని గమనించి భక్తులు పెద్దగా కేకలు వేశారు. దీంతో, చిరుత అడవిలోకి పారిపోయింది.

సెన్సెక్స్ మరో రికార్డ్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ భారీగా లాభపడ్డాయి. బుధవారం కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడేలో ఏకంగా సెన్సెక్స్ 78,759 పాయింట్ల వద్ద, నిఫ్టీ 23,890 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ గరిష్టాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ ఉదయం 78,094 వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తుదకు 621 పాయింట్లు పెరిగి 78,674కు చేరింది. నిఫ్టీ 147.50 పాయింట్ల లాభంతో 23,869 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, జెఎస్‌డబ్ల్యు స్టీల్, టైటాన్ షేర్లు అధికంగా నష్టపోయాయి. దాదాపు 1,634 షేర్లు రాణించగా.. 1,763 షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, మీడియా, ఎఫ్ఎంసిజి రంగాలు 0.3 శాతం నుంచి 2 శాతం వరకు పెరిగాయి. ఆటో, మెటల్, రియల్టీ 0.7 నుంచి 1.5 శాతం వరకు పతనమయ్యాయి.

హయర్ నుంచి కినౌచి డార్క్ ఎడిషన్ ఎసిలు

న్యూఢిల్లీ : హయర్ ఇండియా కొత్తగా కినౌచి డార్క్ ఎడిషన్ ఎయిర్ కండీషన్ సీరిస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. భారతీయ గృహాలకు అద్భుతమైన సౌకర్యాలను అందించాలనే తమ బ్రాండ్ నిబద్ధతకు ఇది నిదర్శమని హయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ పేర్కొన్నారు. ఇవి రూ.46,990 ప్రారంభ ధరతో లభిస్తాయన్నారు. లాంచ్ ఆఫర్‌లో భాగంగా, 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లతో పాటు రూ.15,990 విలువైన ఐదు సంవత్సరాల సమగ్ర వారంటీని అందిస్తోందన్నారు. ఉచిత ఇన్‌స్టాలేషన్, జీవితకాల కంప్రెసర్ వారంటీ కూడా ఉన్నాయన్నారు.

న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి మేఘా ఇంజనీరింగ్

- ఎన్‌పిసిఐఎల్ నుంచి రూ.13,000 కోట్ల కాంట్రాక్టు

హైదరాబాద్ : మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 1400 మెగావాట్ ఎలక్ట్రికల్ (ఎండబ్ల్యుఇ) అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ అఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్) నుంచి కాంట్రాక్టును దక్కించుకున్నట్లు బుధవారం ఆ సంస్థ వెల్లడించింది. ఎన్‌పిసిఐఎల్ పిలిచిన టెండర్లలో ఎంఇఐఎల్ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంది. ఇపిసి పద్ధతిలో దీన్ని నిర్మించనుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అణు ఇంధనశాఖ పరిధిలోని ఎన్‌పిసిఐఎల్ ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో ఈ రియాక్టర్ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్లు పిలిచింది. అదే ఏడాది అక్టోబర్ నాలుగున టెండర్ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. ఆ తరువాత రోజు అక్టోబర్ 5న సాంకేతిక బిడ్లను తెరిచారు. ఈ ఏడాది జూన్ 26న ప్రైస్ బిడ్లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువ ధరను కోట్ చేసి ఎంఇఐఎల్ తోలి స్థానంలో నిలిచినట్లు సంస్థ డైరెక్టర్ సి హెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్‌అండ్‌టి, బిహెచ్‌ఇఎల్ కూడా పాల్గొన్నాయి. ఈ రెండు, సంస్థలు ఎక్కువ ధరను కోట్ చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఎంఇఐఎల్ రూ.12,799.92 కోట్ల ధరను కోట్ చేసి మొదటి స్థానంలో నిలిచింది. టెండర్ల విధానంలో ఎన్‌పిసిఐఎల్ క్వాలిటీ కం కాస్ట్ బేస్డ్ (క్యుసిబిఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సంస్థ పిలిచిన టెండర్లలో ఇదే పెద్దది. టెండర్ ఖరారుకు ముందు ఎన్‌పిసిఐఎల్ నాణ్యతా ప్రమాణాలు, ఖర్చు నియంత్రణ ఇతర అంశాలపై అంచనాలు వేసింది. రూ.13 వేల కోట్ల విలువ కలిగిన కాంట్రాక్టును ఎంఇఐఎల్ తొలిసారిగా దక్కించుకుని అణు ఇంధన రంగంలోకి ప్రవేశించిందని సుబ్బయ్య తెలిపారు. ఇది తమ సంస్థ ప్రయాణంలో ఒక మైలు రాయి అని ఆయన పేర్కొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

సంపాదకీయం

సంతోషమే..కానీ..

అమెరికా సృష్టిస్తున్న మారణహోమాన్ని, ఆ దేశపు యుద్ధ కాంక్షను ప్రపంచ ప్రజానీకం ముందు బట్టబయలు చేసిన వికీలిక్స్ అధిపతి జూలియస్ అసాంజెకు ఎట్టకేలకు స్వేచ్ఛ లభించడం హర్షణీయం. కానీ, చేయని నేరాన్ని అంగీకరించడానికి సిద్ధపడిన తరువాత మాత్రమే ఆయనకు ఈ స్వేచ్ఛ లభిస్తుండటం బాధాకరం! సుదీర్ఘ నిర్బంధం తరువాత కూడా నేరాంగీకార ప్రకటనకు పట్టుపట్టడం ద్వారా అమెరికా తన నైజాన్ని చాటుకుంది. నిజానికి అసాంజే పాత్రికేయ విధిని అత్యంత సాహసోపేతంగా నిర్వహించాడు. అగ్రరాజ్యం కన్నెర్ర చేస్తుందని, ప్రాణాలకు సైతం ముప్పు ఉంటుందని తెలిసినా ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. అమెరికా యుద్ధ నేరాలను బట్టబయలు చేసే లక్షలాది పత్రాలను ప్రపంచం ముందు ఉంచాడు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా సాగించిన నరమేధాన్ని, సామాన్య ప్రజల పట్ల చేసిన అఘాయిత్యాలను సాక్ష్యాలతో సహా బట్టబయలు చేశాడు. అగ్రరాజ్యం తన రక్త దాహాన్ని, యుద్ధ కాంక్షను సమర్ధించుకునేందుకు నిస్సిగ్గుగా ప్రచారంలో పెట్టిన విషయాలు పచ్చి అబద్దాలని ఆధారాలతో సహా రుజువు చేశాడు. వివిధ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు చేస్తున్న తెర వెనుక కార్యకలాపాలను, పెంచుతున్న అవినీతిని వెలుగులోకి తెచ్చాడు. సామాన్యుల సొమ్మును కాజేస్తున్న ప్రపంచవ్యాప్త పాలకులు, ఆ పాపిష్టి సొమ్ముకు రక్షణ ఇస్తున్న అనేక దేశాల్లోని బ్యాంకుల వివరాలను బహిరంగ పరిచాడు.

నిజమైన స్వేచ్ఛా సమాజాల్లో అయితే అసాంజే సాగించిన ఈ కృషికి పట్టం కట్టి ఉండేవారు. కానీ, అమెరికా తీరు వేరు! చెప్పే మాటలకు, చేసే పనులకు ఇసుమంత కూడా పొంతన ఉండదు. అందుకే, ప్రాణాలకు తెగించి ప్రపంచ మానవాళి కోసం అసాంజే చేసిన సాహసాన్ని, వెలుగులోకి తెచ్చిన సత్యాలను గూఢచర్యమని ముద్ర వేసి, అనేక కేసులు బనాయించింది. ప్రపంచవ్యాప్తంగా తన తొత్తు దేశాలతో కూడా ఆ పని చేయించింది. ఫలితంగా 14 సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలాన్ని అసాంజే కోల్పోయాడు. స్వీడన్‌లో నమోదైన లైంగిక నేరాల కింద 2010లో మొదటి సారిగా బ్రిటన్‌లో అయన్ను అరెస్ట్ చేశారు. చిత్రంగా ఆ తరువాత ఆ ఆరోపణలను ఉపసంహరించారు. బెయిల్‌పై ఉన్న కాలంలో లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో ఆయన 2019 వరకు ఆశ్రయం పొందారు. అమెరికా జోక్యంతో అక్కడి నుండి ఆయన్ను దాదాపుగా తరిమేసినంత పనిచేశారు. బ్రిటన్ తిరిగి ఆయన్ను అరెస్ట్ చేసి హై సెక్యూర్టీ ఉండే బెల్మార్ష్ జైలులో నిర్బంధించింది. గత ఐదేళ్లుగా ఆయన ఆ జైలులోని ఒక చిన్న సెల్‌లో. ఏకాంతవాస శిక్షను అనుభవిస్తున్నాడు. కుటుంబ సభ్యులను అటుంచితే, సహచర ఖైదీలతో కూడా కలవడానికి ఆయనకు అనుమతి లేదు. బయటి ప్రపంచంతో సంబంధాలు ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో ఉన్నప్పుడే అడ్డుకున్నారు. ఈ సుదీర్ఘ శిక్ష, ఏకాంతవాసం ఆయన ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. గుండెకు కూడా సమస్యలు వచ్చినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నేరాన్ని అంగీకరిస్తే, విడుదల చేస్తామంటూ అమెరికా షరతు పెట్టింది. అనివార్య పరిస్థితుల్లో దానికి ఒప్పుకున్న అసాంజే సైపాన్ దీవిలోని న్యాయస్థానం ఎదుట హాజరై నేరం చేసినట్టు ఒప్పుకున్నాడు. అమెరికా చేసిన ఆరోపణలన్నింటిని పరిగణలోకి తీసుకుంటే అసాంజేకు 175 ఏళ్ల శిక్ష పడేది. ఒప్పందంలో భాగంగా ఆయనపై ఒకే ఒక్క నేరారోపణను అమెరికా చేసింది. దానికోసం ఐదేళ్ల శిక్ష పడుతుందని, బ్రిటన్‌లో అనుభవించిన శిక్షా కాలాన్ని పరిగణలోకి తీసుకుని వెంటనే విడుదల చేయాలన్నది ఒప్పంద సారాంశం. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయన తన స్వదేశమైన ఆస్ట్రేలియాకు వెళ్లనున్నాడు.

అసాంజేను విడుదల చేయాలని కోరుతూ ఆయన స్వదేశం ఆస్ట్రేలియా చట్ట సభలు గత సంవత్సరం ఒక తీర్మానం చేశాయి. ఆ దేశ ప్రధాన మంత్రి స్వయంగా అమెరికాకు విజ్ఞప్తి చేశారు. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన అంశంగా మారిన తరువాత కానీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగంలో కదలిక రాలేదు. అసాంజే చేత బలవంతంగా నేరాన్ని ఒప్పించిన అమెరికా పాలకులు ఎన్నికల ప్రచారంలో అది తమ ఘనతగా చెప్పుకోవచ్చు. కానీ నిజానికి ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, వాక్ స్వాతంత్రానికి ఎదురు దెబ్బ! అమెరికా, బ్రిటన్ , స్వీడన్‌ల ప్రజాస్వామ్య చరిత్రపై ఎప్పటికీ మాయని మచ్చ!

మహనీయుని మాట

స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కంటే ఏదీ అమూల్యమైనది కాదు.
- హోచిమిన్



మోడీ హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ

విశ్లేషణ

జూన్ 25 ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటన వెలువడిన రోజు. ఈ జూన్ 24వ తేదీన లోక్‌సభ మొదటి రోజు సమావేశంలో... "ప్రజాస్వామ్యం వర్సెస్ ఎమర్జెన్సీ" అంటూ నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు గోడీ మీడియాలో ప్రధానంగా వెలువడ్డాయి.

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ నిస్సందేహంగా ఒక చీకటి అధ్యాయం. అయితే దాదాపు ఫాసిస్టు తరహాలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగాన్ని మార్చేందుకు సిద్ధమౌతున్న వ్యక్తి మాటల్లో ధ్వనించే ప్రజాస్వామ్యం అనేది కపటత్వం తప్ప మరొకటి కాదు.

పలాష్ దాస్

ఎమర్జెన్సీ చీకటి రోజులు

దాదాపు అర్ధ శతాబ్దం క్రితం, 1975 జూన్ 25న భారత రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ అధికారికంగా ఎమర్జెన్సీని ప్రకటించారు. అందుకు కారణం అలహాబాద్ హైకోర్టు తీర్పు. దీని ప్రకారం 1971లో ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదు. అధికార భీతితో ప్రభుత్వం హడావుడిగా రాజ్యాంగంలోని 352వ అధికరణను వర్తింపజేసి అత్యవసర పరిస్థితిని విధించింది. ఇది 1977 మార్చి 21 వరకు కొనసాగింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి కాలం.

అత్యవసర పరిస్థితి ప్రకటించిన వెంటనే పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న వార్తాపత్రికలు, ఆకాశవాణి, దూరదర్శన్ మాత్రం ప్రభుత్వ వైభవాన్ని ప్రసారం చేస్తూనే ఉన్నాయి. వార్తాపత్రికలు, మ్యాగజైన్ల నుండి తమకు అభ్యంతరకరమైన విషయాలను తొలగించేందుకు బ్యూరో ఆఫ్ ప్రెస్ సెన్సార్‌షిప్ పని చేసింది. అయినప్పటికీ, కొన్ని వార్తాపత్రికలు, అనేక మంది జర్నలిస్టులు ప్రధానంగా నిజాన్ని పేర్కొనేందుకు ప్రయత్నించారు. ఫలితంగా ఎందరో ఎడిటర్లు, జర్నలిస్టులు అరెస్ట్ కావాల్సి వచ్చింది.

పార్లమెంటరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై దాడులు, దేశవ్యాప్తంగా మూకుమ్మడి అరెస్టులు జరిగాయి. సమావేశాలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, సమావేశాలు నిషేధించబడ్డాయి. జ్యోతిబసు, జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్ సహా దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు జైళ్ల పాలయ్యారు. మీసా (అంతర్గత భద్రతా చట్టం నిర్వహణ) తదితర చట్టాల కింద వేలాది మంది రాజకీయ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు.

అంతేగాక, సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులు కూడా ప్రమాదంలో పడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, పౌరహక్కులు హరించబడ్డాయి. సాంస్కృతిక ప్రపంచంలో ఆంక్షలు, అరెస్టులు కూడా జరిగాయి. నాటక ప్రదర్శనల నిషేధం, సినిమా ప్రదర్శనల నిలిపివేత జరిగాయి.



> మోడీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటించనప్పటికీ దేశం అప్రకటిత ఎమర్జెన్సీలో ఉంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంభమైన మీడియాను నేడు 'గోడీ మీడియా' అని పిలుస్తారు. ఇ.డి, సిబిఐ, ఆదాయపు పన్ను నియంత్రణలపై మొదట్లో విమర్శించిన ప్రధాన స్రవంతి మీడియా గోడీ మీడియాగా మారిపోయింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శంచినందుకుగాను న్యూస్ క్లిక్, ది వైర్, ఎన్‌డి టీవీలపై దాడి, మూసివేతే లక్ష్యంగా పెట్టుకుంది. సాంస్కృతిక ప్రపంచంపై కూడా అప్రకటిత ఎమర్జెన్సీ నీడ పడుతోంది. ప్రభుత్వ విధానానికి, మోడీ-షా, వారి హిందుత్వ భావజాలానికి వ్యతిరేక అభిప్రాయం వెల్లడించితే చాలు. మతపరమైన మనోభావాలను దెబ్బ తీశాయన్న సాకుతో, హిందూత్వ, మితవాద శక్తులు దాడి చేసి సినిమాలు, నాటక ప్రదర్శనలను, నృత్య సంగీత కార్యక్రమాలను నిలిపివేస్తాయి.

ఎమర్జెన్సీ - ఆర్‌ఎస్‌ఎస్

ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. సంఘ్ చీఫ్ బాలా సాహెబ్ దేవరస్ అరెస్టు తర్వాత...ఆయనను, కార్యకర్తలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఇందిరా గాంధీకి పదే పదే లేఖలు రాశారు. ఒక లేఖలో సంఘ్ రాజకీయేతర వైఖరిని నొక్కి చెబుతూ, దేశ సేవ పట్ల తమ నిబద్ధతను తెలియజేశారు. రెండో లేఖలో దేశ అభివృద్ధి, దేశ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. జైలులో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను విడుదల చేయాలని వేడుకున్నారు. మూడవ లేఖలో దేశ సంక్షేమం కోసం కలిసి పని చేసే మార్గాల గురించి చర్చించడానికి ఇందిరా గాంధీతో ఒక ప్రైవేట్ సమావేశాన్ని అభ్యర్థించారు. చివరికి విడుదలకు ప్రభుత్వం నిర్దేశించిన దరఖాస్తును నింపి సమర్పించడం ద్వారా వారు విడుదలయ్యారు.

మోడీ హయాంలో 'ప్రజాస్వామ్యం' అర్థరహితం

నరేంద్ర మోడీ హయాంలో అన్నిటినీ పీఎంఓ కార్యాలయం కేంద్రంగా మారింది. మోడీ ఎప్పుడూ ప్రజాస్వామ్య బాటలో నడవలేదు. 'మన్ కీ బాత్' అంటారు. విలేకరుల సమావేశంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ సమాధానం ఇవ్వలేదు. పార్లమెంటులో విపక్షాల చర్చను ఆయన వినలేదు. ఎవరి మాట వినకుండా, పార్లమెంట్‌లో చర్చ లేకుండానే డీమోనిటైజేషన్ చేశారు. కోవిడ్ కాలంలో అహేతుక, అశాస్త్రీయ చర్యలను చేపట్టారు. పి.ఎం కేర్స్ ఫండ్‌ను ప్రైవేట్ ఫండ్‌గా మార్చారు. ఎటువంటి చర్చ లేకుండా ఎలక్టోరల్ బాండ్లని ప్రవేశపెట్టారు.

అధికారాల కేంద్రీకరణ

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు క్రమంగా తగ్గించబడ్డాయి. పార్లమెంటులో చర్చకు అవకాశం లేదు. పార్లమెంటరీ వ్యవస్థలో చట్టాలు చేసే హక్కును తీసివేసి ఆర్డినెన్స్ రాజ్‌ని స్థాపించారు. వ్యవసాయ చట్టం, విద్యుత్ చట్టం ఆర్డినెన్స్‌లు చేసి అమలుకు దిగింది. పార్లమెంటులో మెజారిటీ వుండడంతో బిల్లులను దాదాపు బలవంతంగా ఆమోదించడం ఆనవాయితీగా మారింది.

భారత రాజ్యాంగం యొక్క లక్షణాలలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య నిర్మాణం ప్రధానమైనవి. కానీ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సారాంశంపైనే క్రమపద్ధతిలో దాడికి దిగింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను ధ్వంసం చేయడం ద్వారా ఇది రాష్ట్రాలను నిర్వీర్యం చేసింది. రాష్ట్రాల అనుమతి లేకుండానే ఆర్టికల్ 370ని రాజ్యాంగం నుండి ఏకపక్షంగా రద్దు చేసింది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అదేవిధంగా జిఎస్‌టిని ఏకపక్షంగా అమలు చేసింది. ఇవన్నీ రాష్ట్రాల హక్కులను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నాశనం చేశాయి.

స్వతంత్ర సంస్థలన్నిటిని తన అధీనంలో వుంచుకుంది. ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకోవడానికి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడానికి ఇ.డి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలను వినియోగించుతున్నది. సంఘ్ విధేయులను ఈ సంస్థల ప్రధాన అధికారులుగా నియమిస్తున్నది. ఎన్నికల సంఘం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిబిఐ మొదలైన వాటిని ఈ విధంగానే నింపింది. విద్యా రంగాన్ని కేంద్రీకరించడానికి, ప్రైవేటీకరించడానికి గాను...సిబిఎస్‌ఇ నుండి హిస్టారికల్ రీసెర్చ్ కౌన్సిల్ వరకు అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలల్లోను తమ విధేయులను నియమించడం ద్వారా వాటిని స్వాధీనం చేసుకున్నారు. నేడు అవినీతితో పార్లమెంటు దద్దరిల్లుతోంది. యుజిసి, ఎన్‌టిఎ వంటివి బిజెపి, సంఘ్ భావజాలం నిండిన అసమర్థుల చేతుల్లోకి పోయాయి. స్కూళ్లు, కాలేజీల్లో ఏం బోధించాలి, పాఠ్యపుస్తకాల్లో ఏం చేర్చాలి, ఏం తీసివేయాలనేది సంఘ్ నిర్ణయిస్తోంది. న్యాయ వ్యవస్థపై నియంత్రణను కొనసాగించడానికి చేసిన ప్రయత్నాన్నీ విస్మరించకూడదు. న్యాయమూర్తుల నియామకం నుంచి న్యాయ వ్యవస్థపై ప్రభుత్వం నిరంతరం ఒత్తిడి తెచ్చింది. ఎన్నికల కమిషనర్‌ను నియమించే బాధ్యత నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించి ఎన్నికల కమిషన్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది.

ప్రమాదంలో లౌకికవాదం, బహుళత్వం

భారతదేశంలో లౌకికవాద భావజాలాన్ని అనుసరించి మతం, భాష, కులం-గోత్రం, లింగం, సంస్కృతితో సంబంధం లేకుండా చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమే. కానీ, ప్రజలను విభజించే లక్ష్యంతో, మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించేందుకు సవరించిన సిఎఎ ని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా అమలు చేసింది. సామాజిక సామరస్యాన్ని, ఐక్యతను ధ్వంసం చేసి సంఘ్ హిందూత్వ భావజాలాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు, చిత్రహింసలు నిత్యకృత్యమవుతున్నాయి. బుల్డోజర్ రాజ్, ఎన్‌కౌంటర్, బిజెపి ప్రభుత్వం అనేవి నేడు పర్యాయపదాలుగా తయారయ్యాయి. గోసంరక్షణ దళాలు సహా వివిధ హిందుత్వ శక్తులు ఎవరు ఏం తినాలో, ఏం ధరించాలో నిర్ణయించారు. గోసంరక్షణ పేరుతోనో, లవ్ జిహాద్ పేరుతోనో మూకదాడులు జరుగుతున్నాయి.

అసమ్మతిని అణిచివేస్తున్నారు

కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాలను ఆమోదించడంతో చరిత్రాత్మక రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. ఆ ఉద్యమాన్ని అణిచివేసేందుకు మోడీ ప్రభుత్వం సైన్యం, పోలీసులతో దేశానికి అన్నం పెట్టే రైతాంగం పైనే యుద్ధానికి దిగి వారిని క్రూర హింసలకు గురి చేసింది. ఢిల్లీలోని షాహీన్‌బాగ్, జెఎన్‌యు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో సాగిన సిఎఎ-ఎన్‌ఆర్‌సి వ్యతిరేక ఉద్యమాలను అణిచివేసేందుకు ప్రభుత్వం, హిందుత్వ శక్తులు ఇలాంటి దాడులు నిర్వహించాయి. భీమా కోరేగావ్ కేసులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు ఇప్పటికీ జైళ్లలో మగ్గుతున్నారు. స్టాన్‌స్వామి జైలు కస్టడీలోనే మరణించారు. శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించిన దబోల్కర్, పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్‌ను హిందుత్వ శక్తులు హత్య చేశాయి.

అప్రకటిత ఎమర్జెన్సీ

మోడీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటించనప్పటికీ దేశం అప్రకటిత ఎమర్జెన్సీలో ఉంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంభమైన మీడియాను నేడు "గోడీ మీడియా" అని పిలుస్తారు. ఇ.డి, సిబిఐ, ఆదాయపు పన్ను నియంత్రణలపై మొదట్లో విమర్శించిన ప్రధాన స్రవంతి మీడియా గోడీ మీడియాగా మారిపోయింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శంచినందుకుగాను న్యూస్ క్లిక్, ది వైర్, ఎన్‌డి టీవీలపై దాడి, మూసివేతే లక్ష్యంగా పెట్టుకుంది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు సిద్దిక్ కప్పన్, మహ్మద్ జుబేర్, ప్రబీర్ పుర్కాయస్థతో సహా పలువురు జర్నలిస్టులు జైలు పాలయ్యారు.

సాంస్కృతిక ప్రపంచంపై కూడా అప్రకటిత ఎమర్జెన్సీ నీడ పడుతోంది. ప్రభుత్వ విధానానికి, మోడీ-షా, వారి హిందుత్వ భావజాలానికి వ్యతిరేక అభిప్రాయం వెల్లడించితే చాలు. మతపరమైన మనోభావాలను దెబ్బ తీశాయన్న సాకుతో, హిందూత్వ, మితవాద శక్తులు దాడి చేసి సినిమాలు, నాటక ప్రదర్శనలను, నృత్య సంగీత కార్యక్రమాలను నిలిపివేస్తాయి. ఢిల్లీ గ్యాంగ్ రేప్‌పై వెలువడిన బిబిసి డాక్యుమెంటరీ మన దేశంలో నిషేధించబడింది. మత ఛాందసవాదం, ఎల్‌జిబిటిక్యుల గురించిన చిత్రం "అన్-ఫ్రీడమ్" సెన్సార్ బోర్డ్ ద్వారా నిరోధించబడింది. అనేక మంది కళాకారులు, యూట్యూబర్లు, నేహా సింగ్ రాథోడ్ వంటి స్టాండ్-అప్ కమెడియన్లు ప్రతి రోజూ ట్రోలింగ్‌లకు గురవుతున్నారు. చంపేస్తామంటూ వారికి బెదిరింపులు వస్తున్నాయి.

అయితే ప్రస్తుత మోడీ 3.0 మునుపటి లాగా ఉండబోదు. ప్రతిపక్షాల సంఖ్య గతంలో కంటే ఎక్కువగానే ఉంది. ప్రజల తీర్పు మోడీకి అనుకూలంగా లేదు. సంకీర్ణ ప్రభుత్వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ దేశాన్ని పాత పద్ధతిలో నడపలేరు. అయినా బిజెపి అధికారంలో ఉంది కనక... ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం సురక్షితం కాదు. అందుకే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటం మరింత బలపడాలి.

/ 'గణశక్తి' సౌజన్యంతో /

కవిత్వం

దృశ్యం

రెటీనాపై ఏదో
రెక్కలిప్పి వాలుతున్న దృశ్యం
చూపుల కాంతిపుంజాలనడ్డగిస్తూ
పొరలు పొరలుగా పాకుతున్న దృశ్యం.
వెన్నెల వెలుగులను
చీకటి మబ్బేదో చెరబడుతున్న దృశ్యం
మెదడు సెన్సింగ్ న్యూరాన్లను
మార్మిక భ్రమ ఏదో మాయచేస్తున్న దృశ్యం.
భావంఅభావంగా ఏదోమంచులా కరిగిస్తున్న దృశ్యం
వాస్తవావస్తవాల దృగ్విషయాలనేదో
తలకిందులు చేస్తున్న దృశ్యం.
జనారణ్య చైతన్య దేహాలనేదో
శకలాలు శకలాలుగా నరుకుతున్న దృశ్యం
భయపీడన నిప్పుల జలపాతమేదో
నిలవెల్లా దహిస్తున్న దృశ్యం.
పరిపాలన వక్రరేఖ ప్రాకారాల నడుమ
ప్రజాస్వామ్య గోపురమేదో తగులబడుతున్న దృశ్యం
రాక్షస రహస్యోన్మాద హింస ఏదో
రాజ్యాన్ని ఆక్రమిస్తున్న దృశ్యం.
భావస్వేచ్ఛ పక్షినేదో
పవర్ గన్ను నేలగూల్చుతున్న దృశ్యం
గోడలేని జైలు ఏదో విస్తరిస్తూ
జనం గొంతు నొక్కుతున్న దృశ్యం.
రాజ్యం రాజకీయ క్రీనీడలో
రాబందుల గుంపేదో తిరుగాడుతున్న దృశ్యం
సమిష్టి శ్రమ సంపద సౌధాలనేదో
సర్వం స్వాహా చేస్తున్న దృశ్యం.
అంతటా అదే అదృశ్యంకాని దృశ్యం
అహం బ్రహ్మోస్మి అంటూ
అన్నిటినీ కబళిస్తూ ఆక్టోపస్‌లా
విస్తరిస్తున్న యదార్థ దృశ్యం.
భయోత్పాత ప్రకంపనల మధ్య
బిగుసుకున్న పిడికిళ్లలో సూర్యరశ్మి
వేల వేల రూపాలలో ఇక విచ్చుకోక తప్పదు
విశృంఖల విధ్వంస విపత్తు దృశ్యమిక
భస్మీపటలమై అదృశ్యం కాకతప్పదు.

- వేల్పుల నారాయణ, సెల్ : 9440433475

వ్యాసం

ఆకలి కేకలను ఆపగలమా..!

ప్రపంచంలో పోషకాహార లోపం వున్న వారు అత్యధికంగా ఆసియా దేశాల్లో 41.8 కోట్ల మంది ఉండగా, ఆఫ్రికాలో 28.2 కోట్ల మంది ఉన్నారు. కరోనా మహమ్మారి విజృంభణతో అదనంగా 3 కోట్ల మంది పేదలు ఆకలితో అలమటించారు. ప్రత్యేక చర్యలు అమలు పరచని పక్షంలో 2030 నాటికి 66 కోట్ల మంది పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది.

ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్‌ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్‌ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు. అన్నార్తులకు సంబంధించి పైన పేర్కొన్న అంశాలు ఈ నివేదిక వెలువరించినవే. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత నిర్ణయం తీసుకున్నారు.

పోషకాహార అభద్రత

ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రతతో బాధపడుతున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల మంది పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేళ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి

నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49 ఏళ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురోప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది. గర్భిణిలలో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లి పాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, అధిక బరువు పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

వాతావరణ మార్పుల ప్రభావం

ఆహార అభద్రత, పోషకాహార లోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/కర్ఫ్యూలు లాంటి అంశాలను నివేదిక పేర్కొంది. ఆహార ధాన్యాల దిగుబడి, ఆదాయాలు తగ్గడం, మార్కెటింగ్ లొసుగుల (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ధరలు)తో పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లభ్యత పెరగడానికి... వాతావరణ ఒడుదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరాలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలను పేర్కొంది. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్య సంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం ఘర్షణలు జరగడం సర్వసాధారణం. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావం అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది.

ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యు.యన్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహార లోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, సెల్ : 9949700037

జనవాక్యం

పరీక్షకుడు పరీక్ష తప్పాడు విద్యార్థి బలయ్యాడు

దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశానికి ఏర్పరుచుకున్న పరీక్షా వ్యవస్థ లోపభూయిష్టంగా మారి విద్యార్థి లోకానికి శాపంగా మారింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యం వల్ల పలు పరీక్షల వాయిదాలు, రద్దులతో విద్యా సంవత్సరానికి, విద్యార్థుల కష్టానికి, తల్లిదండ్రుల ఆర్థిక స్థితికి తగులుతున్న దెబ్బల తీవ్రత గణింపలేనిది. లక్షలాది విద్యార్థులు రాసిన యూజీసీ నెట్ పరీక్ష ఒకటి రద్దు కాగా, రాయబోయేది మరొకటి వాయిదా పడింది. ఇప్పుడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఆఖరు నిమిషంలో వాయిదా పడింది. మొదట నీట్ పరీక్షలో బయట పడ్డ తీవ్ర లోపాలు సుప్రీం కోర్టులో బాధితులు కేసు వేసేవరకూ ప్రభుత్వాన్ని కదిలించలేదు. తప్పులేమీ జరగలేదంటూ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు కొన్ని చోట్ల మాత్రమే అలా జరిగాయని అంటున్నది. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరపడానికి సూచనలు కోరుతూ నిపుణుల కమిటీ ఏర్పాటు చెయ్యడం ముదావహం అయినా అదొక్కటే సరిపోదు. తప్పు చేసిన వారికి, ఉదాసీనత చూపించిన వారికి శిక్షలు పడాలి. లక్షలాది విద్యార్థులు వారి విలువైన సమయాన్ని, ఆ విద్యార్థుల కుటుంబాలు కోట్లాది రూపాయలను కోచింగ్‌ల కోసం, సన్నద్ధత కోసం కోల్పోవడానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. దేశమంతా ఒకే సారి పరీక్షల నిర్వహణ సాధ్యం కాదంటే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం జరుపుకొనేలా విధానం మార్చాలి. అవకతవకలు ఏ స్థాయిలో జరిగినా అది విద్యార్థులందరికీ అన్యాయం జరిగినట్టే. ముందు ముందు అలా జరగకుండా చూడడమే కాదు, ఎట్టి పరిస్థితుల్లోనూ జరిగే అవకాశమే లేదు అన్న రీతిలో విధానాన్ని సంస్కరించాలి. ఆ నిబద్ధత చూపుతున్నట్లు ప్రభుత్వం కనిపించాలి. విద్యార్థి ఒక్క సెకను ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించమని బీరాలు పలుకుతున్నపుడు, ఆ పరీక్షను నిర్వహించడంలో చిన్న తప్పు కూడా జరగదు అన్న భరోసా కూడా ఇచ్చే స్థితిలో ఉండాలి. విద్యా రంగంలో ఆదర్శాలు, సంస్కరణలు, ఆశయాలు కేవలం పేపర్‌కే పరిమితం కారాదు. విద్యార్థి ఫెయిల్ అయితే ఆ నష్టం పరిమితం. విద్యా వ్యవస్థ ఫెయిల్ అయితే ఆ నష్టాన్ని గణించలేం. అందుకనే పరీక్షకుడి వైఫల్యం క్షమించరాని సామాజిక నేరం.

- డా॥ డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ.

రజకుల భద్రతకు చట్టం చేయాలి

- మంత్రి సవితకు రజక వృత్తిదారుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివక్ష, దాడులకు గురవుతున్న రజకులకు భద్రత కల్పించేందుకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. అలాగే రజకుల అభివృద్ధి కోసం కార్పొరేషన్‌కు తక్షణం విధి విధానాలు రూపొందించి నిధులు విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగాల నిర్మలమ్మ, నాయకులు బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాస్, చిక్కవరపు రెడ్డయ్య, పాండు రంగారావు, తోట సుబ్బారావు, నూతక్కి నాగేశ్వరరావు తదితరులు రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. టిడిపి కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా రజకులకు ఆధునిక దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదరణ పథకం ద్వారా రజక వృత్తిదారులకు అవసరమైన పనిముట్లు వెంటనే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 50 ఏళ్ల నిండిన వారికి వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలన్నారు. తమ ప్రభుత్వం బిసిల అభివృద్ధికి కట్టుబడి ఉందని, తక్షణం రజకుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘానికి మంత్రి ఎస్ సవిత హామీ ఇచ్చారు.

జగన్ లేఖ రాయడం సిగ్గుచేటు

- టిడిపి ఎమ్మెల్యే మాధవరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్ష హోదా కోసం అసెంబ్లీ స్పీకరుకు వైఎస్ జగన్ లేఖ రాయడాన్ని సిగ్గుచేటని టిడిపి ఎమ్మెల్యే బి మాధవి రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష హోదాపై కనీస అవగాహన లేకుండా కోరడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శాసనసభ సభ్యుల సంఖ్య మొత్తం సభ్యుల్లో 1/10 వంతు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందన్న విషయం కూడా జగన్‌కు తెలియకపోవడం బాధాకరమని అన్నారు. 11 సీట్లు మాత్రమే పొందిన జగన్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందనుకుంటున్నారని టిడిపి నేత, మాజీ ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య ప్రశ్నించారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్.. ఈ నియామకాల్లో కీలక భూమిక

న్యూఢిల్లీ: దాదాపు పదేళ్ల తర్వాత లోక్‌సభలో విపక్ష పార్టీ సభ్యుడికి ప్రతిపక్ష నేత హోదా దక్కింది. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తాజాగా ఆ బాధ్యతలు స్వీకరించారు. దీంతో కేబినెట్ మంత్రికి ఉండే సౌకర్యాలు పొందనున్నారు. లోక్‌సభలో విపక్ష కూటమికి నేతృత్వం వహించడమే కాకుండా.. ఇసి, సిబిఐ, ఇడి వంటి ప్రభుత్వ సంస్థలకు చీఫ్‌లను నియామకంలోనూ రాహుల్ కీలక భూమిక పోషించనున్నారు.

2014, 2019 ఎన్నికల్లో మొత్తం సీట్లలో 10 శాతం దక్కించుకోకపోవడంతో ప్రతిపక్ష నేత పాత్ర పోషించే అవకాశం ఎవరికీ రాలేదు. దీంతో రెండు దఫాలుగా ప్రతిపక్ష సభ్యుడి హోదా ఖాళీగా ఉంటూ వచ్చింది. ఈసారి 99 సీట్లను గెలుచుకోవడంతో రాహుల్‌కు ఆ హెూదా దక్కింది. వాస్తవానికి 1969 వరకూ ప్రతిపక్ష నేతకు ఎలాంటి గుర్తింపు, హోదా, ప్రత్యేకాధికారాలు ఉండేవి కావు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత జీతభత్యాల చట్టం-1977 ద్వారా ప్రత్యేక గుర్తింపునివ్వడం మొదలుపెట్టారు. అలాగే వేతనంగా రూ.3.3 లక్షలు, జడ్ కేటగిరీ భద్రత లభిస్తుంది. పార్లమెంట్ బిల్డింగ్‌లో ఆయనకో కార్యాలయం, ప్రభుత్వ బంగ్లా, సిబ్బంది కూడా ఉంటారు. లోక్‌సభలో విపక్ష సభ్యులు కూర్చునే చోట తొలి సీటు కేటాయిస్తారు. అలాగే ప్రతిపక్ష నేతగా కొన్ని నియామకాల విషయంలో రాహుల్ గాంధీ భాగస్వామ్యం ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లను నియమించే ముగ్గురు సభ్యుల కమిటీలో రాహుల్ గాంధీ ఒకరిగా ఉంటారు. ప్రధాని, కేంద్రమంత్రి ఇతర సభ్యులుగా ఉంటారు. అలాగే, సిబిఐ, ఇడి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వంటి ప్రభుత్వ ఏజెన్సీలకు అధిపతులను నియమించే కమిటీలోనూ రాహుల్ కీలకంగా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో ప్రధాని మోడీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన నియమించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ కమిటీలో సభ్యుడిగా ఉంటారు. దీంతోపాటు ప్రతిపక్ష నేతగా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్, కొన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తారు.

తండ్రి, తల్లి తర్వాత..

1989 డిసెంబరు 18 నుంచి 1990 డిసెంబరు 23 వరకూ రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. దీంతో ప్రతిపక్ష నేతలుగా పని చేసిన ప్రత్యేక రికార్డు రాహుల్ గాంధీతోపాటు, ఆయన తండ్రి, తల్లికి దక్కినట్లయింది. 7, 8 లోక్‌సభలతో పాటు, 16, 17 లోక్‌సభల్లో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతలెవరూ లేరు. ఇప్పుడు 18వ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ వ్యవహరించనున్నారు. 1970 జూన్ 19న జన్మించిన రాహుల్ గాంధీ 2004 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2004, 2009, 2014లలో అమేథీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. 2019లో అమేథీలో ఓడిపోయినా వయనాడ్‌లో గెలిచారు. అయితే ఈసారి రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి పోటీ చేసి రెండు చోట్లా విజయం సాధించారు. వయనాడ్‌కు రాజీనామా చేసి ప్రస్తుతం తన తాత, నానమ్మ, అమ్మ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నియోజకవర్గానికి ఎంపీగా కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా శామ్ పిట్రోడా పునర్నియామకం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ ఛైర్మన్‌గా శామ్‌పిట్రోడా తిరిగి నియమితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను తిరిగి నియమించారు. ఈ విషయాన్ని పార్టీ సీనియర్ నేత కేసీ వేణు గోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వారసత్వ పన్ను విధానంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అమెరికాలోని ఓ విధానాన్ని ఉటంకిస్తూ.. "ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సొత్తు ఉందనుకుంటే.. ఆ వ్యక్తి మరణం తర్వాత అందులో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు బదిలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది" అని వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది తీవ్ర వివాదంగా మారడంతో ఈ తర్వాత ఆయన చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదంటూ కాంగ్రెస్ పేర్కొంది. ఈ నేపథ్యంలో పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. తాజాను ఆయనను తిరిగి అదే పదవిలో నియమించడం గమనార్హం.

పాలసీదారులకు 12% అధిక బోనస్ : ఎఫ్‌జిఐఎల్ఐ

ముంబయి : ఆర్థిక సంవత్సరం 2023-24 గాను తమ పాలసీదారులకు అత్యధికంగా రూ.59.80 కోట్ల బోనస్ అందిస్తున్నట్లు ఫ్యూచర్ జనరలీ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌జిఐఎల్ఐ) ప్రకటించింది. దీంతో పార్టిసిపేటింగ్ ప్రోడక్టులలో పెట్టుబడులు పెట్టిన 1,01,000 మందికి పైగా పాలసీదారులకు ప్రయోజనం లభించనుందని పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12 శాతం అధిక బోనస్ లభించనుందని తెలిపింది. అత్యధిక పార్టిసిపేటింగ్ బోనస్ ప్రకటించడమనేది తమ పటిష్టమైన ఆర్థిక పరిస్థితికి నిదర్శనమని ఆ సంస్థ సిఇఒ అలోక్ రుంగ్టా తెలిపారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr & 1st Floor, Door No. 31--31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

O.A.No. 1273/2023

Between :
UNION BANK OF INDIA, (Erst While Andhra Bank),
Gudivada Branch, Krishna District,
rep. by its Chief Manager ....Applicant
And
Mr. Boppana Jagadeswara Rao and Another ....Defendant

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
Defendant No. 2
Mr. Chintapalli Ram Prasad
S/o. Venkata Kutumba Rao, H.No. 13/295, Patimeeda Village,
Gudivada Mandal, Krishna Dist., AP

Whereas the Applicant has instituted an Application under Section 19 of The Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 2) for Recovery of sum of mentioned therein together with current and future interest and other relief's. You are here by summoned to appear and file written statement before this Tribunal at 10.30 A.M. or at such time immediately thereafter according to the convenience of tribunal on **22-07-2024** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
5. Take Notice that in default of your appearance on the day mentioned herein before the proceedings will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this the 24th day of June 2024 At Visakhapatnam
Signature of the Officer, Authorized Debts Recovery Tribunal Visakhapatnam

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత / డైరెక్టర్స్ / ప్రమోటర్స్ : 1 (ఎ) మెస్సర్స్ ఎస్.ఎస్. అగ్రి గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ / అడ్మిన్ ఆఫీస్ : ఫ్లాట్ నెం. 401, వానమాలి టవర్స్, కృష్ణ నగర్ 3వ లైన్, [illegible]

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 16-01-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 27-03-2024**న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

[illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

తేది : 11-06-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత / డైరెక్టర్స్ / ప్రమోటర్స్ : 1 (ఎ) మెస్సర్స్ జిఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్, ప్రొ॥ శ్రీమతి గంగా రత్నం పంధి, సర్వే నెం. 144-3బి2, డి.నెం. 3-19, పెనుమల్లి గ్రామం, గురజ బ్లాక్, ముదినేపల్లి మండలం, కృష్ణా జిల్లా - 521325. **1 (బి) శ్రీమతి గంగా రత్నం పంధి,** భర్త : పి. చిన్న నూకరాజు, డి.నెం. 4-73, పెయ్యూరు గ్రామం, ముదినేపల్లి మండలం, కృష్ణా జిల్లా - 521325. **1 (సి) శ్రీమతి గంగా రత్నం పంధి,** భర్త : పి. చిన్న నూకరాజు, డి.నెం. 8-910, తాడిగడప, పెనమలూరు (మం), కృష్ణా జిల్లా - 521134. **1 (డి) శ్రీమతి గంగా రత్నం గంధి,** భర్త : పి. చిన్న నూకరాజు, డి.నెం. 4-116, మెయిన్ రోడ్డు, లంపకలొవ, ప్రత్తిపాడు, తూర్పు గోదావరి జిల్లా - 533432.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి శ్రీమతి గంగా రత్నం పంధి గారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 31-05-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

[illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

తేది : 27-05-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

[illegible]

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 16-01-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 28-03-2024**న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

[illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

తేది : 11-06-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత / డైరెక్టర్స్ / ప్రమోటర్స్ : 1 (ఎ) మెస్సర్స్ అరుణ గార్మెంట్స్, ప్రొ॥ మోటికి శ్రీనివాసరావు, డి.నెం. 33-22-23, సి.హెచ్. రాజేశ్వరరావు వీధి, విశాలాంధ్ర రోడ్డు, సీతారాంపురం, విజయవాడ - 520004. **హామీదారులు : 2 (ఎ) శ్రీ మోటికి శ్రీనివాసరావు,** డి.నెం. 33-22-23, సి.హెచ్. రాజేశ్వరరావు వీధి, విశాలాంధ్ర రోడ్డు, సీతారాంపురం, విజయవాడ - 520004. **2 (బి) శ్రీమతి మోటికి లక్ష్మి అరుణ,** భర్త : మోటికి శ్రీనివాసరావు, డి.నెం. 33-22-23, సి.హెచ్. రాజేశ్వరరావు వీధి, విశాలాంధ్ర రోడ్డు, సీతారాంపురం, విజయవాడ - 520004.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి శ్రీ మోటికి శ్రీనివాసరావు గారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-01-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 23-06-2022**న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **ఎ.ఆర్.బి. బ్రాంచి** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

కాబట్టి, ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరాత్ర ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా బ్యాంక్ ఆమోదయోగ్యమైన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు. విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-01-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ, అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

శ్రీ మోటికి శ్రీనివాసరావు గారి పేరిట ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, నూజివీడు, ఆర్.ఎస్.నెం. 625/2, దగ్గర డోర్ నెం. 18-425, ఫ్లాట్ నెంబర్లు : 1,2, 17, 18, 19 వద్ద 1078.93 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి. **హద్దులు (డాక్యుమెంట్ ప్రకారం) : ఉత్తరం** : మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం. 16, 3 ఆస్తి, **తూర్పు :** 40 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** 40 అ॥ వెడల్పు రోడ్డు.

తేది : 22-05-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ డి నెం.3-28-12, 4వ లేన్, బృందావన్ గార్డెన్స్ నార్త్, గుంటూరు-522006, ఎ.పి.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
ఋణగ్రహీత(లు): 1. M/s. **గాయత్రి కన్‌స్ట్రక్షన్స్,** ఫ్లాట్ నెం 408, 4వ అంతస్తు, విఎన్ఆర్ టవర్స్, 1వ లైన్, రాజేంద్రనగర్, గుంటూరు-522006. **ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్లు: 2. శ్రీ వట్టిగుంట శివ కుమారి, భర్త: నాగిరెడ్డి,** ఫ్లాట్ నెం 408, 4వ అంతస్తు, విఎన్ఆర్ టవర్స్, 1 వ లైన్, రాజేంద్రనగర్, గుంటూరు-522006, **3. శ్రీ వట్టిగుంట శివ సాంబిరెడ్డి, తండ్రి: నాగిరెడ్డి,** డి.నెం. 1-53/A, సాయి బాబా గుడి దగ్గర, మెయిన్ రోడ్డు, కోటప్పకొండ, కొండకావూరు గ్రామం, నరసరావుపేట, గుంటూరు, **4. శ్రీమతి వట్టిగుంట గౌతమి, భర్త: శివ సాంబిరెడ్డి,** డి.నెం. 1-53/A, సాయి బాబా గుడి దగ్గర, మెయిన్ రోడ్డు, కోటప్పకొండ, కొండకావూరు గ్రామం, నరసరావుపేట, గుంటూరు.

హామీదారులు: 1. శ్రీమతి వట్టిగుంట శివ కుమారి, భర్త: నాగిరెడ్డి, ఫ్లాట్ నెం 408, 4వ అంతస్తు, విఎన్ఆర్ టవర్స్, 1వ లైన్, రాజేంద్రనగర్, గుంటూరు-522006, **2. శ్రీ వట్టిగుంట శివ సాంబిరెడ్డి, తండ్రి: నాగిరెడ్డి,** డి.నెం. 1-53/A, సాయి బాబా గుడి దగ్గర, మెయిన్ రోడ్డు, కోటప్పకొండ, కొండకావూరు గ్రామం, నరసరావుపేట, గుంటూరు, **3. శ్రీమతి వట్టిగుంట గౌతమి, భర్త: శివ సాంబిరెడ్డి,** డి.నెం. 1-53/A, సాయి బాబా గుడి దగ్గర, మెయిన్ రోడ్డు, కోటప్పకొండ, కొండకావూరు గ్రామం, నరసరావుపేట, గుంటూరు.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధలనలతో చదవబడు సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ M/s. **గాయత్రి కన్‌స్ట్రక్షన్స్** వారిని బకాయి **రూ.2,76,11,015/- (అక్షరాల రెండు కోట్ల డబ్బై ఆరు లక్షల పదకొండు వేల పదిహేను రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్, గుంటూరు బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్** అధీకృత అధికారి **07.08.2023 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 13.02.2024**న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక/భౌతిక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **ప్రజాశక్తి** (తెలుగు) & **డెక్కన్ క్రానికల్** (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది. 16.02.2024న ప్రచురించడమైనది.

మీరు కొంత చెల్లింపులు చేసిన తరువాత తేది. **31.05.2024 నాటికి మీరు చెల్లించవలిసిన బకాయి రూ.1,47,72,479/- (అక్షరాల ఒక కోటి నలభై ఏడు లక్షల డబ్బై రెండు వేల నాలుగు వందల డబ్బై తొమ్మిది రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 25.06.2024, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

SBI **భారతీయ స్టేట్ బ్యాంక్**
గురజాల బజార్ బ్రాంచ్, గురజాల (బ్రాంచ్ కోడ్ : 21598), పల్నాడు జిల్లా

స్వాధీనతా ప్రకటన
రూల్ 8(1)) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్ 2002) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, గురజాల బజార్ బ్రాంచ్, గురజాల, పల్నాడు జిల్లా** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటీసులో పేర్కొన్న బకాయి **తేది.03.04.2024 నాటికి ABL ఖాతా నెం. 38235212598 కు రూ.5,67,173/- (అక్షరాల ఐదు లక్షల అరవై ఏడు వేల నూట డెబ్భై మూడు రూపాయలు మాత్రమే)** మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ, ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీ సంకటి శ్రీనివాస రెడ్డి, తండ్రి : వెంకట నర్సిరెడ్డి,** డోర్ నెం.18-80, జంగా మహేశ్వరపురం గ్రామం, గురజాల మండలం, పల్నాడు జిల్లా, **సహ-ఋణగ్రహీత : శ్రీ గొట్టం సైదా రెడ్డి, తండ్రి : మల్లారెడ్డి,** డోర్ నెం.15-296/12, గురజాల, పల్నాడు జిల్లా వార్లను కోరుతూ **తేది.03.04.2024** న డిమాండ్ నోటీసు జారీచేసినారు.

ఋణగ్రహీత సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో 8 తో చదివే సదరు యాక్ట్‌లోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **ది.21.06.2024న లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు / హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **తేది.03.04.2024 నాటికి రూ.5,67,173/- (అక్షరాల ఐదు లక్షల అరవై ఏడు వేల నూట డెబ్భై మూడు రూపాయలు మాత్రమే)** + మరియు సదరు మొత్తంపై వడ్డీ + ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి **భారతీయ స్టేట్ బ్యాంక్, గురజాల బజార్ బ్రాంచ్, గురజాల, పల్నాడు జిల్లా** వారి ఛార్జ్‌కి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రార్ జిల్లా, గురజాల సబ్-జిల్లా, గురజాల మండలం, గురజాల గ్రామ పంచాయితీ పరిధిలో, శ్రీరామ్‌పురం, గురజాల, గురజాల గ్రామ డి.నెం.లు.1742/1, 1742/2-2, 1742/2-3, 5వ బ్లాక్, సమీప డోర్ నెం.15-312 వద్ద ఉన్న విస్తీర్ణం 113.78 చ॥గ॥లు లేదా 95.57 చ॥మీ॥లు స్థలం అందుగల ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్సియల్ భవన నిర్మాణం యావత్తు ఆస్తి రిజిస్టర్డు అమ్మకపు దస్తావేజు నెం. 335/2012, తేది.20.01.2012 ప్రకారం **శ్రీ గొట్టం సైదా రెడ్డి, తండ్రి : మల్లారెడ్డి** గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** లంకా వర లక్ష్మి గారి ఇల్లు 98 లింకులు, **దక్షిణం :** షేక్ జైనాబి గారి ఇల్లు 23.75 లింకులు, **పడమర :** అల్లం లక్ష్మి గారి స్థలం 100 లింకులు, **ఉత్తరం :** పంచాయితీ బజార్ 23.75 లింకులు.

తేది : 21.06.2024 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : గురజాల భారతీయ స్టేట్ బ్యాంక్

బొబ్బిలిలో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

బొబ్బిలిలో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం జరిగింది. ఆన్‌సైన్ ట్రేడింగ్‌లో ఇద్దరు మోసపోయారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు పొందవచ్చని గుర్తు తెలియని వ్యక్తులు చెప్పడంతో పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పెట్టుబడులు పెట్టారు. పట్టణంలోని వెలమ వారివీధిలో నివాసముంటున్న ఎల్‌ఐసి రిటైర్డ్ డవలప్‌మెంట్ అధికారి కృష్ణారావు ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు పొందవచ్చని గుర్తు తెలియని వ్యక్తి చెప్పడంతో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల ఐదున పెట్టుబడులు పెట్టడం ప్రారంభించి మొదటిసారి రూ.లక్ష పెట్టుబడి పెట్టగా ఎక్కువ లాభం చూపించారు. ఈ నెల 5 నుంచి 15 వరకు రూ.51 లక్షల వరకు పెట్టుబడి పెట్టించి తిరిగి చెల్లించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను బాధితుడు ఆశ్రయించారు. మరో వ్యక్తి గరుగబిల్లి భార్గవి యుఎస్ బ్యాంక్ విఐపి యాప్‌లో ఏప్రిల్, మే నెలలో రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఎప్పటికీ డబ్బులు చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ మాయలో పడొద్దని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగేశ్వరరావు తెలిపారు.

వైసిపి ఆఫీసుల కూల్చివేతలపై స్టేటస్‌కో

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో వైసిపి ఆఫీసు భవనాల కూల్చివేత చర్యలకు పాల్పడకుండా ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పార్టీ వేసిన కేసులో హైకోర్టు.. ఇప్పుడున్న యథాతథస్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. పూర్తి వివరాలను అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వైసిపి బిల్డింగ్స్ కూల్చివేత విషయంలో పూర్తి వివరాలను అందజేయాలంది. ఈ మేరకు జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. తాడేపల్లిలో వైసిపి ఆఫీసు బిల్డింగ్ కూల్చివేతల విషయంలో చట్ట ప్రకారం చేస్తామని చెప్పిన ప్రభుత్వం కూల్చివేసింది. దీంతో యథాతథ స్థితిని కొనసాగించాలన్న ఆ పార్టీ వినతిని ఆమోదించి స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. వైసిపి ఆఫీసు బిల్డింగ్స్ కూల్చివేతల నోటీసులను సవాలు చేస్తూ 12 పిటిషన్లు దాఖలయ్యాయి. అధికారులు ఇతర ప్రక్రియను కొనసాగించుకోవచ్చునని, అయితే కూల్చివేతల వ్యవహారంలో యథాతథ స్థితిని కొనసాగించాలని షరతు విధించింది.

'పిన్నెల్లి' బెయిల్ పిటిషన్ డిస్మిస్

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. ఇవిఎం ధ్వంసం చేశారంటూ పిన్నెల్లిపై రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై పిన్నెల్లి దాడి చేశారంటూ టిడిపి ఎన్నికల ఏజెంటు శేషగిరిరావు ఫిర్యాదుపై మరో కేసు, తనను దుర్భాషలాడారని నాగశిరోమణి అనే మహిళ ఇచ్చిన మరో ఫిర్యాదుపై కూడా అదే పిఎస్‌లో కేసులు ఉన్నాయి. సిఐ నారాయణస్వామిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనకు సంబంధించి పిన్నెల్లిపై కారంపూడి పోలీసులు కేసు పెట్టారు. వీటిలో గతంలో జారీ చేసిన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు రద్దు చేసింది. పిన్నెల్లిపై మొత్తం 11 కేసులున్నాయని, ఆయన పదేపదే నేరాలకు పాల్పడుతున్నారని, గత ఎన్నికల సందర్భంగా కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడ్డారని, ఈ పరిస్థితుల్లో ముందస్తు బెయిల్‌ను కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఏడేళ్ల లోపు జైలుశిక్ష పడే కేసుల్లో సిఆర్‌పిసి సెక్షన్ 41ఏ కింద నిందితుడికి నోటీసులివ్వడం తప్పనిసరి కాదని, ఇది దర్యాప్తు అధికారం విచక్షణకు లోబడి ఉంటుందని చెప్పింది.

పార్కింగ్ ఫీజు వసూలుపై పిల్

రాష్ట్ర వ్యాప్తంగా మల్టీప్లెక్సులు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విజయవాడకు చెందిన చందన మోహనరావు పిల్ దాఖలు చేశారు. పార్కింగ్ ఫీజు వసూలుకు వీలు కల్పిస్తూ ఇచ్చిన జిఓ 35ను రద్దు చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. జిఓ 35 స్థానంలో జిఓ 13 వచ్చిందని చెప్పారు. జిఓ 13 సినిమా టిక్కెట్లకు సంబంధించిందని హైకోర్టు చెప్పింది. పార్కింగ్ ఫీజుల ప్రస్తావన అందులో లేదని పేర్కొంది. ప్రభుత్వ వివరణ కోసం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ ఖాళీ అయినట్లుగా నోటిఫికేషన్ ఇవ్వొద్దు

వైసిపి విప్ విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై శాసనమండలి ఛైర్మన్ ఈ నెల 4న జారీ చేసిన అనర్హత వేటు ఉత్తర్వులను మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హైకోర్టులో సవాలు చేశారు. మండలి ఛైర్మన్ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. తనను శాసనమండలి సభ్యుడిగా కొనసాగేలా ఉత్తర్వులివ్వాలన్నారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు. రఘురాజు భార్య తెలుగుదేశం పార్టీలో చేరారన్న కారణంతో పిటిషనర్‌పై అనర్హత వేటు వేశారని న్యాయవాది వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్‌పై అనర్హత వేటు నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లుగా నోటిఫికేషన్ జారీ చేయొద్దని ఇసికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. శాసన వ్యవహారాల కార్యదర్శి, ట్రిబ్యునల్ ఛైర్మన్ హోదాలో మండలి ఛైర్మన్, విప్ విక్రాంత్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణను జులై 10కి వాయిదా వేసింది.

హెల్మెట్ లేకపోవడంతో ఏడాదిలో 3,042 మంది మృతి

రాష్ట్రంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం దారుణ విషయంగా పరిగణించాలని హైకోర్టు అభిప్రాయపడింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను ఆదేశించింది. ఈ వ్యవహారంలో చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలంది. ఈ విషయంపై కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హెల్మెట్ లేకపోవడం వల్ల 2022లో 3,042 మంది చనిపోయారని, హెల్మెట్‌ను విధిగా పెట్టుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో దాఖలు చేసిన పిల్‌పై విచారణ 4 వారాలకు వాయిదా పడింది.

వలంటీర్ల నియామకంపై వివరణ ఇవ్వండి

వైసిపి కార్యకర్తలపై గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించారని, వారి నియామకాలు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలంటూ దాఖలైన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది. ఈలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గ్రామ, వార్డు వలంటీర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ కడప జిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబుబాకర్ సిద్దిఖి పిల్ దాఖలు చేశారు. వైసిపి కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించిందని న్యాయవాది వాదించారు.

ఎస్‌వియు ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా చంద్రయ్య

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బి. చంద్రయ్య నియమితులైనట్లు పరిపాలన భవనం ఒక ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీలోని యుజిసి విభాగంలో జాయింట్ రిజిస్ట్రార్‌గా ఎంతో కాలంగా పరిపాలన అనుభవం కలిగిన బి.చంద్రయ్యకు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇటీవల అనివార్య కారణాలవల్ల ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న భౌతిక శాస్త్ర విభాగపు ఆచార్యులు ఒ.ఎం.డి హుస్సేన్ రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో గత పది రోజులుగా వర్సిటీ పరిపాలన భవనంలో ఎటువంటి ఆర్థికపరమైన కార్యకలాపాలు, పరిపాలనా పరమైన కార్యకలాపాలు జరగకపోవడంతో పరిపాలన స్తంభించిన విషయం విదితమే. యుజిసి విభాగంలో జాయింట్ రిజిస్ట్రార్ బి.చంద్రయ్య కు ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించడం పట్ల బోధన, బోధనేతర ఉద్యోగుల ప్రెసిడెంట్ పికె సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర్, హాస్టల్ టెక్నికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ సింగ్, మాజీ ప్రెసిడెంట్ నాగరాజు, మాజీ సెక్రటరీ రవిచంద్ర, ఎన్ఎమ్ఆర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగదీష్, రూస సీఈవో వంశీకృష్ణ, అకాడమీక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

మలేరియాకు మందుల్లేవ్!

- పెరుగుతున్న కేసులు
- నిలిచిన హెచ్‌డిఎస్ నిధులు
- పిహెచ్‌సిల్లో మందులకు వైద్యులదే చేతిచమురు
- నాలుగేళ్లు కావస్తున్నా పంపిణీ కాని దోమతెరలు

ప్రజాశక్తి- సీతంపేట (పార్వతీపురం మన్య జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లాను మలేరియా మందుల కొరత వేధిస్తోంది. గతేడాది ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డిఎస్) నిధులు ఆలస్యంగా పంపిణీ చేశారు. ఈ ఏడాది ఆ నిధులు కూడా రాలేదు. దీంతో, మలేరియా మందుల కొరత ఏర్పడింది. బయట మార్కెట్లో కూడా ఎసిటి, ప్రేమాక్విన్ మందులు దొరకడం లేదు. ఒకవేళ ప్రముఖ నగరాల నుంచి మందులు తెప్పిస్తే, వైద్యులకు చేతి చమురు వదులుతోంది. ఇప్పటికే ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైంది. ఏజెన్సీలో మలేరియా జ్వరాలు మరోవైపు కుదిపేస్తున్నాయి. దీంతో, వైద్యులు తలలు పట్టుకుంటున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు యుపిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది ఇప్పటివరకు 340 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. సీతంపేట మండలంలో జనవరి నుంచి ఇప్పటివరకు 49 మలేరియా పాజిటివ్ కేసులు తేలాయి. దీనినిబట్టి మన్యంలో మలేరియా విజృంభణ ఎలా ఉందో అర్థమవుతోంది. నాలుగేళ్లకు ఒకసారి దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా ఇంకా దోమ తెరలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు ర్యాపిడ్ కిట్ ద్వారా పరీక్షించి మలేరియా పాజిటివ్ నమోదైతే, మరల స్లైడ్ ద్వారా పరీక్షిస్తారు. అప్పుడూ మలేరియా పాజిటివ్‌గా తేలితే ఆ నివేదిక కూడా జిల్లా కేంద్రానికి పంపించాలి. అప్పుడు జిల్లా కేంద్రం నుంచి మలేరియా మందులు రోగికి సరఫరా చేస్తున్నారు. లేదంటే, వైద్యులు సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేసి రోగులకు ఇస్తున్నారు. అధికారులు మాత్రం అవసరమైతే ఆస్పత్రి అభివృద్ధి నిధులు వినియోగించాలని చెబుతున్నారు. కానీ, నిధులు ఈ ఏడాది పిహెచ్‌సిలకు రాలేదు. దీంతో, వైద్యులు ఏమీ చేయలేక సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు.

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే మలేరియా మందుల నిల్వలు ఉండేవి. ప్రస్తుతం స్లైడ్ ద్వారా మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయితే జిల్లా మలేరియా కేంద్రం నుంచి మందులు వస్తున్నాయి. ర్యాపిడ్ ద్వారా మలేరియా నిర్ధారణ అయితే మాత్రం వైద్యులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిందే. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందుల కొరత వేధిస్తోంది. గతంలో ర్యాపిడ్ కిట్ ద్వారా మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయినా మలేరియా మందులు రోగికి అందజేసేవారు. ప్రేమాక్విన్, ఆర్టెస్నేట్ (ఎసిటి).. ఈ రెండు రకాల మలేరియా మందులు లేవు . కేవలం క్లోరోక్లీన్ మందులు మాత్రమే ఉన్నాయి.

మండలాల వారీగా మలేరియా కేసులు

మండలం	మలేరియా కేసులు
భామిని	12
గుమ్మలక్ష్మీపురం	78
జియ్యమ్మవలస	10
కొమరాడ	36
కురుపాం	53
మక్కువ	5
పాచిపెంట	36
పార్వతీపురం	24
సాలూరు	25
సీతంపేట	49
వీరఘట్టం	12
మొత్తం	340

అద్వానీకి అస్వస్థత



న్యూఢిల్లీ : బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఉపప్రధాని ఎల్‌కె అద్వానీ (96) బుధవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో చేర్పించినట్లు సంబంధికులు తెలిపారు. వృద్ధాప్య సమస్యలకు సంబంధించిన విభాగానికి చెందిన వైద్యుల బృందం పర్యవేక్షణలోకి ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొద్ది నెలల కిందటే ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించగా..అనారోగ్య కారణాల రీత్యా పురస్కార స్వీకారానికి వెళ్లక పోవడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా అద్వానీ నివాసానికి వెళ్లి ఆ పురస్కారాన్ని అందజేసిన సంగతి తెలిసిందే.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance

రిజిష్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కూర్ల కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్) ముంబయి-400051

కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కూర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.

బ్రాంచ్ ఆఫీసు: సుప్రీయ టవర్స్, 1వ అంతస్తు, డోర్ నెం.5-37-155, 4/15 బ్రాడిపేట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

ఏదైతే,

క్రింది సంతకందారులు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్ 2002లోని రూల్3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి60 రోజుల్లోగానోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.

రుణగ్రహీత బకాయి ఉన్నమొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి చెల్లించుటకులోబడి ఉంటుందని తెలియజేయనైనది.

క్ర సం.	రుణగ్రహీత /సహ-రుణగ్రహీత పేరు /రుణ ఖాతా నంబరు	ఆస్తి యొక్క వివరణ/ స్వాధీనం చేసుకొన్న తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	బోధనంపాటి రామారావు (రుణగ్రహీత), బోధనంపాటి రమణ (సహ-రుణగ్రహీత), LHGTR00001391055.	గురిజాల రెడ్డిచింతల మెయిన్ రోడ్, 7 124 డోర్ నెం.7 124 గుంటూరు, ఆంధ్రప్రదేశ్ 522316 (రిఫరెన్స్ లాన్ నెం. LHGTR00001391055). సరిహద్దులు: ఉత్తరం: పి.అమరయ్య ఆస్తి, దక్షిణం: ఓ సీతమ్మ ఆస్తి, తూర్పు: పంచాయతీ బజార్ 14, పడమర: ఎం శ్రీను ఆస్తి 14. **స్వాధీనతా తేదీ: 21-జూన్-2024**	12-02-2024 Rs.13,49,375.2/-	గుంటూరు -బి

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: 27.06.2024 ప్రదేశం: గుంటూరు — **అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

లా కాలేజీలపై బిసిఐ కొరడా

- ఎఐఆర్‌తో పాటు, షిర్డీసాయి లో ప్రవేశాలు రద్దు
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ ఆంక్షలు

ప్రజాశక్తి - తిరుపతి

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న లా కాలేజీలపై బిసిఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) కొరఢా ఝులిపించింది. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు మండలం, అంజిమేడు వద్ద ఏర్పాటు అయిన అగరాల ఈశ్వర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ లా తోపాటు, విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలోని గవరపాలెంలో ఉన్న శ్రీ షిరిడిసాయి విద్యాపరిషత్ ఆధ్వర్యంలోని శ్రీ షిరిడిసాయి లా కాలేజీ లో ప్రవేశాలను రద్దు చేసింది. ఈ మేరకు అధికారక ప్రకటన విడుదల చేసింది.

ఎపిలోని లా కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశాలకు సంబంధించి జూన్ 9న ఎపి లాసెట్/ పిజిఎల్‌సెట్ 2024 ప్రవేశ పరీక్షను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించింది. పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 10న విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి జూన్ 11, 12 వ తేదీల్లో ఆన్సర్ కీపై అభ్యంతరాలు స్వీకరించింది. ఈ ప్రక్రియ పూర్తవ్వడంతో ఫలితాల వెల్లడికి ఉన్నతవిద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సందర్భంలో అగరాల ఈశ్వర్ రెడ్డి కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష నిర్వహణ, కాపీయింగ్ విషయంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో సెమిస్టర్ పరీక్షల నిర్వహణలోనూ కాపీయింగ్‌కు పాల్పడడంతో స్వయంగా తిరుపతి జిల్లా కలెక్టర్ స్పందించారు. రేణిగుంట తహసీల్దార్ ను ఆకస్మిక తనిఖీలకు పంపి రిపోర్టును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు పంపారు. ఇలాగే వైజాగ్‌లోని షిరిడి సాయి లా కాలేజ్‌పైన పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఈ రెండు కళాశాల పైన బిసిఐ నిషేధం విధించడం గమనార్హం. అలాగే దేశవ్యాప్తంగా మొత్తం 7 కళాశాలల్లో ఈ ఏడాది (2024-25) ప్రవేశాలను రద్దుచేయగా ... నాలుగు యూపీ కాలేజీలే కావడం గమనార్హం.

రైతులకు రూ. 202 కోట్ల బకాయిలు

- ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ధాన్యం సొమ్ము కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రూ.202 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. గత రబీ సీజన్లో 1.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. జిల్లాలోని 365 రైతు భరోసా కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, 2.28 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం రూ.202 కోట్ల ధాన్యం బకాయిలు ఉన్నాయి. రబీ చివరిలో సాగునీరు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ధాన్యం కొనుగోలుపై అధికార యంత్రాంగం చొరవ లోపించింది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, ఆపై చెల్లింపులు ప్రహసనంలా మారాయి. తాజాగా జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. గత పంట బకాయిలు రాకపోవడంతో సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రహసనంలా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారిందని అధికారుల గణాంకాలే చెబుతున్నాయి. సుమారు లక్ష మంది రైతులు 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. ప్రభుత్వం కేవలం 23,081 మంది రైతుల నుంచి 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. ఇందుకుగానూ రూ.498.64 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.296 కోట్లు మాత్రమే చెల్లింపు జరిగింది. సుమారు ఐదు వేలకుపైగా రైతులు రూ.202.33 కోట్ల బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. సాంకేతిక సమస్యలు, గన్ని బ్యాగుల కొరత వంటి కారణాలతో ప్రభుత్వ మద్దతు ధరకు రూ.200 తక్కువగా వ్యాపారులకు విక్రయించినట్లు రైతులు చెబుతున్నారు.

ప్రయివేట్ అప్పుల వైపు రైతులు

గత పంట బకాయిలు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో ప్రయివేట్ అప్పులను రైతులు ఆశ్రయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనులో పంట వేయకపోతే దిగుబడిపై ప్రభావం కనిపించే పరిస్థితులు ఉన్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో చివరి దశలో గోదావరి వరదలు, అధిక వర్షాల కారణంగా వరి చేలల్లో నీరు నిలిచి రైతులు నష్టపోయారు. ఈ ఏడాది కూడా తిరిగి ఆనాటి పరిస్థితులే తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ రాధిక తెలిపారు.

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు, వెరవల్, గుజరాత్-362266.
కార్పొరేట్ ఆఫీసు: 10వ అంతస్తు, ఆర్ టెక్ పార్క్, నిర్లాన్ కాంప్లెక్స్, హబ్ మాల్ దగ్గర, గోరెగాం (ఈస్ట్) ముంబయి-400 063, మహారాష్ట్ర.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క రూల్ 3 తో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద.

చట్టం క్రింద **ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ (ఎబిఎఫ్ఎల్)** యొక్క **అధీకృత అధికారిగా** క్రింది సంతకందారు మరియు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి, రూల్ 3తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ రుణగ్రహీతలును సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి **60 రోజుల్లోగా** సదరు నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. క్రింది సంతకందారు భావ్యంగా భావించునది ఏమనగా, రుణగ్రహీతలు డిమాండ్ నోటీసులు స్వీకరించుటకు నిరాకరించుచున్నారు, కావున వారి ఇంటి గోడకు నోటీసు అతికించబడినది మరియు రూల్స్ ప్రకారం పత్రికా ప్రకటన ఇవ్వబడుచున్నది. డిమాండ్ నోటీసుల్లోని విషయాలు ఇందు దిగువ విధంగా ఉన్నవి:

పై దానికి సంబంధించి, ఇందుమూలంగా మరోసారి నోటీసు ఇవ్వడమేమనగా, సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులుచే **ఎబిఎఫ్ఎల్‌కు** నిర్వహించిన రుణ ఒప్పందాలు మరియు ఇతర పత్రాలు/వ్రాతలుతో చదువబడే, సదరు నోటీసులు తేది నుండి **60 రోజుల్లోగా** వారి పేర్లకు ఎదురుగా పేర్కొన్న ఇందు దిగువ గుర్తించిన మొత్తాలను మరియు దిగువ వివరించినట్లుగా, కాలం (డి)లో దిగువ పేర్కొన్న సదరు తేదీల నుండి చెల్లించు / మరియు/లేదా రియలైజేషన్ నాటికి దానిపై తదుపరి వడ్డీని చెల్లించవలసిందిగా కోరబడినది. రుణాలను తిరిగి చెల్లించుటలో హామీగా దిగువ సెక్యూర్డ్ అసెట్స్‌ను సదరు రుణగ్రహీత చేత **ఎబిఎఫ్ఎల్** కు తాకట్టుచేయబడినవి.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు& చిరునామా	డిమాండ్ నోటీసు తేది/ ఎన్‌పిఏ తేది	స్థిరాస్తి వివరణ
1	**1. మెసర్స్ మ్యాప్ యాడ్స్ ప్రింటింగ్ హోర్డింగ్స్, దీని యజమాని భాస్కర్ ప్రసాద్ మంగులూరి, 2. భాస్కర్ ప్రసాద్ ముంగులూరి, 3. శ్రీమతి కానపర్తి రాణి, భర్త భాస్కర్ ప్రసాద్ మంగులూరి,** **చిరునామా-1:** గ్రౌండ్ ఫ్లోర్, 23-15-112ఎఫ్, జి.ఎస్.రాజు రోడ్, సత్యనారాయణపురం రోడ్, విజయవాడ, కృష్ణా, ఆం.ప్ర.-520 011. **మొబైల్:** 949011 2929. **ఇమెయిల్:**mapaph234bm@gmail.com; , **చిరునామా-2:** 33-23-28, ఫ్లాట్ నం.5, 2వ అంతస్తు, కృష్ణా రావు వీధి, కుమరిభాయిపేట్, విజయవాడ (అర్బన్), కృష్ణా, ఆం.ప్ర.-520010. **మొబైల్:** 94403 22234; **చిరునామా-3:** 24-28-14ఎ, శ్రీశైలం వారి వీధి, రామాలయం దగ్గర, సుర్యాపురం, విజయవాడ, ఆం.ప్ర.-520003. **•LAN : ABVJWSTS000000513841**	18.06.2024 & 03.06.2024 / పూర్తి బకాయి మొత్తాలు: ₹ 25,73,690.52 as on 15.06.2024	జాయింట్ రిజిస్ట్రార్ మంగళగిరి పరిధిలో గుంటూరు జిల్లా, తాడెపల్లి మండలం, కొలనుకొండ పంచాయతి పరిధుల్లో కొలనుకొండ గ్రామం వద్ద ఆర్.ఎస్.నం.86 లోగల డోర్ నం.1-33/1 గల అన్ని ఈజిమెంట్ హక్కులతో 420చ.గ.లు లేదా 315-174చ.మీ.ల విస్తీర్ణం మరియు **సరిహద్దులు: తూర్పు:** గుర్రాల కోటయ్య & బల్ల నర్సయ్య ఆస్తి; **దక్షిణం:** అంబటి భూపతి రావు ఆస్తి; **పడమర:** కొంత విస్తీర్ణంలో బాట & పి.సిహెచ్. సాంబశివ రావుకు చెందిన ఆస్తి. **ఉత్తరం:** తాడెపల్లి పానకల్లు ఆస్తి.

పై పేర్కొన్న తేదీనాటి సదరు డిమాండ్ నోటీసుల్లో మరింత విపులంగా చూపినట్లు, తదుపరి వడ్డీ, అదనపు వడ్డీతో, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥నవి చెల్లించు తేది/ రియలైజేషన్ తేదీ వరకు వెచ్చించిన ఖర్చులుతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది, ఒకవేళ సదరు రుణగ్రహీత పై చెప్పినట్లు **ఎబిఎఫ్ఎల్**కు చెల్లించుటలో విఫలం చెందియునచో, **ఎబిఎఫ్ఎల్** సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు వర్తించు రూల్స్ ప్రకారం పూర్తిగా సదరు రుణగ్రహీతలు/ చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధులు పూర్తి బాధ్యతపైననే, పై సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తులపై చర్యలు తీసుకొందురు.

సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు **ఎబిఎఫ్ఎల్** యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా సదరు ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌లను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా బదిలీచేయలేరు. దయచేసి గమనించండి: ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) యొక్క సెక్షన్ 13(2) క్రింద ఇది తుది ప్రకటన గా భావించవలసిందిగా కోరబడుచున్నది. వారి బాధ్యత& ఖర్చులతో పూర్తిగా రుణగ్రహీతలపై పేర్కొన్న ఏవేని అధికారాలు లేదా హక్కులన్నింటినీ **ఎబిఎఫ్ఎల్** కలిగియున్నదని చెప్పాల్సిన అవసరంలేదు.

తేది: 27.06.2024
ప్రదేశం: విజయవాడ, ఆం.ప్ర.
సం/- అధీకృత అధికారి
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్.

2వ ర్యాంక్‌కు సూర్యకుమార్

- టాప్‌లో ట్రివిస్ హెడ్
- ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: టి20 బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ తొలిసారి తన అగ్రస్థానాన్ని కోల్పోయాడు. టి20 ప్రపంచకప్‌లో భారత్‌పై అర్ధశతకంతో మెరిసిన ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ తొలిసారి సూర్యకుమార్ యాదవ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకాడు. దీంతో దాదాపు ఏడు నెలల నుంచి ఐసిసి టి20 ర్యాంకుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను హెడ్ వెనక్కి నెట్టాడు. వీరిద్దరికి కేవలం 2 పాయింట్లు మాత్రమే వ్యత్యాసం ఉండటం గమనార్హం. ప్రస్తుతం ట్రావిస్ హెడ్ 844 పాయింట్లతో తొలి స్థానంలో ఉండగా.. సూర్యకుమార్ యాదవ్ 842 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. వీరిద్దరి తర్వాత ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్(816), బాబర్ అజామ్(755), రిజ్వాన్(746) టాప్-5లో చోటు దక్కించుకున్నారు. ఆసీస్‌పై 41బంతుల్లోనే 92పరుగులు కొట్టిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తన ర్యాంక్‌ను మెరుగుపర్చుకున్నాడు. రోహిత్(527) 13స్థానాలను ఎగబాకి 38వ ర్యాంకులో నిలిచాడు.

అక్షర్ పటేల్‌కు 8వ స్థానం

ఐసిసి టి20 బౌలర్ల జాబితాలో భారత్ తరపున అక్షర్ పటేల్ ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. ప్రస్తుతం అతడు 8వ స్థానంలో కొనసాగుతున్నాడు. టి20 ప్రపంచకప్‌లో ఆడిన మ్యాచుల్లో అద్భుత ప్రదర్శన చేసిన కుల్దీప్ యాదవ్(641) ఏకంగా 20 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరాడు. టి20 ప్రపంచకప్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్ (621) 17వ స్థానంలో నిలిచాడు. ఇక స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఏకంగా 44 స్థానాలను మెరుగుపర్చుకొని 589రేటింగ్ పాయింట్లతో 24వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
भारत सरकार का उद्यम
एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

జోనల్ ఆఫీసు, ఇ.నం.4-3-448 నుండి 460 & 465 నుండి 468, 1వ అంతస్తు, వినూత్న పిట్టీస్ మజెస్టీ, గోపాల్ బాగ్, బ్యాంక్ స్ట్రీట్ దగ్గర, కోఠి, హైదరాబాద్.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ యాక్ట్, 2002 (షార్ఫసీ యాక్ట్) క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత& హామీదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌డ్ పెట్టబడినవి, ఏదైతే **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర** (సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారిచేత నిర్మాణాత్మక స్వాధీనంచేసుకోబడినది, దానిని మొత్తాలు + దానిపై లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలతోసహా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రికవరీ చేయుట కొరకు, **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **16.07.2024**న విక్రయించబడుతుంది. రిజర్వు ధర మరియు ధరావత్తు డిపాజిట్ ఇందు క్రింద చూపబడినవి:

క్రసం.	రుణగ్రహీత& హామీదారు పేరు	బకాయి మొత్తాలు
1.	**1) మెసర్స్ నారా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **2) శ్రీ నారా శ్రీనివాస్,** డైరెక్టర్ మెసర్స్ నారా కన్‌స్ట్రక్షన్స్ **ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082 **మరియు: శ్రీ నారా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **3) శ్రీమతి నారా అనిత,** డైరెక్టర్ మెసర్స్ నారా కన్‌స్ట్రక్షన్స్ **ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **మరియు: శ్రీమతి నారా అనిత, భర్త శ్రీ నారా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **4) శ్రీ నారా శ్రీనివాస్,** హామీదారు, 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **5) శ్రీమతి నారా అనిత, భర్త శ్రీ నారా శ్రీనివాస్,** హామీదారు, 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **6) శ్రీ ఎం. శ్రీహరి,** హామీదారు, ఫ్లాట్ నం.204, పూజా రెసిడెన్సీ, బొల్లారం రోడ్, చైతన్య కాలేజి దగ్గర, శేరిలింగంపల్లి, మియాపూర్, హైదరాబాద్-500029. **7) శ్రీమతి పెద్ది విజయలక్ష్మి,** హామీదారు, **భర్త కీ॥శే॥ శ్రీ పెద్ది సత్య ప్రసాద్,** ఇ.నం.1-14, వీరంక లాకులు, గుర్రాల లంక, పామిడిముక్కల, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521250.	**రూ.6,45,93,181/- (రూపాయలు ఆరు కోట్ల నలభై ఐదు లక్షల తొంభై మూడు వేల ఒక వంద ఎనభై ఒకటి మాత్రమే)** ప్లస్ లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు.

స్థిరాస్తి వివరణ: 1) యజమాని **శ్రీ ఎన్. శ్రీనివాస్** యొక్క కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గుండిగుంట గ్రామం, ఎస్.జి.ఎస్. నగర్, గణపతి సచ్చిదానంద దాత టెంపుల్ వెనుక, డోర్ నం.6-62, ఆర్ఎస్ నం.946/4, ప్లాట్ నం.1, ఖాళీ ప్లాటు విస్తీర్ణం 402.2చ.గ.లు యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: ఉత్తరం:** 33అ.ల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.2, **తూర్పు:** 33అ.ల రోడ్డు మరియు **పడమర:** శ్రీ ఎం.విశ్వేశ్వర రావు ఆస్తి.

రిజర్వుధర: రూ.70,00,000/- **ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.7,00,000/-**

స్థిరాస్తి వివరణ: 2) యజమాని **శ్రీ ఎన్. శ్రీనివాస్** యొక్క కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గుండిగుంట గ్రామం, ఎస్.జి.ఎస్. నగర్, గణపతి సచ్చిదానంద దాత టెంపుల్ వెనుక, ఆర్ఎస్ నం.146/4, ఖాళీ ప్లాటు విస్తీర్ణం 277.60చ.గ.లు (రిజిస్టర్డు సేల్ డీడ్ నం.3403/2011) యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: ఉత్తరం:** ఎం. సంధారాణికు చెందిన ల్యాండ్, **దక్షిణం:** మహ్మద్ గాలిద్‌కు చెందిన ల్యాండ్, **తూర్పు:** నడుచుట కొరకు 5అ.ల ఉమ్మడి రోడ్డు మరియు **పడమర:** శ్రీ ఎం.విశ్వేశ్వర రావు ఆస్తి.

రిజర్వుధర: రూ.55,00,000/- **ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.5,50,000/-**

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్: **http://www.bankofMaharashtra.in**.లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 25.06.2024, ప్రదేశం: హైదరాబాద్ — **సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**

జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. దోడా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దోడా జిల్లాలోని ఒక అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కొనిఉన్నారనే సమాచారంతో భద్రతా సిబ్బంది ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఈ ఉగ్రవాదులే ఇటీవల భారత సైన్యంపై కాల్పులు జరిపి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు ఇటీవల వరుస దాడులకు పాల్పడుతున్నారు. దీంతో దోడా, రాజౌరీ, పూంచ్ ప్రాంతాల్లో తనిఖీలు, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 11న భద్రతా దళాలపైఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులతో పాటు ఓ పోలీసు అధికారి తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఘటనలో పోలీస్ క్యాంపుపైనా దాడులు చేశారు. మరోవైపు భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలోనూ భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అక్కడా హైఅలర్ట్ ప్రకటించారు.

ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటీషన్ తిరస్కరణ

బెంగళూరు : పలువురు మహిళలపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మరో ఎదురుదెబ్బ తగిలింది. బెంగుళూరులోని కోర్టు బుధవారం అతడి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు అయిన ప్రజ్వల్ రేవణ్ణ.. ఇటీవల ఎన్‌డిఎ కూటమి తరపున హాసన నుంచి ఎంపీగా బరిలోకి దిగారు. అయితే రేవణ్ణకు చెందిన వీడియోలు వెలుగు చూడ్డంతో ఆయన గత ఏప్రిల్‌లో దేశం విడిచి పరారయ్యారు. అనంతరం దేశానికి వచ్చిన ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కస్టడీలో ఉన్నాడు. మరోవైపు తాజాగా ఒక యువకుడిపై (25) లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలపై ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సూరజ్ రేవణ్ణను పోలీసులు అరెస్టు చేశారు.

'పతంజలి'కి మరో షాక్

- ట్రేడ్ మార్క్ ఉల్లంఘనపై క్షమాపణలు చెప్పండి
- ఆ సంస్థ డైరెక్టర్‌కు బాంబే హైకోర్టు సమన్లు

న్యూఢిల్లీ : తప్పుదోవ పట్టించే ప్రకటనలపై సుప్రీంకోర్టు ఇప్పటికే పతంజలి ఆయుర్వేదను తీవ్రంగా హెచ్చరించింది. అయితే, ఆ విషయం నుంచి తేరుకోకముందే పతంజలి సంస్థకు మరో షాక్ ఎదురైంది. దాని కర్పూరం ఉత్పత్తికి సంబంధించిన ఆరోపిత ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనకు "బేషరతుగా క్షమాపణ"ను బాంబే హైకోర్టు కోరింది. ఈ మేరకు పతంజలి ఆయుర్వేద కంపెనీకి సమన్లు పంపింది. మంగళం ఆర్గానిక్స్ దాఖలు చేసిన కాపీరైట్ ఉల్లంఘన, ధిక్కార పిటిషన్‌లో కోర్టు ఉత్తర్వు వచ్చింది. రామ్‌దేవ్ యాజమాన్యంలోని రిటైల్ కంపెనీ తమ కర్పూర ఉత్పత్తిని 'అనుకరిస్తూ' ఆగస్టు 2023 మధ్యంతర కోర్టు ఆదేశం ఉన్నప్పటికీ, దాని తయారీని నిలుపుదల చేసినప్పటికి విక్రయం కొనసాగించిందని ఆరోపించింది. పతంజలి అనుకరించిన ఉత్పత్తి ఆన్‌లైన్‌లో, ముంబయిలోని విరార్‌లోని పతంజలి మెగా స్టోర్‌లో విక్రయించబడుతుందని, ఇది వినియోగదారుల గందరగోళానికి దారితీసిందని మంగళం ఆర్గానిక్స్ తెలిపింది. పతంజలి ఆయుర్వేద డైరెక్టర్ రజనీష్ మిశ్రా కోర్టుకు హాజరై వారంలోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని జస్టిస్ ఆర్ఐ చాగ్లా ఆదేశించారు. ఈ కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం జులై 8కి వాయిదా వేసింది.

నాటో కొత్త చీఫ్‌గా డచ్ ప్రధాని రూటే

బ్రసెల్స్: నాటో మిత్ర దేశాలు నెదర్లాండ్స్‌కు చెందిన డచ్ ప్రధాని మార్క్ రూటేనె తదుపరి సెక్రటరీ జనరల్‌గా ఎంపిక చేశాయి. జెన్స్ స్టాల్టెన్‌బర్గ్ వారసునిగా రూటేను నియమించాలని నార్త్ అట్లాంటిక్ కౌన్సిల్ నిర్ణయించిందని ఆ కూటమి బుధవారం నాడిక్కడ విడుదలజేసిన ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబరు1న రూటే ఈ కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. నాటో చీఫ్ పదవికి ఆయన ఏకైక ప్రత్యర్థి అయిన రుమేనియా అధ్యక్షుడు క్లాస్ ఐహానిస్ అవసరమైన మద్దతు కూడగట్టడంలో విఫలమైనందున రేసు నుంచి తప్పుకుంటున్నట్లు గత వారం ప్రకటించారు. దీంతో రూటే నియామకం లాంఛన ప్రాయంగా మారింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై విమర్శలు గుప్పించడం ద్వారా అమెరికాకు అత్యంత ప్రీతిపాత్రుడిగా మారాడు. నాటో కూటమి రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 1949లో అమెరికా చొరవతో ఏర్పడింది. సోవియట్ యూనియన్‌ను సైనికంగా దెబ్బ తీయడమే లక్ష్యంగా ఈ కూటమి పనిచేసింది. సోవియట్ యూనియన్ కూలిపోయిన తరువాత ఉక్రెయిన్‌ను వేదికగా చేసుకుని ఇప్పుడు రష్యాను దెబ్బ తీయాలని చూస్తోంది. అదే నేటి ఉక్రెయిన్ యుద్ధం.

'కేంద్రీకృత' పరీక్షలు సరికావు

- 'వన్ నేషన్-వన్ ఎగ్జామ్' విఫల ప్రయోగం
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- 'నీట్'తో అంతా బహిర్గతం
- మోడీ పాలనపై మేధావులు, నిపుణుల ఆగ్రహం

న్యూఢిల్లీ : దేశంలో వైద్య కోర్సుల ప్రవేశ పరీక్ష (నీట్) ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. పేపర్ లీక్‌లు, పరీక్ష వాయిదాలతో యూజీ, పీజీలలో అడ్మిషన్లు కోరే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అలాగే, 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్'గా తీసుకొచ్చిన ఈ నీట్ ఒక విఫల ప్రయోగమని మేధావులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) చీఫ్‌ను తొలగించటం, కమిటీని ఏర్పాటు చేయటం వంటివి కొంత వరకు జరిగినా విలువైన విద్యార్థుల సమయాన్ని మోడీ ప్రభుత్వం వృథా చేసిందని మేధావులు అంటున్నారు. 'నీట్' విషయంలో మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనబడుతన్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే, మోడీ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా కార్పొరేట్ మీడియా తన వంతు కృషి చేస్తున్నదని పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయం నుంచి విద్య వరకు.. కేంద్రీకృతం చేయటానికి మోడీ సర్కారు భావిస్తున్నదనీ, భారత్ వంటి అతిపెద్ద విశాల దేశంలో ఈ విధానం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని నిపుణులు చెప్తున్నారు. నీట్-యూజీ, జేఇఇ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి వాటితో సహా 15 ప్రధాన పరీక్షలు దేశంలో నిర్వహించబడుతున్నాయి. ఆచరణాత్మకంగా దేశవ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించటానికి సంబంధించిన పనులన్నీ అవుట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించబడతాయి. వారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్లు తమ సిబ్బందితో పరీక్షలను నిర్వహించటం, ఐటీ సిస్టమ్‌లు, క్యూఆర్ కోడ్-సంబంధిత పని వంటి అన్ని సాంకేతిక పనులు ఔట్‌సోర్సింగ్ ద్వారానే జరుగుతుంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షలైన వీటికి ఔట్‌సోర్సింగ్ సహాయం తీసుకుంటే లీక్‌కు దారులు తెరిచినట్టేనని మేధావులు అంటున్నారు.

ఈ పరీక్షల బాధ్యతను ఎన్‌టిఎ చేపట్టక ముందు సీబీఎస్‌ఈ, ఏఐసీటీఈ వంటి ప్రభుత్వ సంస్థలు ఈ పరీక్షలను నిర్వహించేవి. స్టేట్ సెలక్షన్ బోర్డ్‌ల వంటి వివిధ రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలో, అలాగే రైల్వేలు, బ్యాంకుల వంటి రంగాల కోసం రిక్రూట్‌మెంట్‌లో కూడా ఔట్‌సోర్సింగ్ జరిగిందని విశ్లేషకులు చెప్తున్నారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఇప్పుడు కనిపిస్తున్న లోపాలు రాష్ట్రాలలో పదేపదే బయటపడ్డాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రచురించబడిన ఒక ఆంగ్ల వార్త సంస్థ సమాచారం ప్రకారం.. గత ఐదేండ్లలో 15 రాష్ట్రాల్లో కనీసం 48 పేపర్ లీక్ కేసులు కనుగొనబడ్డాయి. ఈ లీక్‌లు సుమారు 1.2 లక్షల పోస్టులకు కనీసం 1.4 కోట్ల మంది దరఖాస్తుదారుల జీవితాలను ప్రభావితం చేశాయి.

కేంద్రీకృత పరీక్షలు ఎందుకు?

మోడీ పాలనలో గత కొన్నేండ్లుగా 'కేంద్రీకృత' వ్యవస్థ అంశం ఎక్కువగా వినబడుతున్నది. పరీక్షల నిర్వహణకు కేంద్ర పరీక్షా ఏజెన్సీని కలిగి ఉండాలనే ఆలోచన కూడా మొదట 1990ల ప్రారంభంలో సూచించబడిందన్నది విశ్లేషకులు చెప్తున్నారు. కానీ, మోడీ ప్రభుత్వం జాతీయవాద శక్తిపై "ఒకే దేశం, ఒకటే ప్రతిదీ" అనే భావజాలాన్ని వ్యాపింప చేయాలనీ, దానిని ప్రజలపై బలంగా రుద్దాలని చూస్తున్నదని అంటున్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్, వన్ రేషన్ కార్డు, హెల్త్ కార్డు వంటివి ఇందులో భాగమని వారు చెప్తున్నారు. అన్ని ప్రాంతీయ ఆకాంక్షలు, వైవిధ్యాలకు భిన్నంగా ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థలు దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కావని మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ వంటివి విఫల ప్రయోగాలనీ, వీటితో మోడీ సర్కారు విద్యార్థులు, నిరుద్యోగులు, దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నదని వారు ఆరోపిస్తున్నారు.

ఇది ట్రైలరే...

- ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు
- మోడీ ప్రభుత్వానికి ప్రతిపక్షం వార్నింగ్

న్యూఢిల్లీ : తగినంత సంఖ్యాబలం లేదని తెలిసినా పద్దెనిమిదో లోక్‌సభ స్పీకర్ పదవికి తమ అభ్యర్థిగా కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కె.సురేష్‌ను పెట్టడం ద్వారా ఇండియా బ్లాక్ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఒక స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టైంది. గెలపోటములు కాదు ఇక్కడ ప్రధాన అంశం 2014-24లో సాగినట్లుగా 2024-29 ఉండబోదన్న సంకేతాన్ని పంపడంలో తాము విజయం సాధించామని ఇండియా బ్లాక్ వర్గాలు తెలిపాయ. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదని, ప్రతి దశలోనూ ప్రతిపక్షాల నుండి రాజ్యాంగ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న అభిప్రాయాన్ని కలిగించగలిగింది.

దళితుడైనందునే కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సురేష్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించకుండా బిజెపి పక్కన పెట్టిందని, దీనికి సమాధానంగా స్పీకర్ పదవికి ఆయనను బరిలోకి దింపాల్సి వచ్చింది. స్పీకర్ ఎన్నిక విషయంలో ఇండియా కూటమి ప్రజలకు మరో సందేశాన్ని కూడా పంపేందుకు ప్రయత్నించింది. అది రాజ్యాంగ సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన సందేశం. అధికార పక్షానికి చెందిన వారిని స్పీకర్‌గా, ప్రతిపక్ష సభ్యుడిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకోవడం సంప్రదా యంగా వస్తోంది. అయితే అందుకు అంగీకరించేందుకు అధికారపక్షం ససేమిరా అనడంతో స్పీకర్ పదవికి పోటీ పడటం ద్వారా సభా సాంప్రదాయాలను ఉల్లంఘిస్తున్న అధికార పక్ష తీరును ఎండగట్టింది.

గత లోక్‌సభలో ప్రభుత్వం ఎవరినీ ఉప సభాపతిగా నియమించలేదు. సంవత్సరాల తరబడి కొనసాగుతున్న సంప్రదాయాలను పాలక పక్షం ఉల్లంఘిస్తోందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. 'ఏకాభిప్రాయం గురించి ప్రధాని మాట్లాడుతుంటారు. కానీ మమ్మల్ని స్పీకర్ పదవికి పోటీ చేసేలా చేశారు. సంప్రదాయాలను తుంగలో తొక్కారు. 17వ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకుండా చేశారు. ఇప్పుడేమో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా స్పీకర్ పదవికి పోటీ అనివార్యం చేశారు' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ట్వీట్ చేశారు.

స్పీకర్ ఎన్నిక విషయంలో రాహుల్ గాంధీ తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. స్పీకర్ ఎన్నికపై ఆయన తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతో 20 నిమిషాల పాటు ఫోన్‌లో సంప్రదించారు. సురేష్‌ను అభ్యర్థిగా నిలిపేముందు ఇండియా బ్లాక్ తనను సంప్రదించ లేదని మమత కినుక వహించారు. ఆమెను శాంతపరిచేందుకు రాహుల్ చేసిన ప్రయత్నం ఫలించింది.

పూణేలో జికా వైరస్ కలకలం

పుణే : మహారాష్ట్రలో జికా వైరస్ కలకలం రేపింది. రాష్ట్రంలోని పుణెకు చెందిన ఓ వైద్యుడు, ఆయన కుమార్తెకు ఇన్‌ఫెక్షన్ సోకినట్లు నిర్ధరణ అయ్యింది. అయితే, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఒకే ఇంట్లో రెండు కేసులు నమోదుకావడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు.. ఆ ప్రాంతంలో వైరస్ వ్యాప్తి నివారణ చేపట్టారు.

పూణేలోని ఈ వైద్యుడు ఇటీవల జ్వరం బారిన పడ్డాడు. శరీరంపై దద్దుర్లు రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. రక్త నమూనాలు సేకరించి విశ్లేషణ కోసం ఆ నగరంలోనే ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. ఈ నెల 21న వారికి జికా ఇన్‌ఫెక్షన్ నిర్ధరణ అయినట్లు స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దాంట్లో ఆయన కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు తేలింది. జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఆస్ట్రేలియా చేరుకున్న అసాంజె

- గూఢచర్య చట్టాన్ని ఉల్లంఘించడం నేరమేనని అంగీకారం

ఆస్ట్రేలియా బయలుదేరే ముందు సైపన్‌లో కోర్టు వద్ద అసాంజె

మెల్‌బోర్న్ : వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె బుధవారం తన మాతృదేశమైన ఆస్ట్రేలియా చేరుకున్నారు. అమెరికా గూఛర్య చట్టాన్ని ఉల్లంఘించడం నేరమేనని అంగీకరించడంతో అమెరికా ప్రభుత్వం ఈ కేసు మూసివేసింది. అమెరికా భూభాగమైన సైపన్‌లో మూడు గంటల పాటు అసాంజెను విచారించారు. జాతీయ రక్షణ పత్రాలను సంపాదించి, వాటిని బహిర్గతం చేయడమే నేరమేనని అయితే అమెరికా రాజ్యాంగంలోని మొదటి సవరణను తాను విశ్వసిస్తానని ఆయన చెప్పారు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఈ సవరణ పరిరక్షిస్తోంది. జర్నలిస్టుగా తనకు సమాచారం అందించే వర్గాలు, వనరులను తానెప్పుడూ ప్రోత్సహిస్తానని ఈ కార్యకలాపాలను మొదటి సవరణ పరిరక్షిస్తోందని భావిస్తున్నట్లు అసాంజె చెప్పారు. అయితే గూఢచర్య చట్టాన్ని ఉల్లంఘించడం నేరమేనని అంగీకరించారు. అసాంజె చర్యల వల్ల వ్యక్తిగత బాధితులెవరూ లేరని అమెరికా ప్రభుత్వం కూడా స్పష్టం చేసిందని చీఫ్ యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి రామోనా వి.మంగ్లోనా పేర్కొన్నారు.

అంతర్జాతీయ జర్నలిజానికి లభించిన విజయమిది
అంతర్జాతీయ జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు డొమినిక్

వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె విడుదలైన నేపథ్యంలో ఇది సమాచార హక్కుకు లభించిన విజయమని అంతర్జాతీయ జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు డొమినిక్ ప్రదలీ వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వున్న జర్నలిస్టు మిత్రులకు లభించిన విజయమిదని అన్నారు.

రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్ డైరెక్టర్ రెబెకా విన్సెంట్ స్పందిస్తూ, జర్నలిజానికి, పత్రికా స్వేచ్ఛకు సుదీర్ఘకాలం తర్వాత వచ్చిన విజయమని అన్నారు. దేశ భద్రతా వ్యవహారాలపై రిపోర్టింగ్‌తో లక్ష్యంగా మారిన జర్నలిస్టులందరికీ మద్దతుగా తాము ప్రచారాన్ని సాగించనున్నట్లు తెలిపారు.

మరోసారి జర్నలిస్టులెవరినీ ఇలా లక్ష్యంగా చేసుకోకుండా వుండేందుకు అమెరికా గూఢచర్య చట్టాన్ని సంస్కరించాలని తాము ప్రచారం చేపడతామన్నారు. అసాంజె కేసు ప్రజల దృష్టిలో పడేలా, న్యాయం జరిగేందుకు పోరు సాగిస్తూ అవిశ్రాంతంగా కృషి చేసిన వారి వల్లే ఈ పోరాటం విజయవంతమైందని స్టాప్ ది వార్ జాతీయ అధికారి జాన్ రీస్ వ్యాఖ్యానించారు. ఆ పోరాటాలే ఈ స్థాయిలో లేకపోతే అసాంజె అమెరికాలోని జైల్లోనే ఎవరికీ తెలియకుండా సమాధి అయిపోయేవాడని అన్నారు. ఎన్నికల వేళ బైడెన్ లేదా ట్రంప్‌లు ఈ విషయంలో రభస చేయకూడదని భావించాయని అన్నారు.

కింది స్థాయిలోని నిర్వాహకులు, పత్రికా స్వేచ్ఛ కోసం పోరు సల్పేవారు, చట్టసభల సభ్యులు, నేతలు ఇలా ప్రతి ఒక్కరూ ప్రపంచవ్యాప్తంగా సాగించిన పోరాటాలు, ప్రచారాల వల్లనే ఈ విజయం సాధ్యమైందని వికీలీక్స్ ఎక్స్‌లో పేర్కొంది. ఆసాంజె ఆస్ట్రేలియాకు చేరుకున్న నేపథ్యంలో తము అండగా నిలబడిన, తమకోసం పోరాడిన వారందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు ఆ పోస్టు పేర్కొంది. అసాంజె స్వేచ్ఛ అంటే మన స్వేచ్ఛే అని వ్యాఖ్యానించింది.

కెన్యాలో ఆరని నిరసన జ్వాల

- 23కి పెరిగిన మృతులు

నైరోబి : కెన్యాలో పన్నుల పెంపు బిల్లును నిరసిస్తూ నిరసనలు తెలియచేస్తున్న వారిపై పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య 23కి చేరింది. తమ ఆందోళనలను అణచివేయడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా తాము వెనక్కి తగ్గేది లేదని, తమ నిరసనలు కొనసాగిస్తామని బుధవారం ఆందోళనకారులు ప్రతిన బూనారు దేశ వ్యాప్తంగా జరిగిన ఘర్షణలు, కాల్పుల్లో పలువురు గాయపడ్డారు. ఇంత పెద్దయెత్తున నిరసనలకు దారి తీసిన ఈ వివాదాస్పద ఆర్థిక బిల్లుపై సంతకం చేయడానికి అధ్యక్షుడు విలియం రూటో బుధవారం తిరస్కరించారు. బిల్లులో సవరణలు చేయాల్సిందిగా తిరిగి పార్లమెంట్‌కు పంపారని కెన్యా స్టార్ వార్తాపత్రిక పేర్కొంది. బిల్లులో ఆయన కొన్ని సవరణలను ప్రతిపాదించారని, వాటిని పార్లమెంట్ పరిశీలించాల్సి వుందని తెలుస్తోంది. కాగా, నిరసనలను అణచివేయడానికి పోలీసులకు సహకరించేందుకు సైన్యాన్ని కూడా రంగంలోకి దించినట్లు రక్షణ మంత్రి అడెన్ డూలే తెలిపారు. దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నందున అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిందిగా భారతీయులకు కెన్యాలోని భారత హై కమిషన్ సూచనలు జారీ చేసింది. అనవసరంగా బయటి ప్రయాణాలు చేయరాదని, ఆందోళనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్ళవద్దని సూచించింది. కెన్యా ఆర్థిక వ్యవస్థను రుణ సంక్షోభం నుండి బయటపడవేసేందుకు 210కోట్ల పౌండ్లను సమీకరించడం ఈ వివాదాస్పద బిల్లు లక్ష్యంగా వుంది. బ్రెడ్, వంట నూనెలు, ఇతర సరుకులపై కొత్తగా విధించిన పన్నులను రద్దు చేసేందుకు సవరణలు చేశారు. కానీ మొత్తంగా బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అసలు బ్రెడ్‌పై 16శాతం పన్ను ఎలా విధిస్తారు, శానిటరీ ప్యాడ్‌లపై మీరెలా పన్ను వేస్తారో అర్థం కావడం లేదని 24ఏళ్ళ ఆందోళనకారుడు డెరిక్ మావతు ప్రశ్నించారు. పేద ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తానని వాగ్దానం చేసి దాదాపు రెండేళ్ళ క్రితం అధ్యక్షుడు రూటో ఎన్నికల్లో గెలుపొందారు. అయితే, మరిన్ని నిధులు విడుదల చేయాలంటే ముందుగా ఆర్థిక లోటును తగ్గించాలంటూ ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ రుణదాతలు ఒత్తిడి తీసుకువస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆందోళనలు తలెత్తాయి. కాగా, అధ్యక్షుడు రూటో తక్షణమే రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఆయన లేకపోతేనే అన్నీ సవ్యంగా సాగుతాయని అన్నారు.

గాజాలో మూడు వేర్వేరు దాడుల్లో 24మంది పాలస్తీనియన్ల మృతి

గాజా : గాజాపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన మూడు వేర్వేరు దాడుల్లో 24మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియె సోదరి కూడా వున్నారని గాజా ఆస్పత్రి అధికారులు తెలిపారు. రఫా పశ్చిమ దిశగా ముందుకు దూసుకెళ్ళిన ఇజ్రాయిల్ ట్యాంక్‌లు ఇళ్ళను పేల్చివేస్తూ విధ్వంసం సృష్టించాయని స్థానికులు తెలిపారు. గాజాలో రెండు స్కూళ్ళపై జరిగిన రెండు దాడుల్లో 14మంది మరణించారు. షాటి శరణార్థ శిబిరంలోని ఒక ఇంటిపై జరిగిన మరో దాడిలో 10మంది మరణించారు. ఈ ఇంట్లో హనియె బంధుమిత్రులు నివసిస్తున్నారు. వారిలో ఆయన సోదరి, ఇతర బంధువులు చనిపోయారని ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఈ దాడిలో హనియె తన ముగ్గురు కుమారులను కూడా పోగొట్టుకున్నారు. ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే ఆ ఇంటిపై దాడి జరిగిందని పొరుగునున్నవారు చెప్పారు. దాడితో బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిపోవడం వీడియోలో కనిపిస్తోంది. ఎలాంటి హెచ్చరిక లేకుండా దాడి చేయడంతో ఆ చుట్టుపక్కలే చాలామంది వున్నారని, వారిలో చాలామంది గాయపడ్డారని, మూడు మృతదేహాలు పేలుడు ధాటికి ఇంటి బయటకు ఎగిరిపడ్డాయని, మరో ఏడు మృతదేహాలు శిథిలాల కింద వుండిపోయాయని చెప్పారు. కాగా ఆ స్కూళ్ళలో, ఇంట్లో తీవ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు రచిస్తున్నారని అందుకే తాము దాడి చేశామని మిలటరీ చెప్పింది. దాన్ని హమాస్ ఖండించింది. స్కూళ్ళు, ఆస్పత్రులను మిలటరీ కార్యకలాపాలకు వాడబోమని స్పష్టం చేసింది.

ఐక్యరాజ్య సమితి వేదికపై కాశ్మీర్ గురించి తప్పుడు కథనాలు !

- పాక్ తీరుపై భారత్ ఆగ్రహం

ఐక్యరాజ్యసమితి : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) వేదికపై కాశ్మీర్ ప్రస్తావనలు తీసుకువచ్చినందుకు పాకిస్తాన్‌పై భారత్ మండిపడింది. పాక్ రాయబారి జనరల్ అసెంబ్లీలో నిరాధారమైన, మోసపూరితమైన కథనాలు చెబుతున్నారని భారత్ ప్రతినిధి ప్రతీక్ మాథుర్ విమర్శించారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, ఒక ప్రతినిధి వర్గం ఈ వేదికను దుర్వినియోగం చేసిందని, ఎలాంటి ఆధారాలు లేని, తప్పుడు కథనాలను ప్రచారం చేయడానికి ప్రయత్నించిందని విమర్శించారు. ఆ ప్రతినిధి బృందానికి ఇదేమీ కొత్త కాదన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిస్పందించాలని తాను కోరుకోవడం లేదన్నారు. ఈ వేదిక విలువైన సమయాన్ని కాపాడేందుకే తాను మాట్లాడడం లేదన్నారు. భద్రతా మండలి వార్షిక నివేదికపై జనరల్ అసెంబ్లీ చర్చ సందర్భంగా మాథుర్ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చ జరుగుతున్నపుడు పాకిస్తాన్ రాయబారి మునీర్ అక్రమ్ జనరల్ అసెంబ్లీ పోడియం నుండి మాట్లాడుతూ కాశ్మీర్ గురించి ప్రస్తావనలు చేశారు. ఆ నేపథ్యంలో మాథుర్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఐక్యరాజ్య సమితికి సంబంధించి వివిధ వేదికలపై జమ్మూ కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తడం, వాటిపై వ్యాఖ్యలు చేయడం పాకిస్తాన్‌కు ఒక అలవాటుగా మారింది. ఆ వేదికలపై చర్చించే అంశం ఏదైనా సరే దానితో సంబంధం లేకుండా కాశ్మీర్ గురించి మాట్లాడుతూ వుంటుంది. అయితే ఎన్నడూ పాక్‌కు ఎలాంటి మద్దతు లభించలేదు. జమ్మూ కాశ్మీర్,లడఖ్ ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లోనే అంతర్భాగాలుగా వుంటాయని భారత్ స్పష్టం చేస్తూ వస్తోంది.

13ఏళ్ళ బాలికపై సామూహిక అత్యాచారం, హత్య

- నిందితుడు బిజెపి కార్యకర్త

హరిద్వార్ : మూడు రోజుల కిందట అదృశ్యమై, హత్య చేయబడిన 13ఏళ్ళ బాలిక హత్య కేసులో ప్రధాన నిందితుడు బిజెపి కార్యకర్త అని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హరిద్వార్ పోలీసులు తెలిపారు.

పతంజలి రీసెర్చ్ సెంటర్‌కు సమీపంలో హైవేపై బాలిక మృతదేహాన్ని మంగళవారం ఉదయం కనుగొన్నారు. అయితే తన కుమార్తెపై స్థానిక బిజెపి కార్యకర్త, అతని మిత్రులు సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేశారని బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్ల పోలీసులు బుధవారం తెలిపారు. కాగా ఈ సంఘటనలో ప్రధాన నిందితుడు ఆదిత్యరాజ్ సైని స్థానిక బిజెపి ఒబిసి మోర్చా సభ్యుడు. ఈ విషయం తెలిసిన వెంటనే పార్టీ ఆ వ్యక్తి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య కొఠారి తెలియచేశారు.

గ్రామ సర్పంచ్ భర్త అయిన ఆదిత్యరాజ్ తన కుమార్తెతో సంబంధం పెట్టుకున్నాడని, అకస్మాత్తుగా ఆదివారం ఉదయం నుండి ఆమె కనిపించలేదని, ఫోన్ చేస్తే ఆదిత్యరాజ్ తీసి తనతో వుందని చెప్పాడని, తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారని బాధితురాలి తల్లి తన ఫిర్యాదులో పేర్కొంది. మరునాడు ఉదయం వరకు తన కుమార్తె రాకపోవడంతో ఆదిత్యరాజ్ ఇంటికి వెళ్ళగా అక్కడ అతడి స్నేహితుడు అమిత్ సైని కూడా వున్నాడని, కానీ తన కుమార్తె కనిపించలేదని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపుతానని తనను కూడా బెదిరించారని ఆమె తెలిపారు. అయినా ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లి ఫిర్యాదు ఆధారంగా వారిద్దరిని అరెస్టు చేసి ఐపిసి, పోక్సో చట్టాల కింద అభియోగాలు మోపినట్లు ఎస్‌పి పరమేంద్ర దోహాల్ తెలిపారు. దీనిపై దర్యాప్తుకు ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రెండు సార్లు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించిన వారి జాబితా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా బుధవారం ఎన్నికయ్యారు. దీంతో ఆయన వరుసగా రెండో సారి ఆ పదవిని అధిష్టించారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వరుసగా రెండు సార్లు లోక్‌సభ స్పీకర్ చేసిన వ్యక్తులు నలుగురు ఉన్నారు. అందులో ఇద్దరు తెలుగువారు ఉండటం విశేషం. మొదటి సారిగా ఎం.ఎ అయ్యంగార్ (చిత్తూరు) (1956-57, 1957-62) వరుసగా రెండు సార్లు లోక్‌సభ స్పీకర్‌గా పని చేశారు. ఆ తరువాత బలరామ్ జాఖర్ 1980-85, 1985-89ల్లోనూ, తరువాత జిఎంసి బాలయోగి (అమలాపురం) 1998-99, 1999-2002 లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండు సార్లు పని చేశారు. వీరిలో ఎం.ఎ అయ్యంగారు, జిఎంసి బాలయోగి తెలుగువారు. అయితే వరుసగా చేయకపోయిన మూడో తెలుగు వ్యక్తి నీలం సంజీవ్ రెడ్డి (1967-69, 1977-77) రెండు సార్లు లోక్‌సభ స్పీకర్ అయ్యారు.

ప్రతిపక్షాలను గౌరవించండి : అఖిలేష్ యాదవ్

ప్రతిపక్షాలను గౌరవించాలని స్పీకర్ ఓం బిర్లాను ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ కోరారు. ఓం బిర్లాకు అభినందలు తెలుపుతూ లోక్‌సభలో వివిధ పార్టీల సభ్యులు మాట్లాడురు. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నోసార్లు ఎంపీలు సస్పెన్షన్‌లకు గురయ్యారని, బహిష్కరణలు కూడా జరిగాయని అన్నారు. ఈ సారి సభలో బహిష్కరణ వంటి చర్యలు జరగవని తామంతా ఆశిస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాలపై స్పీకర్‌గా ఓం బిర్లాకు నియంత్రణ ఉందని, అదే మాదిరిగా అధికార పక్షం విషయంలోనూ వ్యవహరించాలని అఖిలేష్ యాదవ్ కోరారు.

ఔషధాలతో జాగ్రత్త

- అత్యున్నతస్థాయి నాణ్యత పరీక్షలో పలు ఔషధ నమూనాలు విఫలం
- ఇందులో పారాసెటమాల్‌తో సహా 50 డ్రగ్స్
- ప్రామాణిక నాణ్యత లేనివిగా గుర్తించిన సిడిఎస్‌సిఒ

న్యూఢిల్లీ: భారత్‌లోని అగ్రశ్రేణి ఔషధ నియంత్రణ సంస్థ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సిడిఎస్‌సిఒ) బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ల చికిత్స కోసం విస్తృతంగా ఉపయోగించే పారాసెటమాల్, పాంటోప్రజోల్, కొన్ని యాంటీబయాటిక్స్‌తో సహా దాదాపు 50 ఔషధాల నమూనాలను 'ప్రామాణిక నాణ్యత లేనివి' అని కనుగొన్నది. వీటితో పాటు అనేక ఔషధ నమూనాలు అత్యున్నతస్థాయి నాణ్యత పరీక్షలో విఫలమయ్యాయి. రాష్ట్ర డ్రగ్ రెగ్యులేటర్లు ప్రమేయం ఉన్న ఫార్మాస్యూటికల్ కంపెనీలకు నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తున్నది. మే నెలలో అపెక్స్ డ్రగ్ రెగ్యులేటరీ బాడీ నుంచి వచ్చిన హెచ్చరిక ప్రకారం.. హిమాచల్ ప్రదేశ్‌లో ఇరవై రెండు సబ్-స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేయబడ్డాయి. జైపూర్, హైదరాబాద్, వాఘోడియా, గుజరాత్‌లోని వడోదర, ఏపీ, ఇండోర్‌ల నుంచి కూడా నమూనాలను సేకరించారు. జూన్ 20న జారీ చేసిన డ్రగ్ అలర్ట్ ప్రకారం మొత్తం 52 నమూనాలు సీడీఎస్‌సీఓ నిర్వహించిన నాణ్యత పరీక్షలో విఫలమయ్యాయి. కాగా, లోపభూయిష్ట నమూనాలను మార్కెట్ నుంచి వెనక్కి రప్పించటానికి రాష్ట్ర డ్రగ్ నియంత్రణ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో తయారైన దాదాపు 120 ఔషధాల నమూనాలు గతేడాది పరీక్షలలో విఫలమయ్యాయి.

బీచ్ రిసార్ట్ టౌన్‌ను స్వాధీనం చేసుకున్న మయన్మార్ సాయుధ గ్రూపులు

- జుంటా స్థావరాలపై దాడులు

యాంగాన్ : మయన్మార్‌కు పశ్చిమాన గల బీచ్ రిసార్ట్ పట్టణాన్ని సాయుధ గ్రూపులు స్వాధీనం చేసుకుని, ఉత్తర ప్రాంతంలోని జుంటా స్థావరాలపై తెల్లవారు జామునే దాడులు ఆరంభించాయని మిలటరీ వర్గాలు తెలిపాయి. గిరిజన సాయుధ గ్రూపులు, ప్రజాస్వామ్య అనుకూల వర్గాలైన పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్ కలిసి సైన్యంపై పోరాటాన్ని సాగిస్తున్నాయి. 2021లో కుట్ర ద్వారా సైన్యం అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమ రఖినె రాష్ట్రంలో ఆర్కాన్ ఆర్మీ (ఎఎ) ఫైటర్లు ఎన్‌గపాలి బీచ్ వద్ద భద్రతా బలగాలతో రోజుల తరబడి పోరు సల్పుతున్నాయి. ఈ బీచ్ రిసార్టులో మిలిటరీ మద్దతు కలిగిన వ్యాపారాలు, వాణిజ్య కేంద్రాలు, హోటళ్ళు వున్నాయి. ఈ దాడులతో దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న తాండ్వె పట్టణానికి జుంటా బలగాలు, పోలీసులు పలాయనం చిత్తగించాయి. అక్కడకు వందల కిలోమీటర్ల దూరంలో ఉత్తర షాన్ రాష్ట్రంలోని కయూక్మె పట్టణంలో మిలటరీపై తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (టిఎన్‌ఎల్‌ఎ) దాడులు ఆరంభించిందని స్థానికులు తెలిపారు. ఉదయం నుండి తుపాకులు, శతఘ్నుల కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని, ప్రజలు చాలామంది ఇళ్ళల్లో దాక్కుని వుండిపోయారని తెలిపారు. పట్టణంలో తిరగకుండా టిఎన్‌ఎల్‌ఎ ఆంక్షలు విధించిందన్నారు. పెద్ద మొత్తంలో భూభాగాన్ని ఆక్రమించిన ఫైటర్లు, చైనాతో గల వాణిజ్య క్రాసింగ్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అధికారాన్ని ఆక్రమించిన తర్వాత జుంటాకు ఇది పెద్ద ఎదురుదెబ్బ. రాఖినె రాష్ట్రంలోని ఎన్‌గపాలి బీచ్‌కు కొద్ది కిలోమీటర్ల దూరంలో గల తాండ్వె పట్టణం సోమవారానికే నిర్మానుష్యంగా మారింది. పట్టణంలోని ప్రతి ఒక్కరూ పారిపోయారు.

మీకోసం

ఒక గ్లాసు నీళ్లల్లో నాలుగు వెల్లుల్లి రెబ్బలను దంచి వేసి ఈగలు వస్తున్న ప్రదేశంలో పెడితే ఈగల బెడద ఉండదు.

జీవన సౌరభం

లక్ష్యముండటమే కాదు, దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునే వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి.

పూట బత్తెం పుల్ల వెలుగు



భత్యం లేదా బత్తెం అంటే చేసిన పనికి లభించే వేతనం. పూట బత్తెం అంటే ఒక పూటకు వచ్చే కూలి లేదా ఆదాయం. పుల్ల వెలుగు అంటే కొద్ది సేపు మాత్రమే ఉండే వెలుగు. ఒకపూట సంపాదించి రేపటికై దాచుకోకుండా వెంటనే ఖర్చు చేసేవాళ్ళ విషయంలో 'పూట బత్తెం పుల్ల వెలుగు' అనే సామెత వాడతారు.

పూర్వం లడ్డ అనే గ్రామంలో వీరేసు కుటుంబం నివసిస్తూ ఉండేది. వీరేసుకి ముగ్గురు కొడుకులు. వీరికి చదువు సంధ్య అబ్బలేదు. చిన్నా చితకా వ్యాపారం చేసుకుంటూ డబ్బు సంపాదించేవారు. వీరేసుకి విలాసంగా బతకడమంటే చాలా ఇష్టం. 'తడి తక్కువ, తమాషా ఎక్కువ' అన్న చందాన వాయిదాల పద్ధతిలో విలాస వస్తువులన్నీ కొనుగోలు చేసేవాడు. చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా 'నేను అందరికంటే గొప్పవాడిని, నాకేంటి లోటు, దర్జాగా బతకాలి' అన్న భావన నరనరాన జీర్ణించుకు పోయినవాడు. బంగారం కానీ, స్వంత ఇల్లు కాని, బ్యాంక్‌లో కనీస నిల్వగాని లేకపోయినా వాయిదాల పద్ధతిలో కారు కొని వారాంతంలో కుటుంబంతో కలిసి పట్నానికి వెళ్లి సంబరాల రాంబాబులా విందు వినోదాలతో గడిపేవాడు.

తండ్రి తానా అంటే పిల్లలు తందానా అంటూ వాళ్లూ అలాగే తయారయ్యారు. తల్లిదండ్రులకు చెప్పకుండా ఎక్కడ పడితే అక్కడ అప్పులు చేసేవారు. అప్పులు చేయడంలో వారంతా అందెవేసిన చేయి. అలా ప్రతినెలా రాబడి కంటే మూడురెట్లు అప్పుల వాయిదాలు కట్టవలసి వచ్చేది. 'అవ్వ అరగదీసిన గంధం తాత వ్రణానికి సరిపోయిందన్నట్లు', నలుగురు కష్టపడి సంపాదించిన సంపాదన వాయిదాలు కట్టడానికే సరిపోయేది. చేతిలో చిల్లిగవ్వ మిగిలేది కాదు. పండగన్నా పబ్బమన్నా, అనారోగ్యమన్నా అంటే అప్పుకు పరిగెత్తాల్సిందే. ఇలాంటి జాగ్రత్త లేని, ముందు చూపులేని వ్యక్తుల నుద్దేశించి వాడే సామెత 'పూట బత్తెం పుల్ల వెలుగు'. పూట బత్తాన్ని పుల్ల వెలుగు ఆరే లోగా (తక్కువ సమయంలో) ఖర్చు చేస్తారని ఈ సామెత అర్థం. మన సమాజంలో ఇలాంటి వ్యక్తులు అనేక మంది ఉన్నారు. 'అయ్యవారుల గారి నట్టిల్లు' అనే సామెత కూడా ఇదే అర్థంలో వాడతారు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

జవాబు రాబట్టండి

2		6
9	5	
	3	8

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న పట్టికలోని గళ్లల్లో కొన్ని అంకెలు ఇచ్చాం. మిగిలిన గళ్లల్లో మీరు అంకెలు రాయాలి. అయితే ఏ వరుస కలిపినా వాటి మొత్తం 15 వచ్చేలాగా రాయాలి మరి. ట్రై చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

పేట కిరణ్ కుమార్,
10వ తరగతి,
శోధనపల్లి గ్రామం,
జడ్పీహెచ్ఎస్ స్కూలు,
సింగనమల మండలం,
అనంతపురం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలం.. జాగ్రత్త సుమా ..!

వర్షాకాలం మొదలైంది. ఓ వైపు ఎండలు కాస్తున్నా ఇంకోవైపు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సీజన్ మారిన క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎక్కువమంది దగ్గు, జలుబు, విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.

మే నెలలో కాసే మాదిరిగా ఉదయం పూట ఎండలు ఉండటం, సాయంత్రానికి కల్లా చల్లబడి వర్షం వస్తుండటం ఇటీవల కొన్ని రోజులుగా జరుగుతోంది. ఈ వాతావరణం వైరస్‌ల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత సీజనల్‌లో వైరల్ ఇన్ఫెక్షన్లు, జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. 100 మందిలో 30 మందికి జలుబు, 20 మంది జ్వరంతో కూడిన వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది.

అప్రమత్తత అవసరం

వర్షాకాలంలో విష జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. కొన్ని రోజులపాటు తగ్గకుండా ఇబ్బంది పెడుతుంటాయి. జ్వరంతో పాటుగా తీవ్రమైన తలనొప్పి, ఒళ్లనొప్పులతో రోగులు బాగా నీరసించిపోతుంటారు. ఒక్కోసారి ఆరోగ్యం బాగా క్షీణించి, ఓపిక నశించి నడవలేని పరిస్థితులు కూడా నెలకొంటాయి. ఇంకొందరు వంటిపై దద్దుర్లతో ఇబ్బందులు పడుతుంటారు. మరికొందరు దురదలతో బాధపడుతుంటారు. ఆహారం కలుషితమైన పరిస్థితుల్లో కొందరు వాంతులు, విరేచనాలు సంభవిస్తాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఇప్పుడే వ్యాపిస్తుంటాయి. ఈ సమస్యలకు వాతావరణంతో పాటు కలుషిత నీరు, ఆహారం కూడా కారణం. పోషకాహారం తీసుకోకపోయినా, పాడైపోయిన, కల్తీ ఆహారం తీసుకున్నా కూడా ఇన్ఫెక్షన్లు వ్యాపిస్తాయి. రక్తంలో ఉండే తెల్ల రక్త కణాల సంఖ్య క్రమంగా తగ్గడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు పిల్లలు, పెద్దల్లో చాలా వేగంగా వ్యాప్తి చెందుతాయి.

లక్షణాలు - ప్రభావాలు

విష జ్వరం సోకితే ఒళ్లు నొప్పులు, జ్వరం, నీరసం, నిస్సత్తువ, చర్మంపై దద్దుర్లు, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతునొప్పి, ముక్కు కారడం, దగ్గు, గొంతు నొప్పి, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జ్వరం వల్ల శరీరం పైభాగం ఎక్కువగా ప్రభావితం అవుతుంది. ముఖ్యంగా శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వైరస్ చాలా శక్తివంతంగా ఉంటే నరాలపై కూడా ప్రభావం ఉంటుంది. దానితో వివిధ రకాలుగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

జ్వరాలకు సంబంధించిన లక్షణాల్లో రెండు, మూడు కనిపించినా రోగికి ఎక్కువగా నీళ్లు తాగించాలి. దీని వల్లన శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. తర్వాత రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి. తాజా కొత్తిమీరతో చేసిన టీ, మెంతి వాటర్ తాగించాలి. పెద్దవాళ్లకైతే బార్లీ నీరు, గంజి తాగించడం మంచిది.

వైద్యుల సలహా కీలకం

టైఫాయిడ్, మలేరియా, అతిసార, వైరల్ ఫీవర్, జ్వరం వంటివి విపరీతంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించటం మేలు. వ్యాధి తీవ్రత విపరీతంగా ఉండి, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారు. డెంగ్యూ లక్షణాలు కన్పిస్తే 'ఎన్ఎస్1 యాంటీజెన్' పరీక్ష చేస్తారు. విపరీతమైన చలి జ్వరం ఉంటే మలేరియాగా అనుమానించి 'ర్యాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ పరీక్ష చేస్తారు.

గొంతునొప్పిని అశ్రద్ధ చేయొద్దు

ఈ సీజన్‌లో ఎక్కువమంది తరచూ 'గొంతు నొప్పి'కి గురౌతుంటారు. దీనికి 90 శాతం వైరస్‌లే కారణం. కాబట్టి దానిని తగ్గించేందుకు గోరు వెచ్చటి నీటిలో ఉప్పు వేసుకొని తరుచుగా పుక్కిట పట్టటం, లేదా మార్కెట్లో లభించే యాంటీసెప్టిక్ సిరప్ నీటిలో వేసుకొని పుక్కిట పట్టటం మంచిది. గొంతు నొప్పి తగ్గకున్నా, తెల్లటి చీము పొక్కుల వంటివి కనబడుతున్న వైద్యుడిని కలవాలి.

తడి వాతావరణం పట్ల అప్రమత్తం

ప్రస్తుత సీజన్‌లో తడి వాతావరణంతో జ్వరాలు చాలా త్వరగా వ్యాప్తి చెందుతున్నాయి. నీరు, ఆహార పదార్థాలు ఒకరు తీసుకున్నవి మరొకరు తినకుండా ఉండటం ఎంతో మేలు. సాధారణంగా జ్వరం వస్తే సుమారుగా తొమ్మిదిరోజులు వరకూ ఆ ప్రభావం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చల్లదనానికి శరీర భాగాలు శక్తి హీనంగా మారిపోతాయి. సూక్ష్మక్రిములు సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- వర్షాల్లో తడవకుండా ఉండాలి
- అతి చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- గొడుగు, రెయిన్ కోటు తప్పనిసరిగా ధరించాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి.
- పిల్లల లంచ్ బాక్స్‌లో పండ్లు ఎక్కువగా పెట్టాలి. నూనె పదార్థాలు తక్కువగా ఇవ్వాలి.
- జలుబు చేస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

టీని ఎంతసేపు మరిగించాలి?

మన దేశంలో టీని ఇష్టపడే వారికి కొదవలేదు. రోజుని టీ తాగడంతో మొదలు పెట్టి, టీ తాగడంతో ముగించేవారు చాలామంది ఉంటారు. టీ స్ట్రాంగ్‌గా ఉండాలని ఎక్కువ టీ ఆకులను వేయడం లేదా ఎక్కువసేపు మరిగించడం కూడా చాలామందికి అలవాటు. అయితే ఆరోగ్య పరంగా ఇలా చేయడం ఏమాత్రం ప్రయోజనకరం కాదని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసేపు మరిగించిన టీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందువల్ల టీ తాగడం ఇష్టపడేవారు టీని ఎంతసేపు మరిగించాలో తెలుసుకుందాం..

టీ తయారీకి అవసరమైన అన్ని పదార్థాలను జోడించిన తర్వాత, 4-5 నిమిషాలు మాత్రమే మరిగించాలి. టీని ఎక్కువ సేపు మరిగించడం వల్ల శరీరంలో ఐరన్, కాల్షియం లోపం ఏర్పడుతుంది. మిల్క్ టీని ఎక్కువ సేపు మరిగించడం వల్ల అందులో టానిన్ పరిమాణం పెరుగుతుంది. టానిన్ల పరిమాణం పెరగడం వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడుతుంది. దీంతో బాగా మరిగించి టీ తాగే అలవాటు ఉన్న వారు త్వరగా రక్తహీనతకు గురవుతారు.

జీర్ణ సమస్యలు : టీని ఎక్కువసేపు మరిగించడం వలన దానిలోని ఆమ్ల గుణాలు పెరుగుతాయి. అప్పుడు జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.

అధిక రక్తపోటు : ఇంతకుముందు తయారుచేసిన టీని మళ్ళీ మళ్ళీ మరిగించి తాగితే దానిలో టానిన్ పరిమాణం మునుపటి కంటే చాలా ఎక్కువగా పెరుగుతుంది. ఇది శరీరంలోని రక్తపోటును పెంచుతుంది.

పోషకాల లోపం : పాల టీని పదే పదే మరిగించి తాగడం వల్ల పాలలో ఉండే ప్రొటీన్, విటమిన్ డి, కాల్షియం వంటి అనేక పోషకాలు తగ్గుతాయి. లేదా పూర్తిగా నాశనం అవుతాయి.

'ఆస్కార్' సభ్యులుగా రాజమౌళి దంపతులు

ఆస్కార్ అకాడమీ కొత్త సభ్యులుగా 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందంలో ఒక్కొక్కరికి వరుస అవకాశాలు వస్తున్నాయి. తాజాగా రాజమౌళి దంపతులకు ఆహ్వానం అందింది. మోషన్ పిక్చర్ అండ్ సైన్స్ కేటగిరీలో.. మొత్తం 487 మంది కొత్త సభ్యుల జాబితాను సిద్ధం చేయగా అందులో వీరిద్దరికి కూడా అకాడమీ వారు ఆహ్వానం పలికారు. వీరితో పాటు షబానా ఆజ్మీ , రితేష్ సిద్వానీ , శీతల్ ఆర్మ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్ కుమార్ టక్కర్, నిషా పహుజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యాలు ఉన్నారు.

నిఖిల్‌పై కీలక సన్నివేశాలు

హీరో నిఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభు'. మారేడుమిల్లిలోని అత్యంత సుందరమైన ప్రదేశాల్లో ఈ సినిమా షూటింగ్ కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. అక్కడి దట్టమైన అడవుల్లో నిఖిల్‌పై కొన్ని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నిఖిల్ కెరీర్‌లో మలుపురాయిగా నిలుస్తుందని చిత్ర నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాలో లెజెండరీ వారియర్ పాత్రను నిఖిల్ పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన విదేశాల్లో ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్న విషయం తెలిసిందే. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం సమకూర్చగా, కెకె సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాకరన్ ప్రొడక్షన్ డిజైనర్. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు.

నేడు 'కల్కి 2898 ఏడీ' విడుదల

భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురువారంనాడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాపై అంచనాలను ప్రమోషన్ కంటెంట్‌తో చిత్రబృందం ఎప్పటికప్పుడు రెట్టింపు చేసింది. తాజాగా థీమ్ ఆఫ్ కల్కి లిరికల్ వీడియో విడుదల చేశారు. సంతోష్ నారాయణ్ స్వర పరచిన ఈ గీతాన్ని కాలభైరవ రాగయుక్తంగా, భావోద్వేగంగా ఆలపించారు. చంద్రబోస్ తన అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. కల్కి 2898 ఏడీ చిత్ర సారాంశం, పాత్రల తాలుకూ నేపథ్యం, వాటి సంఘర్షణ ఇవన్నీ... చంద్రబోస్ తన సాహిత్యంలో పొందుపర్చారు. ఈ పాటని మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశాపటానీ కీలక పాత్రలు పోషించారు.

నాలుగు పాత్రల్లో వరుణ్ తేజ

వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'మట్కా'. 'పలాస 1978' ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో సాగే కథతో వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం రాబోతోంది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న పాత్రల్లో కనిపించబోతున్నాడు. ప్రస్తుతం చిత్రం మూడో షెడ్యూల్ షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో కొనసాగుతుంది. ఈ షెడ్యూల్‌లో ఆర్ఎఫ్‌సీలో ప్రొడక్షన్ టీం 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్‌ను రీక్రియేట్ చేసినట్టు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు.

దురాగతాలను ఎదిరించే 'స్పిరిట్'

చెన్నెబోయిన చిన వెంకటస్వామి సమర్పించు 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, చిట్టిబాబు తదితరులు ప్రధాన తారాగణం. రమ్య, ప్రియ, పింకీ కొత్తగా పరిచయమవుతున్నారు. అక్కడక్కడ నేటికీ అమల్లో ఉన్న మాతంగుల జీవన విధానంపై ఈ సినిమాను తీశామనీ, పెత్తందారుల దురాగతాలను ఈ సినిమాలో చూపించామని నిర్మాత చెన్నెబోయిన వెంకట నర్సమ్మ తెలిపారు. ఈ చిత్రంలో ఒక పాటను చిత్రం శ్రీను ఆలపించారు. ఈ సినిమాకు దర్శకత్వం సిహెచ్.వెంకట రవీంద్రనాథ్.

స్టూడియోలు నిర్మించి ఉపాధి కల్పనకు కృషి

పవన్ హామీ

రాష్ట్రంలో కొత్త సినిమా స్టూడియోలు నిర్మించటం ద్వారా చిత్ర పరిశ్రమలో పనిచేసే వారికి మరింతగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కుమార్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారిని సాదరంగా ఆహ్వానించిన పవన్ వారి చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం ఆయా అసోసియేషన్లు ఇచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఆంధ్రప్రదేశ్‌లో సినిమా రంగం అభివృద్ధి కోసం కొన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనీ, షూటింగ్ స్పాట్‌లను అభివృద్ధి చేయాలనీ, కొత్తగా స్టూడియోల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డబ్బింగ్ స్టూడియోలు నిర్మించటం, సాంకేతిక నిపుణులకు మరింత అధునాతన శిక్షణలు ఏర్పాటు చేయటం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు వచ్చేలా చూడాలని కోరారు. దీనికి పవన్ స్పందిస్తూ, త్వరలోనే చిత్ర పరిశ్రమ అంశంపై చర్చించి సముచితమైన నిర్ణయం తీసుకుంటామని హామీఇచ్చారు.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా టీమిండియా

- నేడు సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో ఢీ
- పొంచివున్న వర్షం ముప్పు
- రాత్రి 8.00గం॥ల నుంచి

గయానా: టి20 ప్రపంచకప్-2024 ఓటమి ఎరుగని టీమిండియా నేడు డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో పోటీపడనుంది. లీగ్‌లో మూడు మ్యాచుల్లో, సూపర్-8లో మరో మూడు మ్యాచుల్లో విజయాలతో టీమిండియా దర్జాగా సెమీస్‌కు చేరింది. సూపర్-8లో భాగంగా చివరి లీగ్‌లో పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించి సెమీస్‌కు ముందే ఆ జట్టును పరిమితం చేయడంలో టీమిండియా పాలుపంచుకుంది. లీగ్‌లో పాకిస్తాన్‌పై మినహా ఈ టోర్నమెంట్‌లో టీమిండియా అన్నీ మ్యాచుల్లోనూ ఘన విజయాలను నమోదు చేసింది. అదే జోరును సెమీస్‌లో ఇంగ్లంపైనా చూపితే టీమిండియా ఫైనల్‌కు చేరనుంది. మరోవైపు కోహ్లి ఫామ్ అభిమానులను కలచివేస్తోంది. అతడు ఆడిన ఆరు మ్యాచుల్లోనూ ఒక్క అర్ధసెంచరీ చేయకపోగా.. తొలి వికెట్‌కు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడంలోనూ విఫలమౌతున్నాడు.

వర్షంతో రద్దయితే.. ఫైనల్‌కు టీమిండియా..

భారత్-ఇంగ్లండ్ సెమీఫైనల్ మ్యాచ్‌కు వరుణ గండం పొంచి ఉన్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ హెచ్చరించింది. మ్యాచ్ జరిగే సమయంలో 88 శాతం వర్షం పడే సూచనలున్నాయని వాతావరణశాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్ రద్దైతే టీమిండియా ఫైనల్‌కు చేరనుంది. షెడ్యూల్ ప్రకారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతే (ఒక్క బంతి కూడా పడకుండా) సూపర్-8 దశలో గ్రూప్ (గ్రూప్-1) టాపర్‌గా ఉన్న దృష్ట్యా టీమిండియా ఫైనల్ చేరుతుంది. ఒకవేళ భారత్-ఇంగ్లండ్ సెమీస్ మ్యాచ్‌కు వర్షం కారణంగా పాక్షికంగా అంతరాయం కలిగితే.. ఫలితం తేలేందుకు 250 నిమిషాల అదనపు సమయం ఉంటుంది. ఇక్కడ కూడా ఫలితం తేలకపోతే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ధారిస్తారు.

తొలి సెమీఫైనల్‌కు రిజర్వ్ డే...

దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ట్రినిడాడ్ వేదికగా ఉదయం జరిగే తొలి సెమీఫైనల్ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉన్నా.. ఆ మ్యాచ్‌కు ఐసిసి రిజర్వు డేను కేటాయించింది. ఒకవేళ వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దు అయితే షెడ్యూల్ ప్రకారం రిజర్వు డే అయిన మరుసటి రోజు మ్యాచ్ యథాతథంగా జరగనుంది.

జట్లు(అంచనా)..

ఇండియా : రోహిత్(కెప్టెన్), కోహ్లి, పంత్(వికెట్ కీపర్), సూర్యకుమార్, దూబే, హార్దిక్, అక్షర్, జడేజా, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్.

ఇంగ్లండ్ : బట్లర్(కెప్టెన్, వికెట్ కీపర్), సాల్ట్, బెయిర్‌స్టో, బ్రూక్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్, సామ్ కర్రన్, జోర్డాన్, ఆర్చర్, ఆదిల్ రషీద్, టోప్లే.

టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో నేడు..
ఆఫ్ఘనిస్తాన్ × దక్షిణాఫ్రికా
వేదిక: ట్రినిడాడ్; ఉ.6.00గం॥లకు

హర్మన్‌ప్రీత్‌కు పగ్గాలు

- నాల్గోసారి ఒలింపిక్స్‌లో ఆడనున్న శ్రీజేశ్, మన్‌ప్రీత్
- పారిస్ ఒలింపిక్స్‌కు హాకీ జట్టు ఎంపిక

బెంగళూరు: పారిస్ ఒలింపిక్స్‌కు హాకీ ఇండియా(హెచ్ఐ) పురుషుల జట్టును ఎంపిక చేసింది. 19మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్ వ్యవహరించనున్నాడు. సీనియర్ ఆట గాళ్లు పిఆర్ శ్రీజేష్, మన్‌ప్రీత్‌సింగ్‌లతో పాటు పలువురు స్టార్ ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. గోల్ కీపర్ శ్రీజేష్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్‌లకు ఇది నాలుగో ఒలింపిక్స్ కావడం విశేషం. ఇక రిజర్వ్ ఆటగాళ్లుగా నీలకంఠ శర్మ, జుగ్రాజ్ సింగ్, కృష్ణన్ బహదూర్‌లను ఎంపికయ్యారు. విశ్వక్రీడలకు భారత బృందం ఎంపికపై భారీ కసరత్తు చేశామని హెడ్‌కోచ్ క్రెగ్ ఫల్టన్ తెలిపాడు. 'పారిస్ ఒలింపిక్స్ కోసం టీమిండియా స్క్వాడ్ ఎంపిక కోసం చాలా కష్టపడ్డాం. చాలామంది నైపుణ్యంగల ఆటగాళ్లే కావడమే ఇందుకు కారణం. స్క్వాడ్‌లోకి వచ్చిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ఆట ఆడుతారనే నమ్మకం ఉంది' అని క్రెగ్ తెలిపాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత పురుషుల జట్టు కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

జట్టు: గోల్ కీపర్ : శ్రీజేష్, రవీంద్రన్. **డిఫెండర్లు:** జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్, హర్మన్‌ప్రీత్ సింగ్(కెప్టెన్), సుమిత్, సంజయ్. **మిడ్‌ఫీల్డర్లు :** రాజ్‌కుమార్, శంషేర్ సింగ్, మన్‌ప్రీత్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్, **ఫార్వర్డ్స్ :** అభిషేక్, సుఖ్‌జీత్, లలిత్, మన్‌దీప్ సింగ్, గుర్జంట్ సింగ్. **రిజర్వు:** నీలకంఠ శర్మ, జుగ్రాజ్ సింగ్, కష్ణన్ బహదూర్ పాఠక్.

ఓవర్లో 43పరుగులు

ఓలీ రాబిన్సన్ చెత్త బౌలింగ్ రికార్డు

లండన్: ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ కౌంటీల్లో ఓ చెత్త రికార్డును తన పేర లిఖించుకున్నాడు. సొంతగడ్డపై జరిగిన కౌంటీ మ్యాచ్‌లో రాబిన్సస్ వేసిన ఓవర్‌ను లిసెస్టర్‌షైర్ బ్యాటర్లు ఊచకోత కోశారు. ఒకే ఓవర్లో 43 పరుగులు పిండుకున్నారు. సస్సెక్స్ జట్టుకు ఆడుతున్న రాబిన్సన్ మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఈ చెత్త బౌలింగ్‌ను చేశాడు. రాబిన్సన్ బౌలింగ్‌లో లీసెస్టర్‌షైర్ బ్యాటర్ లూయిస్ కింబర్ 37 రన్స్ కొట్టగా.. మిగతా ఆరు పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. రాబిన్సన్ ఆ ఓవర్లో 9 బంతులు వేయగా.. కింబర్ ఏకంగా ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదేశాడు. దాంతో, ఈ స్పీడ్‌స్టర్ బిక్కమొహం వేశాడు. మరో కౌంటీ మ్యాచ్‌లో యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ సైతం 38 పరుగులు ఇచ్చాడు. భారత పర్యటనతో టెస్టుల్లో అరంగేట్రం చేసిన బషీర్ అద్భుతంగా రాణించాడు. దాంతో, ఇంగ్లండ్ జట్టులో స్థానాన్ని పదిలపరుచుకుంటాడనుకున్న బషీర్.. ఈ స్థాయిలో పరుగులివ్వడం ఆ దేశ క్రికెట్ బోర్డును కలవరపరుస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68